www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లకు 6 కమిటీలు

అభివృద్ధి, ప్రణాళికలు, అమలు కోసం ఏర్పాటు
సీఎం అధ్యక్షతన 2 స్టీరింగ్ కమిటీలు
సీఎస్ నేతృత్వంలో 2 ఎగ్జిక్యూటివ్ కమిటీలు
ఆయా రీజియన్ల సీఈవోల సారథ్యంలో మరో 2 అమలు కమిటీలు
సభ్యులుగా మంత్రులు, అధికారులు
విశాఖ రీజియన్ తరహాలో మాస్టర్ ప్లాన్లు
14

గురువారం | 26-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 351 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.12:34 తదుపరి ఏకాదశి, నక్షత్రం: మృగశిర మ.12:11 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: రా. 8:06-9:36, దుర్ముహూర్తం: ఉ.10:31-11:18, మ.3:11-3:57, అమృతఘడియలు: రా.1:23-2:53, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:39, సూర్యాస్తమయం: 6:17 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేను వస్తున్నా.. 50 మంది అధికారులను కేటాయించండి

అండర్‌వేర్, హెయిర్ ఆయిల్ రెడీగా పెట్టండి.. స్నానం కిట్‌లో సబ్బు, దువ్వెన, అద్దం ఉండాలి.. కొత్త దుప్పటి కావాలి
ప్రయాగ్‌రాజ్ పర్యటన కోసం బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజల్ కోర్కెల చిట్టా.. కేంద్రం సీరియస్.. షోకాజ్
2

అవినీతి పుట్టలో.. కోట్ల కట్టలు

2



దేబబ్రత మొహంతి; పట్టుబడిన సొమ్ము

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ దొరికిన ఒడిశా మైనింగ్ అధికారి
ఆయన ఇంట్లో సోదాల్లో 4 కోట్లు స్వాధీనం
ఆఫీస్ డ్రాలో మరో రూ.1.20 లక్షల నగదు



నేను లేకుంటే పాక్ ప్రధాని చచ్చేవాడు

అది 3.5 కోట్ల మంది ప్రజల మాట
నోరు జారిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి వ్యాఖ్య
2

దేవుళ్ల పవిత్రతకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం
కులం, మతం కాదు.. మంచి చేసేవారికి అండగా ఉండాలి
మార్కాపురం సభలో చంద్రబాబు పిలుపు


వెలిగొండ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మార్కాపురం జిల్లా.. జరిగిన అన్యాయాన్ని సవరిస్తూ మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా.. పోలవరం ప్రాజెక్టుతో నష్టపోయిన ప్రజలకు పోలవరం జిల్లా ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు 3 జిల్లాలూ ఇచ్చా.
గత పాలకుల్లా సరిహద్దు రాళ్లపై కూడా నా బొమ్మలు వేయించుకునే బుద్ధి నాకు లేదు. ప్రజల భూమిపై ప్రజలకే హక్కు కల్పించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు.
- సీఎం చంద్రబాబు


మార్కాపురం జిల్లా గంటవానిపల్లెలో రైతులతో కలిసి వెలిగొండ ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

మంచిని గెలిపించండి!

వైసీపీ దొంగ నాటకాలను అడ్డుకోండి: సీఎం

వెలిగొండ నుంచి జూలైనాటికి నీరిస్తాం
తొలిదశలో మార్కాపురం ప్రాంతానికి అందిస్తాం
ఇచ్చిన మాట మేరకు ఇప్పటికే 3 జిల్లాలిచ్చా
జగన్‌లా జనాలకు నామాలు పెట్టను
ప్రాజెక్టు పూర్తిచేయకుండానే నాడు జాతికి అంకితం
ఫీడర్ కాలువ లైనింగ్ పనులు చేయలేదు
నిర్వాసితులకు నష్టపరిహారమూ ఇవ్వలేదు
మేమొచ్చాక రూ.540 కోట్లతో గాడిలో పెట్టాం
ఇప్పుడు మరో 436 కోట్లతో లైనింగ్ పనులు: సీఎం



ఒంగోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'గతంలో ఇచ్చిన హామీ మేరకు మూడు కొత్త జిల్లాలు ఇచ్చా. వచ్చే జూలై నాటికి వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తా. మాజీ ముఖ్యమంత్రి జగన్‌లా జనాలకు నామాలు పెట్టే తత్వం కాదు నాది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉండవల్లి నుంచి బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు వెలిగొండ ప్రాజెక్టు వద్దకు చేరుకున్న ఆయన.. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద రూ.436 కోట్లతో చేపడుతున్న ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని
మిగతా 12వ పేజీలో...

వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో రైతులతో మాట్లాడుతూ నడుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అది ప్రణాళికాబద్ధమైన దాడి!

8వ తరగతి పిల్లలకు 'న్యాయవ్యవస్థలో అవినీతి'పై పాఠమా?
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫైర్



వ్యవస్థ సమగ్రతను దెబ్బతీయడానికి ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించను
ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా చట్టం తన పని తాను చేస్తుంది
ఎలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు.. ఇప్పటికే ఆదేశాలిచ్చా..
సుమోటోగా తీసుకుంటున్నా
చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరిక
నేడు సుమోటోగా విచారణ!
తక్షణమే స్పందించిన ఎన్‌సీఈఆర్‌టీ
వెబ్‌సైట్ నుంచి సాంఘిక శాస్త్రం పార్యపుస్తకం తొలగింపు

ఇది ముమ్మాటికీ న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించడమే. దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తే సహించేది లేదు. చట్టం కఠిన చర్యలు తీసుకుంటుంది.
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠంగా చేర్చడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది జ్యుడీషియరీపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించనని తేల్చిచెప్పారు. న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో పొందుపరిచింది. న్యాయవ్యవస్థలో అవినీతి, భారీగా పెండింగ్ కేసులు, న్యాయాధికారులు/న్యాయమూర్తుల కొరతను
మిగతా 2వ పేజీలో...

సార్... సోదాలకు వస్తున్నాం!

ఐపీఎస్ సంజయ్‌పై ఏసీబీ 'ప్రేమ'
తనిఖీల సమాచారం ముందుగానే లీక్
అపై మూడు రోజుల తర్వాత సోదాలు
ఈలోపే మొత్తం ఫర్నిచర్ తరలింపు
తనిఖీల్లో ఏమీ దొరకలేదంటూ నివేదిక


14

పరిమళించిన మానవత్వం


తల్లిదండ్రులతో పునర్విక్రశ్రీ

కర్నూలు జిల్లా చిన్నారి పునర్విక్రకు ప్రజల ఆపన్నహస్తం
'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన హృదయాలు

రూ.10 కోట్ల వరకు క్రౌడ్ ఫండింగ్

ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి 50 లక్షలు
రూ.16 కోట్ల ఇంజెక్షన్‌తో చిన్నారి బతికే అవకాశం
మిగిలిన 6 కోట్ల కోసం లోకేశ్‌కు తల్లిదండ్రుల విజ్ఞప్తి
ఆ డబ్బు సమకూర్చే బాధ్యత తీసుకుంటానని మంత్రి హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు/వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "మానవుడే మహనీయుడు.. మంచిని తలపెట్టినచో మనిషికడ్డులేదులే.." అంటూ అప్పుడెప్పుడో ఓ సినీగేయ రచయిత మనుషుల గొప్పతనాన్ని వివరిస్తూ ఓ పాట రాశారు. అది సమాజంలో ఏదో రూపంలో ఎన్నోసార్లు కనిపిస్తూనే ఉంటుంది. కర్నూలు జిల్లా చిన్నారి పునర్విక్రశ్రీ విషయంలోనూ మరోసారి ప్రస్ఫుటమైంది. 14 నెలల చిన్నారికి ప్రాణాంతకమైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే జన్యుపరమైన వ్యాధి సోకిందని తెలిసి ప్రజలంతా తల్లడిల్లిపోయారు. రూ.16 కోట్ల విలువైన
మిగతా 14వ పేజీలో...

గొంతు నులిమి.. ఇసుక దిబ్బల్లో పూడ్చి..

రెండో పెళ్లి చేసుకున్నాక.. కన్నబిడ్డనే కడతేర్చిన తల్లి
14



అమ్మమ్మ ఫిర్యాదుతో తిరుపతి జిల్లాలో వెలుగు చూసిన దారుణం
భార్యాభర్తల అరెస్టు.. మరొకరి కోసం గాలింపు
చిన్నారి దుర్గ



మా ఉత్తర్వులు అమలు చేయకపోవడం చూస్తుంటే.. ఉద్యోగాలకు ఎంపికైనవారు సీఎస్‌ను మేనేజ్ చేసినట్లు కనపడుతోంది. ఆ అధికారులతో ఆయన కుమ్మక్కయ్యారు. కోర్టు ఆదేశాల అమలుకు 11 నుంచి నేటి వరకు ఏం చేశారో చూపించండి. ఏజీ సూచనలతోనే ఉత్తర్వులు అమలు చేయనట్లు కనపడుతోంది.
- ధర్మాసనం



మా ఆదేశాలు అమలుచేయలేదేం?

'తక్షణం' అనే పదానికి అర్థం తెలియదా?.. సీఎస్‌ను నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

ఉత్తర్వులు అమలు చేస్తారా? జైలుకెళ్తారా?
సీఎస్‌ను నాలుగు రోజులు జైల్లో ఉంచితే ఇతర అధికారులు దారికొస్తారని వ్యాఖ్య
కోర్టు ఉత్తర్వులను సీఎస్సే గౌరవించకుంటే కింది అధికారులేం పాటిస్తారని మండిపాటు
ఉద్యోగాలకు ఎంపికైనవారు సీఎస్‌ను మేనేజ్ చేసినట్లుందని ఘాటు వ్యాఖ్యలు
ఉత్తర్వుల అమలుకు సమయం కోరిన సీఎస్
ఇప్పటికే 15 రోజులైందని బెంచ్ అసహనం
కనీసం 2 రోజులివ్వాలని అభ్యర్థించిన ఏజీ
నేటిలోగా ఉత్తర్వుల అమలుకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌పై హైకోర్టు మండిపడింది. గ్రూప్-1 మెయిన్స్‌లో ఎంపికైన అభ్యర్థులను తక్షణం కీలక పోస్టుల నుంచి అప్రాధాన్య పోస్టులకు మార్చాలని ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసి... రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు నివేదిక సమర్పించాలని ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని కోర్టు ముందు హాజరైన విజయానంద్‌ను నిలదీసింది. తక్షణం అనే పదానికి అర్థం తెలియదా? అని ప్రశ్నించింది. సీఎస్ మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నారని, ఈ నాలుగు రోజులు
మిగతా 3వ పేజీలో...

86 మంది గ్రూప్-1 అధికారుల బదిలీ

హైకోర్టు ఆదేశాలతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
జాబితాలో 25 మంది చొప్పున ఆర్డీవోలు, డీఎస్పీలు
22 మంది ఎంపీడీవోలు, 8 మంది ఏసీటీఓలు కూడా
రవాణా శాఖలో ఐదుగురు ఆర్‌టీవోల బదిలీ
3

ఇప్పుడే కాదు.. ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ

అండగా భారత్


టెల్ అవీవ్‌లో నెతన్యాహూతో ప్రధాని మోదీ ఆలింగనం
2

రక్తం, త్యాగంతో ఏర్పడిన బంధం మనది
ఇజ్రాయెల్ గడ్డపై 4 వేల మంది భారత సైనికులు ప్రాణాలర్పించారు.. ఇరు దేశాలూ ఉగ్రవాద బాధితులే
ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించాల్సిందే
గాజా శాంతి ప్రణాళికకు సంపూర్ణంగా మద్దతిస్తాం
ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌లో భారత ప్రధాని మోదీ
నరేంద్ర మోదీ నాకు సోదరుడి కంటే ఎక్కువ
ఆయన ఆలింగనానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ

తప్పు చేశా.. క్షమించండి!

గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి బిల్ గేట్స్ విజ్ఞప్తి
ఇద్దరు రష్యన్ మహిళలతో తనకు సంబంధం ఉన్నట్టు అంగీకారం
వారు ఎప్‌స్టీన్ బాధితులు కారని వివరణ
2



గజదొంగను పట్టుకోవాలి

తిరుమల లడ్డూ విషయంలో గుమస్తాలు, చిరుద్యోగులనే తప్పుబడుతున్నారు
చంద్రబాబు క్షమాపణలు చెప్పి ఉంటే ఈ అంశానికి ముగింపు పలికేవాళ్లం: బొత్స



ఆ గజదొంగ జగనేనా?

బొత్స వ్యాఖ్యలకు లోకేశ్ కౌంటర్
నాడు బాబాయ్‌ను చంపి కత్తి మా చేతిలో పెట్టారు
ఇప్పుడు వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్‌కు సంబంధం అంటగడుతున్నారు
జగన్, వైసీపీవన్నీ తప్పుడు ఆరోపణలు
నాడు మాపై పెట్టినవన్నీ తప్పుడు కేసులే
మీడియాతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్
13

రంగంలోకి ఎఫ్‌-22 రాప్టర్ ఫైటర్లు!

- అత్యాధునిక స్టెల్త్ జెట్లను ఇజ్రాయెల్‌కు తరలించిన అమెరికా.. త్వరలోనే ఇరాన్‌పై దాడి?

టెల్ అవీవ్, ఫిబ్రవరి 25: అణు ఒప్పందం విషయంలో ఎంతకూ దిగిరాకపోవడంతో ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచేదిశగా అమెరికా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆ దేశ అమ్ములపొదిలోని అత్యంత కీలకమైన స్టెల్త్ ఫైటర్ ఎఫ్‌-22లను ఇజ్రాయెల్‌కు తరలించింది. ఇప్పటికే రెండు భారీ విమానవాహక యుద్ధ నౌకలు సహా భారీ స్థాయిలో బలగాలను మధ్య ప్రాచ్యంలో మోహరించిన అమెరికా ఇప్పుడు ఎఫ్‌-22 రాప్టర్ ఫైటర్లను కూడా తరలించడం త్వరలో ఇరాన్‌పై దాడి మొదలవుతుందనే దానికి సంకేతమని ఇజ్రాయెల్ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వివరాలతో టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ తాజాగా కథనం ప్రచురించింది. యూకేలోని లాకెన్‌హీత్ ఎయిర్‌బేస్‌లోని ఈ ఫైటర్లను ఇరాన్‌కు సమీపంలో అందుబాటులో ఉండేలా ఇజ్రాయెల్‌కు తరలించినట్టు పేర్కొంది. ఎఫ్‌-22 రాప్టర్లు ప్రపంచంలోనే అత్యాధునికమైనవి. శత్రుదేశాల నిఘాకు, రాడార్లకు దొరకకుండా చొరబడి.. క్షిపణి రక్షక వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేయగల సామర్థ్యం వీటి సొంతం. ముందుగా వీటితో శత్రుదేశాల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేస్తే.. తర్వాత క్షిపణులతో, మిగతా ఫైటర్లతో విరుచుకుపడి కీలక లక్ష్యాలను ధ్వంసం చేయడం సులువు అవుతుంది. ఇప్పుడు అమెరికా దాడి మొదలుపెడితే.. ఇరాన్ గగనతలంలోకి మొదటగా ప్రవేశించేది ఎఫ్‌-22 రాప్టర్ ఫైటరేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

40 దేశాల పౌల్ట్రీ దిగుమతులపై సౌదీ నిషేధం

దుబాయి, ఫిబ్రవరి 25: భారత్ సహా 40 దేశాల పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతులపై సౌదీ అరేబియా పూర్తిస్థాయి నిషేధం విధించింది. ప్రపంచవ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ సహా కోళ్లకు సంబంధించిన వ్యాధులపై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సౌదీకి చెందిన ఒక అరబిక్ పత్రిక పేర్కొంది. మరో 16 దేశాలకు చెందిన కొన్ని రాష్ట్రాలు, నగరాల పౌల్ట్రీ ఉత్పత్తులపై పాక్షికంగా పరిమితులు విధించినట్టు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా వ్యాధుల పరిస్థితిపై నిరంతర పరిశీలన ఆధారంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సౌదీ ఫుడ్ అండ్ డ్రగ్ అథారిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. వీటిలో కొన్ని దేశాలపై 2004 నుంచే నిషేధం కొనసాగుతోందని, తాజా ముప్పు అంచనా మేరకు మరికొన్ని దేశాలను జాబితాలో చేర్చినట్టు పేర్కొంది. నిషేధం ఎదుర్కొంటున్న దేశాల్లో చైనా, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, జర్మనీ, ఇండోనేసియా, మయన్మార్, బ్రిటన్, ఈజిప్టు, మెక్సికో, పాలస్తీనా, జపాన్, హాంకాంగ్ తదితరాలు ఉన్నాయి. ఆయా దేశాలకు చెందిన కోళ్లు, గుడ్లపై పూర్తిస్థాయి నిషేధం విధించారు.

ఓటరు గుర్తింపు ధ్రువీకరణకు 10వ తరగతి అడ్మిట్ కార్డు, పాస్ సర్టిఫికెట్

- పశ్చిమ బెంగాల్‌లో 'సర్'పై సుప్రీంకోర్టు స్పష్టత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో గుర్తింపు ధ్రువీకరణ కోసం అనుబంధ డాక్యుమెంట్లుగా 10వ తరగతి అడ్మిట్ కార్డుతో పాటు పాస్ సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 10వ తరగతి అడ్మిట్ కార్డును స్వతంత్ర గుర్తింపు పత్రంగా అనుమతిస్తారా అంటూ సీనియర్ న్యాయవాది డీఆర్ నాయుడు ఆందోళన వ్యక్తం చేయడంపై ధర్మాసనం స్పందించింది. అడ్మిట్ కార్డు కేవలం అనుబంధ పత్రం మాత్రమేనని తెలిపింది.

టర్కీలో కుప్పకూలిన ఎఫ్‌-16 యుద్ధవిమానం

అంకారా, ఫిబ్రవరి 25: టర్కీ వైమానిక దళానికి చెందిన ఎఫ్‌-16 యుద్ధ విమానం బుధవారం తెల్లవారుజామున కుప్పకూలింది. బాలికేసర్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ ప్రమాదంలో పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ రక్షణ శాఖ ధ్రువీకరించింది. బాలికేసర్‌లోని తొమ్మిదో మెయిన్ జెట్ బేస్ నుంచి టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే విమానానికి రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. వెంటనే అప్రమత్తమైన రక్షణా బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా, ఇస్తాంబుల్-ఇజ్మీర్ జాతీయరహదారి సమీపంలో విమాన శకలాలు లభ్యమయ్యాయి. ప్రమాదంపై ఆదేశ ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

హేమంత్ సోరేన్‌కు సుప్రీంకోర్టులో ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌కు బుధవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈడీ నమోదు చేసిన మనీ లాండరింగ్ కేసుపై విచారణను నిలిపివేస్తూ స్టే ఇచ్చింది. తనపై ఈడీ పెట్టిన కేసును కొట్టివేయాలని, ప్రతిసారీ సమన్లు జారీ చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. స్టే మంజూరు చేయడంతో పాటు, వివరణ ఇవ్వాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. భూమి కుంభకోణంలో నగదు అక్రమ చలామణికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఎంపీ-ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టులో ఈడీ కేసు పెట్టింది. ఆ కేసును కొట్టివేయాలని సోరేన్ మొదట ట్రయల్ కోర్టు, తర్వాత హైకోర్టు ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

శాస్త్రీయ పద్ధతిలో గంజాయి దహనం


- ఫార్మాసిటీలోని సీడబ్ల్యూఎంపీలో 52,336 కిలోలు కాల్చివేత

పరవాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గత ఇరవై నెలల్లో పట్టుబడిన 52,336 కిలోల గంజాయి, 14218.7 లీటర్ల హ్యాష్ ఆయిల్ (ద్రవ గంజాయి)ని బుధవారం ఫార్మాసిటీలోని రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సీడబ్ల్యూఎంపీ)లో శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఈ ప్రక్రియను విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి ప్రారంభించారు. తొలుత ఐజీ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు గంజాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ 2024 జూన్ నుంచి 2026 జనవరి వరకూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 976 కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. 2,405 మందిని అరెస్టు చేసి రూ.9.19 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్టు తెలిపారు. 685 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 24 అంతర్రాష్ట్ర ముఠాలను గుర్తించి 129 మందిపై నిరంతర నిఘా ఉంచామన్నారు. గంజాయి దహన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో పూర్తి కావడానికి సుమారు పది రోజులు పడుతుందన్నారు.

ఇప్పుడే కాదు.. ఇజ్రాయెల్‌కు ఎప్పటికీ

అండగా భారత్

రక్తం, త్యాగంతో ఏర్పడిన బంధం మనది



బెన్ గురియన్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి నెతన్యాహు దంపతుల స్వాగతం

- ఇజ్రాయెల్ గడ్డపై 4 వేల మంది భారత సైనికులు ప్రాణాలర్పించారు
- మన రెండు దేశాలూ ఉగ్రవాద బాధితులే
- ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌లో మోదీ



మోదీ ప్రసంగానికి లేచి నిలబడి చప్పట్లు కొడుతూ అభినందనలు తెలుపుతున్న ఇజ్రాయెల్ ఎంపీలు



నెస్సెట్‌లో ప్రసంగిస్తున్న మోదీ

జెరూసలేం, ఫిబ్రవరి 25: భారత్, ఇజ్రాయెల్ మధ్య బంధం రక్తం, త్యాగాలతో ఏర్పడిందని ప్రధాని మోదీ అన్నారు. భారత్, యూదు నాగరికతల మధ్య ప్రాచీన కాలం నుంచి మంచి సంబంధాలున్నాయని తెలిపారు. మొదటి ప్రపంచ యుద్ధంలో 1918, సెప్టెంబరులో ప్రస్తుత ఇజ్రాయెల్‌లోని హైఫా వద్ద స్థానికులను కాపాడేందుకు శత్రువులతో పోరాడుతూ 4 వేల మంది కిపైగా భారత సైనికులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ రెండు దేశాలు ఉగ్రవాద బాధితులేనని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించాల్సిందేనని పునరుద్ఘాటించారు. రెండు రోజుల పర్యటన కోసం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న ప్రధాని మోదీ.. ఆ దేశ పార్లమెంటులోని హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నెస్సెట్‌లో ప్రసంగించారు. నెస్సెట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని మోదీయే. 'ఈ భూమితో భారత బంధం రక్తం, త్యాగాలతో ముడిపడి ఉంది. ఇక్కడ(నెస్సెట్) నిలబడటం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఒక గొప్ప నాగరికతకు చెందిన ప్రతినిధి.. మరో గొప్ప నాగరికతను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు' అని మోదీ అన్నారు.

మేమూ ఉగ్రవాద బాధితులమే

ఇజ్రాయెల్‌పై 2023, అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడిని మోదీ ఖండించారు. 'అక్టోబర్ 7దాడిలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి భారతీయుల సంతాపాలను మోసుకొని నేనిక్కడికి వచ్చాను. మీ బాధ మాకు తెలుసు. మీ దుఃఖాన్ని మేము అర్థం చేసుకోగలం. ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఇజ్రాయెల్‌కు మద్దతుగా భారత్ స్థిరంగా నిలబడుతుంది. సామాన్య పౌరులను చంపటాన్ని ఏవిధంగానూ సమర్థించుకోలేరు. సుదీర్ఘకాలంగా భారత్ కూడా ఉగ్రవాద బాధితురాలే. ముంబైలో 26/11 ఉగ్ర దాడుల్లో భారతీయులతోపాటు ఇజ్రాయెలీలు కూడా మరణించారు. మీలాగే మేము కూడా ఉగ్రవాదంపై కఠిన వైఖరితో ఉన్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగ్రవాదాన్ని సహించేది లేదు. ప్రపంచంలో ఎక్కడైనా శాంతికి ఉగ్రవాదంతో ముప్పే. ఉగ్రవాద నిర్మూలనకు అన్ని దేశాల మధ్య సమన్వయం అవసరం. అందుకే గాజా శాంతి ప్రణాళికకు భారత్ మద్దతిస్తోంది. ఈ ప్రణాళిక ఈ ప్రాంతంలోని ప్రజలందరికీ న్యాయం, శాంతి అందిస్తుందని భారత్ బలంగా నమ్ముతోంది' అని మోదీ తెలిపారు.

రక్షణ సహకారం ఎంతో ముఖ్యం

ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు రోజురోజుకు సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో నమ్మకమైన మిత్ర దేశాలైన భారత్‌-ఇజ్రాయెల్ మధ్య రక్షణ రహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవటం చాలా ముఖ్యమని మోదీ అన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ సహకారమే అతి ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌ను 'స్టార్టప్ దేశం' అని సంబోధించిన మోదీ.. భారత యువత కూడా ఆవిష్కరణల్లో దూసుకుపోతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సోదర సమానుడు: నెతన్యాహు


భారత ప్రధాని మోదీ తనకు స్నేహితుడికంటే ఎక్కువ అని, సోదర సమానుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. మోదీ కంటే ముందు నెస్సెట్‌లో ప్రసంగించిన ఆయన.. మోదీపై ప్రశంసలు కురిపించారు. 'ప్రపంచంలో గొప్ప నేతల్లో ఒకరు, నా ప్రియమైన మిత్రుడు నరేంద్రమోదీకి జెరూసలేం స్వాగతం పలుకుతోంది. నరేంద్ర (ఏకవచనం) నాకు మిత్రుడు, సోదరుడు. ఇజ్రాయెల్‌-భారత్ సంబంధాలను బలోపేతం చేయటంలో మోదీయే చాంపియన్. ఆయన ఇజ్రాయెల్‌కు గొప్ప స్నేహితుడు. మోదీ ఆలింగనం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అతి శక్తిమంతమైన దేశాల్లో భారత్ ఒకటి. ఇజ్రాయెల్ కూడా శక్తిమంతమైనదే. ఇస్లామిక్ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా మన రెండు దేశాలు కలిసి ఉక్కు బంధాన్ని ఏర్పాటు చేసుకోవాలి' అని పిలుపునిచ్చారు. కాగా, మోదీ ప్రసంగానికి ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు ప్రెసిడెంట్ ఐసాక్ అమిత్‌ను ఆహ్వానించకపోవటాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నెస్సెట్ నుంచి వాకౌట్ చేశారు.

మోదీకి 'స్పీకర్ ఆఫ్ ద కెనెసెట్ మెడల్'



జెరూసలేం, ఫిబ్రవరి 25: ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ పార్లమెంటు అత్యున్నత 'స్పీకర్ ఆఫ్ ద కెనెసెట్ మెడల్'ను బహూకరించింది. భారత్‌-ఇజ్రాయెల్‌ల మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసేందుకు అసాధారణ రీతిలో కృషి చేసినందుకు దీనిని అందజేసింది. ఇజ్రాయెల్ పార్లమెంటు అయిన కెనెసెట్‌లో మోదీ ప్రసంగం పూర్తి కాగానే స్పీకర్ అమిర్ ఒహానా ఈ పురస్కారాన్ని బహూకరించారు. దీన్ని అందుకున్న తొలి నేత మోదీయే కావడం గమనార్హం. ఇజ్రాయెల్‌తో పాటు పాలస్తీనా నుంచి కూడా అత్యున్నత పతకాలు అందుకున్న అరుదైన ప్రపంచనేత మోదీయే కావడం విశేషం. ఆయన 2018లో పాలస్తీనా నుంచి 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా' పురస్కారాన్ని స్వీకరించారు.

లోకం తీరు



ప్రధాని మోదీకి ఇజ్రాయెల్‌లో ఘనస్వాగతం

టెల్ అవీవ్, ఫిబ్రవరి 25: రెండు రోజుల అధికారిక పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లిన మోదీకి ఘన స్వాగతం లభించింది. టెల్ అవీవ్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెన్ గురియన్ విమానాశ్రయంలో దిగిన మోదీకి.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా నెతన్యాహు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారు. మోదీని నెతన్యాహు ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా తన సతీమణి సారా ధరించిన వస్త్రాలతో మోదీ కోటు జేబులో ఉన్న రుమాలు రంగు సరిపోలిందని నెతన్యాహు అనగా.. అది 'కాషాయ' రంగు అని మోదీ నవ్వుతూ చెప్పారు. గురువారం ఇద్దరు ప్రధానులు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. మోదీ పర్యటనకు ఇజ్రాయెల్ మీడియా అమిత ప్రాధాన్యం ఇచ్చింది. జెరూసలేం పోస్ట్ పత్రిక బుధవారం నాటి సంచిక మొదటి పేజీలో మోదీ అభివాదం చేస్తున్న ఫొటోను ముద్రించి..'వెల్‌కమ్.. మోదీ' అని హెడింగ్ పెట్టింది. హిందీలో 'నమస్తే' అని క్యాప్షన్ ఇచ్చింది.

ట్రేడ్ డీల్ గురించి అడిగితే.. ఇజ్రాయెల్‌కు జారుకున్నారు: రాహుల్

ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్‌- అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని రద్దుచేసుకొనే ధైర్యం ఉందా అని తాను సవాల్ చేసి 24 గంటలైనా స్పందించని ప్రధాని మోదీ.. సైలెంటుగా ఇజ్రాయెల్‌కు జారుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఇజ్రాయెల్‌లో డ్యాన్స్ చేశారని, పాటలు పాడారని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చెప్పినట్లుగా కాకుండా.. ఈసారైనా దేశ వ్యతిరేక పనులు చేయకుండా తిరిగి వస్తారా? అని ప్రశ్నించారు. నెతన్యాహును ప్రపంచమంతా విమర్శిస్తుంటే.. మోదీ ఆయనను ప్రియమైన మిత్రుడు అని సంబోధించటం సిగ్గుచేటు అని జైరాం రమేశ్ అన్నారు.

నేను లేకుంటే పాక్ ప్రధాని చచ్చేవాడు

అది 35 లక్షల మంది ప్రజలు మాట అంటూ నోరుజారిన అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్, ఫిబ్రవరి 25: భారత్‌-పాక్ యుద్ధం సమయంలో తాను కల్పించుకోకుంటే పాకిస్థాన్ ప్రధాని చనిపోయేవాడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పొరపాటున వ్యాఖ్యానించారు. తాను లేకుంటే భారత్‌-పాక్ మధ్య అణుయుద్ధం జరిగి ఉండేదని మరోసారి పేర్కొన్నారు. అమెరికా స్టేట్ ఆఫ్ యూనియన్ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికన్లకు దేశంలో, బయటా భద్రతను పునరుద్ధరించినందుకు గర్వపడుతున్నాను. నేను రెండోసారి అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలు ఆపాను. భారత్‌-పాక్ మధ్య అణుయుద్ధం జరిగి ఉండేది. నేను కల్పించుకోకుంటే పాక్ ప్రధాని చనిపోయేవారని 3.5 కోట్ల మంది ప్రజలు చెప్పారు" అని పేర్కొన్నారు. అయితే తాను జోక్యం చేసుకోకుంటే 3.5 కోట్ల మంది ప్రజలు చనిపోయేవారని పాక్ ప్రధాని అన్నారని చెప్పబోయి ట్రంప్ పొరపాటు పడినట్టు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. కాగా,భారత్ నుంచి దిగుమతి అయ్యే సౌర విద్యుత్ పరికరాలపై అమెరికా 126 శాతం సుంకం విధించింది. భారత్ సౌర విద్యుత్ పరికరాల పరిశ్రమలకు అడ్డగోలుగా సబ్సిడీలు ఇస్తుండటంతో అవి తక్కువ ధరకే అమెరికా మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయని పేర్కొంది.

అది ప్రణాళికాబద్ధమైన దాడి!

(మొదటి పేజీ తరువాయి)

కూడా అందులో ప్రస్తావించింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' పేరుతో ఈ అధ్యాయాన్ని చేర్చింది. గత సంచికల్లో న్యాయవ్యవస్థ, కోర్టుల పాత్ర వరకే పరిమితం కాగా.. సోమవారం విడుదల చేసిన నూతన పాఠ్యపుస్తకంలో కోర్టుల వ్యవస్థ, న్యాయం ఎంతవరకు అందుతోంది.. అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అవినీతి, ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో దాని ప్రభావం గురించి వివరించారు. ఈ అంశాన్ని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎస్.పంచోలితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఆ పాఠ్యపుస్తకంలోని సదరు అధ్యాయం అవమానకరంగా ఉందని.. ఆ పుస్తకం ప్రతులు తమ వద్ద ఉన్నాయని సిబల్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో 8వ తరగతి పిల్లలకు న్యాయవ్యవస్థలో అవినీతిని నేర్పిస్తుండడం చూసి ఈ వ్యవస్థలో సభ్యులుగా ఆందోళన చెందుతున్నామన్నారు. న్యాయవ్యవస్థలో మాత్రమే అవినీతి ఉన్నట్లు పేర్కొన్నారని.. రాజకీయ నాయకులు, మంత్రులు, బ్యూరోక్రాట్లు, ఇతరుల గురించి ఒక్క మాట కూడా లేదని.. ఇది తమను కలవరపరుస్తోందని సింఘ్వీ అన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందించారు. 'ఇది కచ్చితంగా మొత్తం వ్యవస్థను, అందులోని భాగస్వాములను ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్క రోజు ఆగండి. ఇప్పటికే నేను సుమోటోగా ఈ వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకున్నాను. ఆదేశాలు కూడా ఇచ్చాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, సమగ్రతను దెబ్బతీయడానికి ఈ భూమ్మీద ఏ ఒక్క వ్యక్తినీ అనుమతించే ప్రసక్తే లేదు. ఏ పరిస్థితుల్లోనూ ఇందుకు అనుమతించను. ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లినా.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. దీనినెలా డీల్ చేయాలో నాకు బాగా తెలుసు' అని సీజేఐ తేల్చిచెప్పారు. ఇది చాలా ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా కనిపిస్తోందన్నారు. ఇంతకు మించి ఏమీ మాట్లాడాలనుకోవడం లేదని చెప్పారు. తన విధి తాను నిర్వర్తించానని స్పష్టంచేశారు. ఈ అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చినందుకు సిబల్, సింఘ్వీలకు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా.. ఈ వివాదంపై త్రిసభ్య ధర్మాసనం గురువారం సుమోటోగా విచారణ జరిపే అవకాశముంది.



వెబ్‌సైట్ నుంచి 'పాఠ్యపుస్తకం' మాయం

సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం నేపథ్యంలో ఎన్‌సీఈఆర్‌టీ తక్షణమే స్పందించింది. తన వెబ్‌సైట్ నుంచి 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని తొలగించింది. అందులోని న్యాయవ్యవస్థ తాలూకు వివాదాస్పద అంశాలను కూడా తొలగించాలని జాతీయ మండలి యోచిస్తోందని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ స్వతంత్ర సంస్థ అని.. పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాలను చేర్చేటప్పుడు దాని అధికారులు బుర్రపెట్టి ఉండాల్సిందని కేంద్రప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానించాయి. న్యాయవ్యవస్థకు సంబంధించిన సదరు అంశాల కూర్పులో సమతౌల్యం లేదని పేర్కొన్నాయి. 'పెండింగ్ కోర్టు కేసులు, న్యాయవ్యవస్థలో అవినీతిపై ఆ పుస్తకంలో చర్చించారు. అయితే భారత వ్యవస్థాగత ఫ్రేమ్‌వర్క్ ఎలా ఉంటుందో చెప్పడమే దాని ఉద్దేశమైతే.. పార్లమెంటు, కార్యనిర్వాహక వర్గం పాత్రలకు కూడా సమ ప్రాధాన్యం ఇచ్చి ఉండాల్సింది. కేవలం న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలనే ప్రస్తావించడం వల్ల విద్యార్థుల్లో తప్పుడు అవగాహన సృష్టించే అవకాశం ఉంది' అని స్పష్టం చేశాయి. ఈ వ్యవహారంపై ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ ప్రసాద్ సక్లానీ స్పందించలేదు.


తప్పు చేశా.. మన్నించండి!

- ఎప్‌స్టీన్ వ్యవహారంలో గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి బిల్ గేట్స్ క్షమాపణ
- ఇద్దరు రష్యన్ మహిళలతో తనకు ఎఫైర్లు ఉన్నట్లు అంగీకారం



న్యూయార్క్, ఫిబ్రవరి 25: ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారంలో చిక్కుకుని ఢిల్లీలో ఇటీవల జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు నుంచి వైదొలగిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్.. తాను తప్పుచేశానని తాజాగా అంగీకరించారు. లైంగిక నేరగాడైన జోసెఫ్ ఎప్‌స్టీన్‌తో తనకు అనుబంధం ఉందని తెలిపారు. ఇందుకుగాను గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి బహిరంగ క్షమాపణ చెప్పారు. ఈ విషయాన్ని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' మంగళవారం ప్రచురించింది. 'మంగళవారం టౌన్‌హాల్ మీటింగ్ సందర్భంగా ఎప్‌స్టీన్‌తో లింకులపై అడిగిన ప్రశ్నలకు గేట్స్ జవాబులిచ్చారు. ఇద్దరు రష్యన్ మహిళలతో ఎఫైర్లు ఉన్నాయని అంగీకరించారు. అయితే వారిద్దరితో సంబంధ బాంధవ్యాలకు, ఎప్‌స్టీన్ బాధితులకు సంబంధం లేదని స్పష్టత ఇచ్చారు' అని గేట్స్ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఎప్‌స్టీన్ చట్టవిరుద్ధ ప్రవర్తనతో తనకు సంబంధం లేదని గేట్స్ తెలిపారు. 'నేనెలాంటి అక్రమాలూ చేయలేదు.. చూడలేదు. ఎప్‌స్టీన్ చుట్టూ ఉన్న బాధిత మహిళలతో సమయం గడపలేదు. ఇద్దరు రష్యన్ మహిళలతో మాత్రం ఎఫైర్లు ఉండేవి. వారిలో ఒకరు బ్రిడ్జ్ ప్లేయర్. బ్రిడ్జ్ పోటీల సందర్భంగా ఆమెను కలిసింది. రెండో మహిళ రష్యా న్యూక్లియర్ ఫిజిసిస్ట్. వ్యాపార కార్యకలాపాల సందర్భంగా ఆమెను కలిశాను. ఈ రెండు ఎఫైర్ల గురించి ఎప్‌స్టీన్‌కు తర్వాత తెలిసింది. అయితే ఇవి అతడి నేరపూరిత కార్యకలాపాలకు సంబంధించినవి కావు' అని గేట్స్ తేల్చిచెప్పారు. ఓ మైనర్‌తో లైంగిక కార్యకలాపాలు నడిపానని 2008లో ఎప్‌స్టీన్ నేరాంగీకారం ఇచ్చాడు. ఆ తర్వాత మూడేళ్లకు 2011లో అతడితో తొలిసారి భేటీ అయ్యానని గేట్స్ వెల్లడించారు. అయితే అతడి నేపథ్యాన్ని సరిగా తెలుసుకుని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఎప్‌స్టీన్ వ్యవహారంలో తన (మాజీ) భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్ ఎప్పుడూ అనుమానిస్తుండేవారని.. 2013లో ఆమె ఆందోళన వ్యక్తం చేశాక కూడా అతడితో భేటీలు కొనసాగించానన్నారు. 2014లో ప్రైవేటు జెట్‌లో ఎప్‌స్టీన్‌తో కలిసి ప్రయాణించానని.. అతడిని కలవడం అదే చివరిసారని గేట్స్ చెప్పారు.

అండర్‌వేర్, హెయిర్ ఆయిల్ రెడీగా పెట్టండి



వివేక్ బంజల్

- నా ట్రిప్ కోసం 50 మందిని కేటాయించండి
- ప్రయాగ్‌రాజ్ పర్యటన కోసం కింది అధికారులకు బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ కోర్కెల చిట్టా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: "రాజు వెడలె రవితేజము లలరగ" అని పాడుకుంటూ మురిసిపోయారో..! లేదంటే చిటికేస్తే కింద అధికారులు వణుకుతూ చెప్పిన పనినల్లా చేస్తారని భావించారో కానీ, తన పర్యటన కోసం బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ (సీఎఫ్ఏ) వివేక్ బంజల్ కింది అధికారులకు ఇచ్చిన ఆదేశాలు చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఈనెల 25, 26 తేదీల్లో తన ప్రయాగ్‌రాజ్ పర్యటన కోసం సిద్ధం చేయాల్సిన ఓ భారీ జాబితాను కింది అధికారులకు బంజల్ పంపారు. అందులో ఆయన.. తన స్నానం కోసం కావాల్సిన సామగ్రితో పాటు ఆలయాల సందర్శన సమయంలో చేయాల్సిన ఏర్పాట్ల వరకు 21 పనుల కోసం 50 మంది అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. తాను దిగే హోటల్ వద్ద డ్రైఫ్రూట్ బౌల్, ఫ్రూట్ బౌల్, షేవింగ్ కిట్, టవల్, టూత్‌పేస్ట్, బ్రష్, సబ్బు, షాంపూ, దువ్వెన, ఆయిల్ వంటివి సిద్ధం చేయాలన్నారు. సంగమం వద్ద స్నానానికి సిద్ధం చేయాల్సిన కిట్‌లో టవల్, అండర్‌గార్మెంట్లు, కొత్త చెప్పులు, దువ్వెన, అద్దం, ఆయిల్ బాటిల్, ఘాట్ వద్ద కూర్చోడానికి కొత్త దుప్పటి కావాలన్నారు. ఈ ఆదేశాల చిట్టా వైరల్ అయ్యి ఆయన తీరు విమర్శల పాలు కావడంతో చివరకు బంజల్ పర్యటన రద్దు చేసుకున్నారు. బంజల్ వ్యవహారం తెలిసి కేంద్ర సమాచార శాఖమంత్రి సింధియా వివేక్‌పై చర్యలకు ఆదేశించారు. 7రోజుల్లో సమాధానం చెప్పాలని ఉన్నతాధికారులు ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

అవినీతి పుట్టలో.. కోట్ల కట్టలు

- 30 వేలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు

భువనేశ్వర్, ఫిబ్రవరి 25: ఆయన ఒడిశా మైనింగ్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్. పేరు దేవబ్రత మొహంతి. ఓ లైసెన్సు ఉన్న బొగ్గు వ్యాపారి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఉన్నప్పుడు విజిలెన్స్ అధికారులకు మంగళవారం దొరికారు. ఇదేదో చిన్న పామేలే అని మొదట్లో అనుకున్నారు. కానీ ఆయన ఇళ్లలో తనిఖీలు చేశాక తెలిసింది అదో పే....ద్ద అవినీతి అనకొండ అని. భువనేశ్వర్‌లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి అక్కడ ఉన్న ట్రాలీ బ్యాగ్‌ల్లో కూరి పెట్టిన నోట్లను లెక్కిస్తే రూ. 4 కోట్లుగా తేలింది. ఇది కాకుండా ఆయన ఆఫీస్ టేబుల్లో ఉన్న రూ. 1.20 లక్షలను కూడా సీజ్ చేశారు. అంతేగాక 130 గ్రాముల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. మహంతిపై కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేశారు.

మాజీ బ్రాంచ్ మేనేజరే సూత్రధారి

- 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్' బ్యాంకులో రూ.590 కోట్ల మోసం కేసులో నలుగురి అరెస్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: చండీగఢ్‌లో ఉన్న 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్' బ్యాంకు శాఖలో హరియాణా ప్రభుత్వ ఖాతాలకు సంబంధించి రూ.590కోట్ల మోసం వ్యవహారంలో సూత్రధారి ఆ శాఖలో అంతకుముందు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన రిభవ్ రిషి అని దర్యాప్తులో తేలింది. రిభవ్ అదే బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేసిన అభయ్‌తో కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది. ఆ డబ్బును రిభవ్ భార్య స్వాతి, బావమరిది అభిషేక్‌లకు చెందిన 'స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్' అనే కంపెనీ ఖాతాకు తరలించినట్లు హరియాణా ఏసీబీ డైరెక్టర్ జనరల్ చావ్లా తెలిపారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. రిభవ్, అభయ్ ఇద్దరూ బ్యాంకులో పనిచేస్తున్నప్పుడే ఈ మోసానికి పాల్పడ్డారు. 6నెలల క్రితం ఉద్యోగాలకు రాజీనామా చేశారు. అయితే, హరియాణా ప్రభుత్వం ఇటీవల తమ ఖాతాలను మూసివేయాలని, ఆ డబ్బును వేరే బ్యాంకు ఖాతాల్లోకి పంపించాలని కోరడంతో మోసం బయటపడింది.

వాతావరణ అనిశ్చితి!

రుతుపవన ముందస్తు వర్షాలు కాస్త ముందుగానే...

- వాతావరణంలో మార్పులే కారణం
- రాష్ట్రంలో అక్కడక్కడ ఈదురుగాలులతో వానలు
- ఎచ్చెర్లలో 4.3 సెం.మీ. వర్షపాతం
- నేడు కోస్తాలో పిడుగులతో వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి సీజన్‌లో కురిసే రుతుపవన ముందస్తు వర్షాలు ఈ ఏడాది కాస్త ముందుగానే పడ్డాయి. మూడు రోజుల నుంచి కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలో మార్పులకు ఇది సంకేతమని నిపుణులు చెబుతున్నారు. ఒకవైపు రోజు ఎండలు పెరగడం, సముద్రం నుంచి తేమగాలులు వీస్తుండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ సీజన్‌లో సుదీర్ఘకాలం శీతాకాలం కొనసాగింది. చలి తీవ్రత ఉన్న సమయంలోనే ఎండలు పెరిగాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో అక్కడక్కడ ఆవరించిన అధిక పీడనం ప్రభావంతో సముద్రం నుంచి భారీగా తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ అనిశ్చితి నెలకొని మధ్యభారత, దానికి ఆనుకుని ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీనిలో భాగంగానే బుధవారం శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. సాయంత్రం వరకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 4.3 తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో 2.5, పోలవరం జిల్లా దేవీపట్నంలో 2.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. తాజాగా కర్నూలులో 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, మిగిలినచోట్ల ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఉపరితల ద్రోణి ప్రభావంతో గురువారం కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

టీటీడీ గదుల పేరుతో మోసం

- నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలని సూచన
- ఇప్పటివరకు 70 గుర్తించిన అధికారులు

తిరుమల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీటీడీ గదుల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. తిరుమలలో గదులు ఇప్పిస్తామంటూ భక్తులను మోసగిస్తున్నారు. తిరుమలలో వరాహస్వామి, పాంచజన్యం, కౌస్తుభం ఇలా కొన్ని పేర్లతో దాదాపు 70 నకిలీ వెబ్‌సైట్లు ఉన్నట్టు టీటీడీ విజిలెన్స్ విభాగం గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. తాజాగా కేరళకు చెందిన సురేష్ బాబు అనే భక్తుడు 'కర్ణాటక ప్రవాసి సౌధ' వెబ్‌సైట్ ద్వారా గది పొందేందుకు ప్రయత్నించి మోసపోయారు. దీనిపై ఆయన ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో టీటీడీ విజిలెన్స్ విభాగం లోతుగా దర్యాప్తు చేసింది. తిరుమల శ్రీవారి ఆలయ చిత్రాలు, టీటీడీ పేరు, లోగోతో అనధికారికంగా నకిలీ వెబ్‌సైట్లతో భక్తులను మోసగిస్తున్నట్టు తేలింది. ఇప్పటికే టీటీడీ ఐటీ విభాగం చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే టీటీడీ విజిలెన్స్ విభాగం కూడా ఈ నకిలీ వెబ్‌సైట్లపై కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతోంది. కాగా, ఈ అంశంపై స్పందించిన టీటీడీ.. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్'నే వినియోగించాలని బుధవారం ఓ ప్రకటనలో సూచించింది.

ఏపీఆర్‌సెట్ ర్యాంక్ కార్డుల విడుదల

తిరుపతి(మహిళా వర్సిటీ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ర్యాంక్ కార్డులను మండలి ఛైర్మన్ ప్రొఫ్ కె. మధుమూర్తి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ బుధవారం విడుదల చేశారు. పూర్తి వివరాల కోసం ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ (https://cets.apsche.ap.gov.in/ RCET)లో చూడాలని ప్రొఫెసర్ ఆర్.ఉష, కో-కన్వీనర్ ప్రొఫెసర్ జాన్ సుష్మ సూచించారు.

ఈగల్‌కు ఎన్‌డీపీఎస్ నియంత్రణ అధికారాలు

- సెబ్ రద్దు నేపథ్యంలో నిర్ణయం

నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రోపిక్ పదార్థాలు(ఎన్‌డీపీఎస్), గంజాయిపై నియంత్రణ అధికారాలను ఈగల్‌కు అప్పగిస్తూ ఎక్సైజ్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వంలో ఈ అధికారాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)కు అప్పగించగా, కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దుచేసింది. ఈ నేపథ్యంలో ఆ అధికారాలను ఈగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్‌కు అప్పగిస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో ఎక్సైజ్ శాఖ తెలిపింది.

పోలీసులపై ఫిర్యాదులకు 'కంప్లైంట్ అథారిటీ'

- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటుకు ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పోలీసులపై వచ్చే తీవ్రమైన ఫిర్యాదులను స్వతంత్రంగా విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంప్లైంట్ అథారిటీ ఏర్పాటుకు మార్గదర్శక ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడైనా పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే బాధితులకు న్యాయం చేసేందుకు ఈ అథారిటీ సిద్ధంగా ఉంటుంది. కస్టడీ మరణాలు, అక్రమ నిర్బంధం, అత్యాచారం, భూ దందాలు, అధికార దుర్వినియోగం తదితర కేసుల్ని ప్రత్యేకంగా పరిశీలిస్తుంది. రాష్ట్ర స్థాయిలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఛైర్మన్‌గా, సివిల్ సర్వీసు, పోలీసు, సివిల్ సొసైటీ నుంచి ఐదుగురికి మించకుండా సభ్యులు ఈ అథారిటీలో ఉంటారు. జిల్లా స్థాయిలో రిటైర్డ్ జిల్లా జడ్జి ఛైర్మన్‌గా, రిటైర్డ్ సీనియర్ సివిల్ సర్వెంట్, అదనపు ఎస్పీ స్థాయి పోలీసు అధికారి, సివిల్ సొసైటీ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. అదనపు ఎస్పీ, అంతకు పై అధికారులపై ఆరోపణలు వస్తే రాష్ట్ర స్థాయి అథారిటీ.. డీఎస్పీ అంతకు దిగువ స్థాయి పోలీసులపై ఫిర్యాదుల్ని జిల్లా అథారిటీ విచారిస్తుంది. విచారణ 90రోజుల్లో పూర్తి చేసి బాధితులకు న్యాయం చేకూర్చే బాధ్యత కమిటీపై ఉంటుంది.

మోదీ ఎన్నికను రద్దు చేయాలి

- రాష్ట్రపతి, ఈసీకి వైఎస్ఆర్‌సీపీ వ్యవస్థాపకుడు శివకుమార్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల్లో వారాణసీ నుంచి పోటీ చేసి గెలిచిన ప్రధాని మోదీ నామినేషన్‌ను తక్షణమే తిరస్కరించి, ఆయన ఎన్నికను రద్దు చేయాలని వైఎస్ఆర్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ కొలిశెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రపతికి, కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన ఫిర్యాదులు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి నాగ పుల్లారావు అఫిడవిట్‌లో పార్ట్ బి, కాలమ్ 8లోని కాలమ్స్‌ని ఖాళీగా వదిలేశారన్న కారణంతో ఆయన నామినేషన్‌ను ఈసీ తిరస్కరించిందని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ప్రధాని మోదీ అఫిడవిట్‌లో కూడా అదే కాలమ్ 8లోని పలు కాలమ్స్ ఖాళీగా ఉన్నప్పటికీ నామినేషన్‌ను ఆమోదించిందన్నారు. మోదీ విషయంలో ఎన్నికల సంఘం పక్షపాతం చూపి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు.

రాష్ట్రపతి భవన్‌లో కలంకారీ గ్యాలరీ


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కలంకారీ చిత్రం గురించి వివరిస్తున్న విశ్వనాథరెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా శ్రీకాళహస్తి కళాకారులతో కలంకారీ ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నారు. శ్రీకాళహస్తి నుంచి పేరొందిన 21 మంది కళాకారులు రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. కళాకారులు గీసిన కలంకారీ చిత్రాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం పరిశీలించారు. జాతీయ అవార్డు గ్రహీత విశ్వనాథరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



మా ఆదేశాలు అమలు చేయలేదేం?

(మొదటి పేజీ తరువాయి)

జైల్లో ఉంచితే ఇతర అధికారులు దారికొస్తారని వ్యాఖ్యానించింది. ఉత్తర్వులు అమలు చేస్తారా? లేదా జైలుకి వెళ్తారా? అని సీఎస్‌ను ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను సీఎస్‌యే గౌరవించకుంటే కింది అధికారులకు ఇంకేమి గౌరవం ఉంటుందని నిలదీసింది. కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన అవసరం లేదని కింది అధికారులకు సందేశం ఇస్తున్నారా అని ప్రశ్నించింది. కీలక పోస్టుల్లో ఉన్న అధికారులు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని ఎంపిక కాని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఎంపికైన వారిని అప్రాధాన్య పోస్టులకు మార్చాలని ఆదేశాలిచ్చామని పేర్కొంది. తమ ఉత్తర్వులు అమలు చేయకపోవడాన్ని చూస్తుంటే ఉద్యోగాలకు ఎంపికైనవారు ఇప్పటికే సీఎస్‌ను మేనేజ్ చేసినట్లు కనపడుతోందని, ఆ అధికారులతో సీఎస్ కుమ్మక్కయ్యారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. గ్రూప్-1కు ఎంపికై ప్రస్తుతం వివిధ పోస్టుల్లో కొనసాగుతున్నవారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ప్రస్తుత అధికారి పార్టీ అధినేత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారని గుర్తు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు ఉన్నారని, గ్రూప్-1 ద్వారా ఎంపికైన వారిని బదిలీ చేయడం ద్వారా ఏర్పడే ఖాళీలను వారితో భర్తీ చేయవచ్చు కదా? అని ప్రశ్నించింది. తాము కూడా స్పందించకుంటే న్యాయవ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు అమలు చేసేందుకు సహేతుక సమయం ఇవ్వాలన్న సీఎస్ అభ్యర్థనపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటికే 15 రోజులు గడిచిచాయని, గురువారంలోగా ఉత్తర్వులు అమలు చేస్తారో, లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించింది. ఏజీ జోక్యం చేసుకుంటూ వారం రోజుల సమయం ఇవ్వాలని కోరారు. ఉత్తర్వులు అమలు చేస్తామన్నారు. అందుకు ధర్మాసనం విముఖత చూపడంతో కనీసం 2 రోజుల సమయం ఇవ్వాలని ఏజీ అభ్యర్థించారు. హాజరు నుంచి సీఎస్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉత్తర్వులు అమలు చేసి కోర్టుకు నివేదిస్తామన్న సీఎస్ చెప్పిన వివరాలను ధర్మాసనం నమోదు చేసింది. రేపటిలోగా ఉత్తర్వులు అమలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఉత్తర్వులు అమలు చేస్తే సీఎస్ తమ ముందు హాజరుకావాల్సిన అవసరం లేదని, లేకుంటే మాత్రం కోర్టుకు రావాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

న్యాయ సలహా కోరాం: సీఎస్

ధర్మాసనం స్పందిస్తూ... కోర్టు ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదని సీఎస్‌ను నిలదీసింది. సీఎస్ బదులిస్తూ... కోర్టు ఉత్తర్వులను అనుసరించి సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను అప్రాధాన్య పోస్టులకు మార్చాలన్న ఆదేశాలపై న్యాయ సలహా కోరామని తెలిపారు. ఈ దశలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ.. ప్రాధాన్య, అప్రాధాన్య పోస్టులకు సంబంధించి చట్టబద్ధమైన నిబంధనలు, సర్వీస్ రూల్స్‌లో ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టులకు సంబంధించి ఎలాంటి నిర్వచనం లేదన్నారు. ఈ విషయంలో సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి అన్ని శాఖల హెచ్‌వోడీలను వివరాలను కోరారని చెప్పారు. వారి నుంచి ఎలాంటి వివరాలు అందలేదని, దీంతో సీఎస్ న్యాయ సలహా కోరారని వివరించారు. ఈ నేపథ్యంలోనే క్లారిఫికేషన్ కోరుతూ ఈ నెల 19న మెమో దాఖలు చేశామని, అయితే వివిధ కారణాల వల్ల మెమో నంబర్ కాలేదని పేర్కొన్నారు. ఇందులో తన కార్యాలయం తప్పు కూడా ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకూడదన్న ఉద్దేశం సీఎస్‌కు లేదన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయలేదని తప్పుగా అర్థం చేసుకోవద్దని అభ్యర్థించారు.

ఇప్పటి వరకూ ఏం చేశారో చూపించండి: ధర్మాసనం

ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... ఫోకల్, నాన్ ఫోకల్‌కి సంబంధించి 1966లోనే కార్యనిర్వాహక ఉత్తర్వులు ఉన్నాయని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగానే ఉత్తర్వులు అమలు చేయలేదని ప్రాథమికంగా భావిస్తున్నామని పేర్కొంది. ఏజీ తీరు కోర్టు ఉత్తర్వులు అమలు చేయని అధికారులను సమర్థించేవిగా ఉన్నాయని పేర్కొంది. అడ్వొకేట్ జనరల్ నుంచి ఈ తరహా వాదనలను ఆశించలేదని వ్యాఖ్యానించింది. 'కోర్టు ఆదేశాలు అమలు చేసేందుకు ఫిబ్రవరి 11 నుంచి నేటి వరకు ఏమి చేశారో చూపించండి. ఏజీ సూచనలతోనే ఉత్తర్వులు అమలు చేయనట్లు కనపడుతోంది. నిద్రపోయేవారిని లేపవచ్చు కానీ, నిద్ర నటించేవారిని లేపలేము. కోర్టు ఆదేశాలు అమలు చేయకుంటే న్యాయస్థానాలను మూసివేయడం మంచిది" అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. అధికారులకు కోర్టు ఉత్తర్వుల పట్ల గౌరవం లేనప్పటికీ, తమకు అధికారులపై గౌరవం ఉందని స్పష్టం చేసింది.

ఇదీ జరిగింది...

2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా 169 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన కొందరు అభ్యర్థులు హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం. జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాల ఆరోపణల్లో వాస్తవాలను తేల్చేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అలాగే ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులందరినీ తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కీలక పోస్టుల నుంచి అప్రాధాన్య పోస్టులకు మార్చాలని ఆదేశించింది. మంగళవారం జరిగిన విచారణలో కోర్టు ఉత్తర్వులు అమలుకాకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. సుమోటో కోర్టుధిక్కరణ కేసు ఎందుకు నమోదు చేయకూడదో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించింది. బుధవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా సీఎస్ విజయానంద్ కోర్టు ముందు హాజరయ్యారు.

గూగుల్, ఏఐని అడిగినా చెబుతాయి

ఏజీ స్పందిస్తూ.... తనకు తప్పుడు ఉద్దేశాలను ఆపాదించవద్దని కోరారు. అడ్వొకేట్ జనరల్‌గా ప్రభుత్వం, సీఎస్‌కు మద్దతుగా వాదనలు వినిపించాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. 1966లో ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టులను గుర్తించాలని ఆయా శాఖలను ఆదేశించారని, ఆ తరువాత దానిపై ఎలాంటి పురోగతి లేదని వెల్లడించారు. ధర్మాసనం స్పందిస్తూ... కార్యనిర్వాహక ఉత్తర్వులు అనంతరం ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టుల విషయంలో అనేక ఉత్తర్వులు ఇచ్చారని, వాటన్నింటినీ పరిశీలించాలని సూచించింది. ఫోకల్, నాన్‌ఫోకల్ అర్థం గురించి గూగుల్, ఏఐని అడిగితే చెబుతుందని తెలిపింది. ఎలాంటి చట్టనిబంధనలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు లేకున్నా, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలనే ఉద్దేశం ఉంటే సాధారణ డిక్షనరీలోని అర్థాన్ని అనుసరించి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా ఎంపికకాని అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తూ... ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులపై ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఎస్ఎల్‌పీపై సుప్రీంకోర్టు విచారణ జరపనుందన్నారు. అప్పీల్ వేసే హక్కు అందరికీ ఉంటుందని, అందులో ఎలాంటి తప్పు లేదని ధర్మాసనం పేర్కొంది.

86 మంది గ్రూప్-1 అధికారుల బదిలీ

- హైకోర్టు ఆదేశాలపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- జాబితాలో 25 మంది చొప్పున ఆర్డీవోలు, డీఎస్పీలు
- 22 మంది ఎంపీడీవోలు, 8 మంది ఏఎస్ఈలు కూడా
- రవాణా శాఖలో ఐదుగురు ఆర్‌టీవోల బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలపై ప్రభుత్వం స్పందించింది. 2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాల్లో నియమితులైన 86 మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేటగిరీలో 169 పోస్టులకు గాను 150 మంది విధుల్లో చేరారు. ఇందులో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్‌శాఖ సహా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ విజయానంద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు బుధవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా 25 మంది ఆర్డీవోలను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని సీఎస్ ఆదేశించారు. బదిలీ అయినవారిలో కొవ్వూరు, కుప్పం, రేపల్లె, నర్సరావుపేట, విజయనగరం, పత్తికొండ, జమ్మలమడుగు, పలాస, ఏలూరు, సత్తెనపల్లి, ఉయ్యూరు, కొత్తపేట, ధర్మవరం, కావలి, సుళ్లూరుపేట, నగరి, విజయవాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రాపురం, కనిగిరి, కడప, తాడేపల్లిగూడెం, ఆత్మకూరు ఆర్డీవోలు ఉన్నారు. కడప మున్సిపల్ కమిషనర్ కూడా బదిలీ జాబితాలో ఉన్నారు. తొలుత సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్‌వో ఉన్న ఎం.వాణిని బదిలీ చేశారు. అయితే అది అప్రాధాన్యమైన పోస్టు కావడంతో ఆ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వాణి బదిలీని నిలిపివేసి, తిరిగి అక్కడే కొనసాగించాలని మరో ఉత్తర్వు ఇచ్చింది. కాగా, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అత్యవసరంగా సమావేశమైన పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు.. 25మంది డీఎస్పీలను బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీరిలో విజయవాడ సిటీ, గూడూరు, రాజమండ్రి నార్త్ జోన్, పరవాడ, కనిగిరి, ఎన్‌టీఆర్ సౌత్‌జోన్, ధర్మవరం, బొబ్బిలి, రామచంద్రాపురం, నగరి, గుంటూరు సౌత్, గుంటూరు పశ్చిమం, రపచోడవరం, గురజాల, అవనిగడ్డ, నర్సాపూర్, మచిలీపట్నం, కాశీబుగ్గ, ఆళ్లగడ్డ, గుడివాడ, విశాఖ సిటీ వెస్ట్, మదనపల్లి డీఎస్పీలున్నారు. వీరందరినీ మంగళగిరిలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 22మంది ఎంపీడీవోలను, శ్రీకాకుళం డీపీవోను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. వీరిని కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మరోవైపు అబ్కారీ శాఖలో ఏఈఎస్‌లుగా పనిచేస్తున్న 8మందిని ఎక్సైజ్ శాఖ బదిలీ చేసింది. వారిని ప్రధాన ఎక్సైజ్ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. రవాణా శాఖ పరిధిలో ఐదుగురు ఆర్‌టీవోలను బదిలీ చేశారు. చిత్తూరు, అన్నమయ్య, ప్రొద్దుటూరు ఆర్‌టీవోలను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

త్వరలో 'శ్రీవారి ముడుపు పత్రం'!



- హుండీలో నగదు రహిత కానుకలకు టీటీడీ కసరత్తు
- యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లించి... రూ.100 నుంచి రూ.లక్ష వరకు పత్రాల కొనుగోలు
- ఆ పత్రాన్ని ఆలయ హుండీలో సమర్పించే అవకాశం
- తిరుపతి, తిరుమలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
- 28న ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చ?

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోకి వెళ్లిన తర్వాత హుండీలో వేయడానికి చేతిలో సరిపడా డబ్బులు లేవని ఇకపై దిగులు పడాల్సిన అవసరం లేదు. భక్తుల చేతిలో నగదు లేకపోయినా హుండీలో కానుకలు వేసేలా టీటీడీ త్వరలో 'శ్రీవారి ముడుపు పత్రం' విధానం అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. భక్తులు తమ స్థోమతకు తగినట్టు మొక్కులు చెల్లించుకునేలా నూతన పద్ధతిని తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం శ్రీవారిని ఏటా దాదాపు 2.5కోట్ల మంది భక్తులు దర్శించుకుంటున్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు హుండీలో కానుకలు సమర్పించడమనే సంప్రదాయం వందల ఏళ్ల నుంచి కొనసాగుతోంది. టీటీడీ బడ్జెట్‌లోనే ప్రధాన ఆదాయ వనరు కూడా హుండీనే. 2025లో హుండీ ఆదాయం రూ.1,383 కోట్లు వచ్చింది. ఇటీవల కాలంలో నగదు రహిత లావాదేవీలు అధికమయ్యాయి. దాదాపు ప్రతి ఒక్కరూ యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ దిశగా 'శ్రీవారి ముడుపు పత్రం' విధానాన్ని ప్రవేశపెట్టేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. తిరుపతితో పాటు తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ముడుపు పత్రం కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిద్వారా భక్తులు రూ.100 నుంచి రూ.లక్ష వరకు యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లించి ముడుపు పత్రాలను కొనుగోలు చేయవచ్చు. ఆ పత్రాలను ఆలయంలోని హుండీలో సమర్పించవచ్చు. వాస్తవానికి ముడుపు పత్రాన్ని కొనుగోలు చేసిన సమయంలోనే స్వామివారి ఖాతాలకు నగదు జమ అయిపోతుంది. అయితే హుండీలో మొక్కులు చెల్లించాలన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఈ పత్రాన్ని సమర్పించే విధానాన్ని అమలుచేయాలని టీటీడీ భావిస్తోంది. ఈ నెల 28న తిరుమలలో జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేథతో మేలు

- వైద్య వృత్తిని కెరీర్‌గా కాకుండా సేవగా చూడాలి
- కాటూరి వైద్య కళాశాలగ్రాడ్యుయేషన్ డేలో

గవర్నర్ అబ్దుల్ నజీర్



గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేథ(ఏఐ) రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి ముఖ్యమైన సాంకేతిక పరిజ్ఞానాలను అనుసంధానిస్తుందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. రోగితో పరస్పరం సంభాషించడం, ప్రిడిక్టివ్ ఎనలిటిక్స్, రిమోట్ పర్యవేక్షణలో సాంకేతికతలు ఎలా వినియోగంలో ఉన్నాయో పరిశోధించవచ్చన్నారు. సాంకేతికతను అవసరం మేరకు ఉపయోగించుకోవాలే తప్ప దానిని జవాబుదారీతనం, నైతిక నిర్ణయం తీసుకోవడంలో ఎప్పుడూ అనుమతించవద్దని సూచించారు. బుధవారం గుంటూరు జిల్లా చినకోండ్రుపాడులోని కాటూరి వైద్య కళాశాల, హాస్పిటల్‌లో జరిగిన 22వ గ్రాడ్యుయేషన్ డేలో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కీలకోపన్యాసం చేశారు. జ్ఞానాన్ని తీర్పుతో, నైపుణ్యాన్ని నీతితో, అధికారాన్ని వినయంతో సమతౌల్యం చేయాలని సూచించారు. నీతి, కరుణ, సానుభూతి వైద్య వృత్తికి మూడు ప్రధాన స్తంభాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడలోని సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చంద్రశేఖర్ సంకురాత్రి, కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ గుంటూరు ఛైర్మన్ కాటూరి సుబ్బారావు పాల్గొన్నారు.

'ఇండియా స్కిల్స్'లో రాష్ట్రానికి 23 పతకాలు

- 2 బంగారు, 8 వెండి, 3 కాంస్య, 10 ఎక్సలెన్స్ అవార్డులు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండియా స్కిల్స్ సౌత్ రీజినల్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 23 పతకాలు దక్కాయని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ కూరం రఘు తెలిపారు. రెండు బంగారు, 8 వెండి, మూడు కాంస్య పతకాలు, 10 మెడలియన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు. పతకాలు సాధించినవారిని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేశ్‌కుమార్ తాడేపల్లి కార్యాలయంలో అభినందించారని తెలిపారు.

పాల విక్రయ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 150 నమూనాల సేకరణ

- మరో వారంపాటు తనిఖీలు: ఐపీఎం డైరెక్టర్


అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో విక్రయిస్తున్న పాలలో కల్తీ జరిగినట్టు గుర్తించి, ఫినాయిల్ కలుపుతున్న విజిలెన్స్, ఆహార భద్రత శాఖ అధికారులు

అమరావతి/అనంతపురం క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ఒక్క రోజే 150 పాల నమూనాలు సేకరించారు. నమూనాలను హైదరాబాద్, చెన్నై, కాకినాడ, తిరుపతిలోని గుర్తింపు పొందిన ల్యాబ్‌లకు పంపారు. అనంతపురం లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి నగరంలోని ఐదు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కళ్యాణదుర్గం రోడ్డు, రాంనగర్ 80 అడుగుల రోడ్డు, శ్రీకంఠం సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న పాలను పరిశీలించారు. కళ్యాణదుర్గం రోడ్డులో విక్రయిస్తున్న సుమారు 20 లీటర్ల పాలు కల్తీ అయినట్టు నిర్ధారించి, వాటిలో ఫినాయిల్ కలిపి నిరుపయోగంగా మార్చారు. ఒక కేంద్రంలోని ఫ్రిజ్‌లో 30 లీటర్ల పాలు పాడైపోయినట్టు గుర్తించారు. మరో చోట 70 లీటర్ల పాలల్లో నాణ్యత లోపించినట్టు గుర్తించి పారబోశారు. దాడులు నిర్వహించిన ప్రాంతాల్లో పాల నమూనాలను సేకరించారు. ఐదు ప్రాంతాల్లో సేకరించిన పది నమూనాలను హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. కాకినాడలో నాణ్యతలేని ఐదు కిలోల పాలపొడిని సీజ్ చేశారు. ప్రధానంగా పాల క్యాన్లు, లూజు పాల విక్రయాలు జరిగే కేంద్రాల్లో ఈ తనిఖీలు జరుపుతున్నారు. రూ.8 వేల విలువైన మ్యాజిక్ కిట్లతో పాల నాణ్యతని అధికారులు గుర్తిస్తున్నారు. వీటిని రాష్ట్రంలోని 28 జిల్లాలకు పంపారు. పాలలో యూరియా, పిండి పదార్థం, వెజిటబుల్ ఆయిల్స్ వంటివి ఏది కలిపినా మ్యాజిక్ కిట్‌లో ఉండే లాక్టోమీటర్ వంటి పరికరాల ద్వారా తెలిసిపోతుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి చెప్పారు. పాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడినా, తప్పుడు విధానాలు అవలంబించినా వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో ఆయన హెచ్చరించారు. పాల కేంద్రాల్లో తనిఖీలు మరో వారం కొనసాగుతాయని ప్రకటించారు. కాగా.. పాల పదార్థాల నమూనాలు తిరుపతి ఐఐటీలో అత్యాధునిక ల్యాబ్‌కు చేరాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిగూఢ అంటువ్యాధి

ఎనభై ఏళ్ల క్రితం రూపుదిద్దుకున్న ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసేందుకు ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగా ఆరాటపడుతున్నారో వందేళ్ల క్రితం ఆయన స్థానంలో ఉన్న వ్యక్తి ప్రపంచ శాంతికి ఒక అంతర్జాతీయ సంస్థను నిర్మించేందుకు అంతగా పట్టుదల చూపారు. ఆ మంచిమనిషి ఉడ్రో విల్సన్. తన ఆలోచన అయిన నానాజాతి సమితి ఏర్పాటుకు అమెరికా అత్యున్నత చట్టసభ సహకరించకపోవడంతో ప్రజల మద్దతుకై 1919 ఆగస్టులో ఆయన దేశ వ్యాప్తంగా పర్యటించారు. రోజుకు కనీసం మూడు ఉపన్యాసాలు వెలువరిస్తూ 22 రోజుల్లో 8,000 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ఊపిరిసలపని ఈ కార్యక్రమాల ఒత్తిడితో విల్సన్ స్ట్రోక్‌కు గురై మరణించారు. ఒక సమున్నత లక్ష్యసాధనకు పూనుకున్న సజ్జనుల జీవితాలు స్ట్రోక్ మూలంగా అర్ధాంతరంగా ముగిసి చరిత్ర చిన్నబోయిన సందర్భాలు ఇరవయో శతాబ్దిలో చాలా ఉన్నాయి.

మెదడుకు రక్త ప్రసరణ నిరోధించబడినప్పుడు లేదా మెదడులో రక్తనాళం పగిలిపోయినప్పుడు స్ట్రోక్ సంభవిస్తుంది. ఈ స్ట్రోక్‌లను రెండు తరగతులుగా వర్గీకరిస్తారు. ఒకటి– ఇస్కీమిక్ , రెండు– హెమరేజిక్. పంటక్షేత్రాలకు నీటిని సరఫరా చేసే మార్గాలకు అవరోధాలు ఏర్పడితే పంటచేలు ఎండిపోయినట్టు మెదడుకు రక్తాన్ని తీసుకువచ్చే ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవిస్తుంది. హెమరేజిక్ స్ట్రోక్ సునామీ సదృశమైనది. పగిలిన రక్తనాళం మెదడుకు, కీలకమైన నాడీ కేంద్రాలు, మార్గాల మధ్య సంబంధాలను విచ్ఛిన్నం చేస్తుంది. దీని పర్యవసానాలు తీవ్రమైనవి.

ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాలలోను స్ట్రోక్ అంతకంతకూ ప్రజారోగ్యానికి పెనుసవాల్‌గా పరిణమిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం మరణాలకు మూడో ప్రధాన కారణంగా ఈ వ్యాధి ఉన్నది. 2021లో 11.9 మిలియన్ స్ట్రోక్ కేసులు నమోదయ్యాయి. 1990లో నమోదైన వాటి కంటే ఇది 70శాతం అధికం. అదే సంవత్సరం మన దేశంలో 1.25 మిలియన్ కొత్త స్ట్రోక్ కేసులు నమోదయ్యాయి. 1990లో నమోదైన వాటి కంటే ఇది 51శాతం అధికం. భారత్‌లో ఈ కేసుల ప్రస్తుత పరిస్థితి మరింత భయం గొలిపేదిగా ఉన్నది.

‘ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ స్ట్రోక్’లో ప్రచురితమైన ‘నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్ అండ్ రీసెర్చ్’ తాజా అధ్యయన నివేదిక ప్రకారం మన దేశంలోని ప్రతి ఏడుగురు స్ట్రోక్ బాధితులలో ఒకరు 45 సంవత్సరాల వయసులోపు వారు కాగా ఈ వ్యాధి లక్షణాలు కన్పించిన ప్రతి ఐదుగురులో ఇద్దరు మాత్రమే ఆస్పత్రికి సకాలంలో రాగలుగుతున్నారు. మెదడుకు రక్తప్రసరణ నిలిచిపోయినప్పుడు ప్రతి నిమిషానికి 1.9 మిలియన్ న్యూరాన్లు దెబ్బతిని స్ట్రోక్ తీవ్రమవుతుంది. మూడు గంటల లోగా తగు చికిత్స జరగని పక్షంలో స్ట్రోక్ బాధితుడు మరణించడమో లేక శాశ్వతంగా శారీరక అశక్తుడు కావడమో జరిగి తీరుతుంది. ‘టైమ్ ఈజ్ బ్రెయిన్’ అనేది స్ట్రోక్ విషయంలో ఒక కీలక చికిత్సా సూత్రం.

విచారకరమైన విషయమేమిటంటే స్ట్రోక్ బారిన పడుతున్న యువజనుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వృద్ధులు మాత్రమే స్ట్రోక్‌కు గురవుతారనే సంప్రదాయ విశ్వాసం సడలిపోతోంది. ఆధునిక జీవనశైలి, వృత్తి, ఉద్యోగ జీవితాలలో ఒత్తిడి ఫలితంగా యువజనులు స్ట్రోక్ బారినపడుతున్నారు. యువ జనాభాకు ఈ వ్యాధితో వాటిల్లుతున్న నష్టం సంబంధిత యువతీ యువకులది మాత్రమే కాదు. అది మొత్తం సమాజ శ్రేయస్సుకు సంభవిస్తోన్న విఘాతమనేది ఎవరూ నిరాకరించలేని వాస్తవం. మరింత స్పష్టంగా చెప్పాలంటే స్ట్రోక్ ఇప్పుడు ఒక నిశ్శబ్ద సంక్షోభం. ‘నిగూఢ అంటువ్యాధి’గా దానిని నిపుణులు పరిగణిస్తున్నారు.

స్ట్రోక్‌ను అపోప్లెక్సీ (ఆకస్మిక హింసాత్మక దెబ్బ)గా గుర్తించిన వైద్య శాస్త్ర పితామహుడు హిప్పోక్రేట్స్ ‘తీవ్రస్థాయి అపోప్లెక్సీని నివారించడం అసాధ్యం, తేలికపాటి అపోప్లెక్సీని ఎదుర్కోవడమూ తేలిక కాదు’ అని వ్యాఖ్యానించాడు. అయితే నవ నవీన సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించి స్ట్రోక్‌కు చికిత్స చేయడంలోనే కాకుండా ముందస్తుగా దాని సంభావ్యతను గుర్తించి నివారించడంలో కూడా భారతీయ శాస్త్రవేత్తలు, డాక్టర్లు అగ్రగాములుగా ఉన్నారు. ఈ విషయంలో హెల్త్ టెక్ స్టార్టప్‌లు ప్రశస్త కృషి చేస్తున్నాయి. ఒక వ్యాధి గురించి వివేచిస్తున్నప్పుడు దానికొక మందును కనుగొనడం గురించి నేను ఆలోచించను, నివారించేందుకు దోహదం చేసే మార్గం గురించి మాత్రమే శ్రద్ధ వహిస్తాను అన్న లూయీ పాశ్చర్ మాటల స్ఫూర్తితో మెడికల్ ఏఐ నిపుణులు కృషి చేస్తున్నారు. స్ట్రోక్, ఆ మాటకొస్తే ఇతర ప్రాణాంతక వ్యాధుల బారిన పడినవారికి సంపూర్ణ ఉపశమనం కలిగించేందుకు వైద్య విజ్ఞానం చేసే దోహదంతో పాటు రోగులు తమ స్వంత ఆలోచనల బలం మీద ఆధారపడి ఉండేలా చేయడం చాలా ముఖ్యమని ఏపీజే అబ్దుల్ కలాం సూచించారు. ఇందుకు డాక్టర్ల శిక్షణలో వైద్య మానవీయ శాస్త్రాలను నిర్మాణాత్మకంగా భాగం చేయవలసిన అవసరమున్నది.

> **ఎంతసేపూ ఏఐ వచ్చేస్తూందీ, ఉద్యోగాలు పోతాయీ అని చెప్తున్నారే కానీ, ఇంతవరకు ప్రభుత్వాలు గానీ, సాఫ్ట్‌వేర్ సంస్థలు గానీ ఎలాంటి ఉద్యోగాలు ఉన్నాయీ, అందులో ఏ పనులు ఏఐ రాకతో బలవుతాయీ, అలా జరగకుండా ఆ ఉద్యోగులకు ఎలాంటి నైపుణ్యాలు నేర్పాలీ, నేర్చుకోలేని వారికి ఎలాంటి భద్రత కల్పించాలీ... ఈ దిశగా ఏ చర్చా జరగటం లేదు, ఏ ప్రణాళికలూ రూపుదిద్దుకోవటం లేదు.**

‘ఏఐ’ బూచిని చూపి అందరూ భయపెట్టేవారే!

న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచస్థాయి ఏఐ (కృత్రిమ మేధ) ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో వార్తా పత్రికలలోనూ, సోషల్ మీడియాలోనూ ఏఐపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. పది కోట్ల ఉద్యోగాలు పోతాయి అని ఒకరు, నలభై కోట్ల ఉద్యోగాలు ఊడతాయని ఇంకొకరు, ఏకంగా 90శాతం ఉద్యోగాలు ఉండవని మరొకరు... ఇలా భయపెడుతున్నారు. మనిషి చేసే ప్రతి పనీ ఏఐ చేస్తుందనీ ఇకపై ఏ కొద్దిమందో తప్పితే ఎవరూ పని చేయాల్సిన అవసరమే లేదనీ, ఈ విధంగా సృష్టించబడ్డ సంపద 90శాతం ప్రజల దగ్గర ఉంటుందనీ, తక్కినవారికి ప్రభుత్వమే బతుకుదెరువుకు కావాల్సిన డబ్బులు అందజేస్తుందనీ... ఇలా నానారకాలుగా మాట్లాడుతున్నారు. ఏఐ మీద పుస్తకం రాసిన చరిత్రకారుడు యువల్ నోవా హరారే ఒక టాక్ షోలో మాట్లాడుతూ– ఏఐ సామర్థ్యం ఉన్న ఏజెంట్లు కోట్లకొద్దీ వస్తాయనీ, వాటంతట అవే నిర్ణయాలు తీసుకుంటాయనీ, అవి తీసుకునే నిర్ణయాల మీద వాటిని తయారు చేసిన మనిషికి కూడా ఎలాంటి నియంత్రణ ఉండదనీ, వీటితో ఎన్నో చెడు పరిణామాలు దాపురించే అవకాశం ఉందనీ ఉద్ఘాటించారు. మొత్తంమ్మీద అతి త్వరలో జరిగే ఒక అనర్థంగా అందరూ పేర్కొంటున్న అంశం పెద్ద ఎత్తున ఉద్యోగాలు పోవడం.

ఇప్పటికే ఏఐను చిత్రాలు గీయడంలో, సినిమాలు తీయడంలో, పాటలు రాయడంలో, కథలు రాయడంలో, ఇతర కళా రంగాల్లో విరివిగా వాడుతున్నారు. బెంగళూరులో అయితే ఏఐతో తీసిన సినిమాని థియేటర్లలో కూడా రిలీజ్ చేశారు. వైద్య రంగంలో రోగనిర్ధారణ పనులలో ఏఐ చాలా అద్భుతంగా పని చేస్తున్నదని వైద్యులే చెబుతున్నారు. విద్యా రంగంలో అయితే అసలు ఏఐ చేయలేని పని అంటూ ఏదీ లేదు. కానీ ఇంకా కొన్ని రంగాలలో ఉదాహరణకు రవాణా రంగంలో, వ్యవసాయ రంగంలో, వస్తువులను వినియోగదారులకు చేరవేసే రంగంలో, లోడింగ్ అన్‌లోడింగ్ వంటి పనులలో, ఇంటి పనుల్లో, నర్సులు చేసే పనుల్లో, వంటలో... ఇలాంటి రంగాల్లో ఏఐ ప్రవేశించాలంటే ముందు రోబోల తయారీ జరగాలి. ఈ రోబోలు, డ్రోన్స్, వీటిని నియంత్రించే కంప్యూటర్లు, ఇతర సామగ్రి తయారు చేసేందుకు మాత్రం ఖనిజాలు, ఎలక్ట్రానిక్ చిప్స్, అవి తయారు చేసే యంత్రాలు కావాల్సి ఉంటుంది. వీటిని తయారు చేసేందుకు మనుషులు కావాల్సిందే. ప్రపంచం మొత్తం మీద ఇలాంటి యంత్రాలు వందల కోట్లలో అవసరం ఉంటాయి. కాబట్టి వీటన్నింటినీ తయారు చేసేందుకు కావలసిన కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అది కూడా అన్ని దేశాల్లోనూ చేయాలి. కాబట్టి ఇంత త్వరలో మనుషులకు పని లేకుండా పోతుంది అని భయపడవలసిన అవసరం లేదు. ఉదాహరణకు, మన దేశంలో వ్యవసాయ సంబంధిత రంగాలలో పనిచేసే వాళ్ళు 30 కోట్లమంది వరకూ ఉంటారు. పరిశ్రమల్లో పని చేసేవాళ్లు, వస్తువులను చేరవేసేవాళ్లు, నర్సులు... ఇలాంటి వాళ్లను కూడా కలుపుకుంటే మొత్తం జనాభాలో సగంమంది కంటే ఎక్కువే. వీళ్ళందరూ చేసే పనులన్నింటినీ చేసేందుకు అవసరమైన రోబోలు కావాలంటే అసలు భూమి మీద ఉన్న ఖనిజాలు సరిపోవు. అయినప్పటికీ ఈ మేధావులు ఇలా ఎందుకు భయపెడుతున్నారో అర్థం కాదు.



ఐటీ రంగం మన దేశంలోకి ప్రవేశించి అరవై సంవత్సరాలు దాటింది. అయినా ఇప్పటివరకు ఈ ఐటీ రంగాల్లో ఉన్నవారు సృష్టించే ఆదాయం మన జాతీయాదాయంలో 10శాతం కూడా లేదు. ఇకపోతే నిజంగా ఏఐతో గనుక ఇంతమంది ఉద్యోగాలు పోతే, ఏ దండకారణ్యంలోనో ఉండి కొట్లాడవలసిన అవసరం లేదు, ప్రజలే తిరగబడి ఇలాంటి దారుణాన్ని ఆపేస్తారు.

ప్రజలు చేసే పనులు వారి జీవితానికి అర్థాన్ని ఇస్తాయి, వారికి జీవిస్తున్నాం అనే అనుభవాన్ని కలిగిస్తాయి. ఊరికే జీతాల కోసమే ఎవరూ పనిచేయరు. ‘పనే పరమార్థం’ అని మన సంస్కృతి చెప్తున్నది. స్వీడన్‌లో, స్విట్జర్లాండ్‌లో చాలా మందికి ప్రభుత్వం– డబ్బులు ఇస్తాం, పని చేయవలసిన అవసరం లేదని ఒక అవకాశం ఇచ్చింది. అయినా ఒక్కరు కూడా ఉచితంగా డబ్బులు తీసుకుని బతికేందుకు ముందుకు రాలేదు. అన్ని విషయాల్లో లాగా మనిషి పనికి కూడా అలవాటు పడిపోతాడు. మన దేశంలో ఎంతోమంది రైతులు లాభాలు లేకున్నా, నష్టాలు వస్తున్నా అన్ని కాలాల్లోనూ పొలాల్లో పని చేస్తుంటారు. వేరే పనికి పొమ్మన్నా పోరు. అలాంటిది అసలు పని చేయవద్దు అంటే అది సాధ్యమా?

ఎంతసేపూ ఏఐ వచ్చేస్తూందీ, ఉద్యోగాలు పోతాయీ అని చెప్తున్నారే కానీ, ఇంతవరకు ప్రభుత్వాలు గానీ, సాఫ్ట్‌వేర్ సంస్థలు గానీ ఎలాంటి ఉద్యోగాలు ఉన్నాయీ, అందులో ఏ పనులు ఏఐ రాకతో బలవుతాయీ, అలా జరగకుండా ఆ ఉద్యోగులకు ఎలాంటి నైపుణ్యాలు నేర్పాలీ, నేర్చుకోలేని వారికి ఎలాంటి భద్రత కల్పించాలి... ఈ దిశగా ఏ చర్చా జరగటం లేదు, ఏ ప్రణాళికలూ రూపుదిద్దుకోవటం లేదు. ప్రభుత్వాధినేతలు గానీ, ఆయా రంగాల నిష్ణాతులు గానీ సవివరంగా ఉదాహరణలతో గణాంకాలతో దేన్నీ వివరించటం లేదు.

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఈ ఉపద్రవం గురించి వంద దేశాల ప్రతినిధులు ఒక చోట కలిసి ఇంత తీవ్రంగా చర్చించినప్పుడు, ప్రజలకు కావాల్సింది ఆ ఉపద్రవం నుంచి తప్పించుకునే ఉపాయమే కానీ, ఆ ఉపద్రవం వచ్చాక ప్రభుత్వపరంగా చేయూతనిస్తాం అని చెప్పడం కాదు. ఇది ఆలోచనా రాహిత్యమే కాదు, నాయకత్వ లోపం కూడా.

• డాక్టర్ మండువ హనుమంతు ప్రసాద్‌రావు

సమాఖ్య పాలనపై కొత్త సంవాదం

మన గణతంత్ర రాజ్యం ఇప్పుడు పలు క్లిష్ట పరిస్థితుల నెదుర్కొంటున్నది. పర్యావరణ సంక్షోభాలకు పరిష్కారాలు, సంప్రదాయ వృత్తి విద్యలకు కొత్త శక్తినివ్వడం, ప్రత్యామ్నాయ విద్య, సమర్థమైన ఆరోగ్య భద్రతా విధానాలు, స్మార్ట్ ఐటీ క్లస్టర్స్, వ్యాపారాలలో కొత్త పద్ధతులు మొదలైన విషయాలలో సమస్త భారతీయుల ఉమ్మడి భవిష్యత్తుకు ఉపయుక్తమైన కొత్త భావాలు, నమూనాలు, ప్రయోగాలు దక్షిణ భారతావని నుంచే ప్రభవిస్తున్నాయి. అలాగే రాజకీయ వ్యవహారాలపై అధునాతన చర్చలూ దక్షిణాదిలోనే ప్రారంభమవుతున్నాయి.

భారతదేశ సమాఖ్య పాలనా పద్ధతిపై ప్రస్తుత పరిస్థితులలో చాలా అవసరమైన సంభాషణను తమిళనాడు ప్రారంభించింది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి గురించి ఎవరూ మాట్లాడని రోజులలో ఆ భావనను ప్రతిపాదించి, సమర్థించిన రాజమన్నార్ కమిటీ (1969–71) స్ఫూర్తితో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం గత ఏడాది కేంద్రం–రాష్ట్రాల సంబంధాలపై ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన నియమితమైన త్రిసభ్య కమిటీ కొద్ది రోజుల క్రితమే ఒక నివేదికను సమర్పించింది. భారతదేశ సమాఖ్య పాలనా పద్ధతిపై శ్రద్ధాసక్తులు ఉన్నవారందరూ ఆ నివేదికను చదివి, చర్చించాల్సిన అవసరమున్నది. రాజమన్నార్ కమిటీ సూచనలను పునరుద్ఘాటించేందుకు లేదా వాటిని తాజాగా ప్రతిపాదించేందుకే ఈ నివేదిక పరిమితం కాలేదు. భారత రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య పాలనా పద్ధతిని మెరుగుపరిచేందుకు పలు నిర్దిష్టమైన ప్రతిపాదనలను ప్రజల పరిశీలనకు నివేదించింది.

సరళంగా చెప్పాలంటే ఒక కొత్త సమాఖ్య ఒప్పందం లేదా భారత సమాఖ్యవాద నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణకు జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక విజ్ఞప్తి చేసింది. కేంద్ర–రాష్ట్ర సంబంధాల విషయమై మన రాజ్యాంగం నిర్దేశాలు కేంద్రీకరణవైపే ఎక్కువగా మొగ్గాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకలా జరిగింది? దేశ విభజన అల్లకల్లోల పరిస్థితులలో కొత్త స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అవస్థలు రాజ్యాంగ రచనకు పూనుకున్న మన నాయకులను అమితంగా కలవరపరిచాయి. తత్కారణంగానే కేంద్రానికి ఎక్కువ అధికారాలు కల్పించారు. నాటి అల్లకల్లోల పరిస్థితులు పూర్తిగా సమసిపోయినప్పటికీ అధికారాల కేంద్రీకరణ ఒక వారసత్వ అలవాటుగా మిగిలిపోయింది. ఇది కొత్త రాజకీయ పరిస్థితుల ఆధారంగా తీసుకున్న ఆలోచనాత్మక నిర్ణయం ఎంత మాత్రం కాదు. ఇది మన ప్రజాస్వామిక పాలనలో ఒక తిరోగమనం, సందేహం లేదు. 1990ల్లో ప్రాంతీయ పార్టీల ప్రాభవ ప్రాబల్యాలు, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఆ తిరోగమనాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయి. గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. కేంద్రంలోని ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా, తమ భావజాల స్ఫూర్తితో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగించడంతో కేంద్ర–రాష్ట్ర సంబంధాలలో ఇబ్బందికరమైన అసమతుల్యతలు నెలకొన్నాయి. ఆర్థిక వ్యవహారాలలో, పాలనాపరమైన విషయాలలో అధికారాల కేంద్రీకరణ మరింతగా



పెరిగింది. రాష్ట్రాలను సమాన భాగస్వాములుగా కాకుండా మునిసిపాలిటీల స్థాయి పాలనా విభాగాలుగా పరిగణించే ధోరణులు పెరిగిపోయాయి. దేశ పాలనలో సమాఖ్య స్ఫూర్తి బాగా క్షీణించిపోయింది.

‘తనలో భాగంగా ఉన్న రాష్ట్రాలను పూర్తిగా విశ్వసించే, వాటి సమ భాగస్వామ్యాన్ని గౌరవించే, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించే సమాఖ్య వ్యవస్థ దేశ సార్వభౌమత్వాన్ని బలహీనపరచదు; ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢమూ, విశాలమూ చేస్తుంది’ అని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక పేర్కొంది. అటువంటి సమాఖ్య వ్యవస్థ సమైక్యంగా సుస్థిరంగా ఉండడమనేది ‘ఆదేశించడం కాకుండా ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయాలు తీసుకోవడం వల్ల, భాష మొదలైన విషయాలలో ఆధిపత్యానికి ఆస్కారం లేకుండా సంప్రదింపులతో సర్దుబాట్లు చేసుకోవడం వల్ల, అధికారాల కేంద్రీకరణతో కాకుండా వాటి సూత్రబద్ధ పంపిణీతో సాధ్యమవుతుందని’ జస్టిస్ కురియన్ నివేదిక పేర్కొంది. కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై ఏ భావి సంభాషణ అయినా ఈ అవగాహనతోనే ప్రారంభమవ్వాలి.

భారత సమాఖ్యవాదం పాలనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల శాసన, పాలనా అధికారాలలో జోక్యం చేసుకుంటోందని, ఆర్థిక రంగంలో కూడా అదే ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని జస్టిస్ కురియన్ నివేదిక వాదించింది.


■ యోగేంద్ర యాదవ్

ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు వివిధ రంగాలలో సంస్కరణలు తక్షణావశ్యకమని అభిప్రాయపడింది. ముందుగా రాష్ట్రాల సరిహద్దులను మార్చడం అంటే రాష్ట్రాల ప్రాదేశిక పునర్వ్యవస్థీకరణలో కేంద్ర ప్రభుత్వ అధికారాలకు పరిమితి ఉండాలని, రాజ్యాంగాన్ని సవరించడంలో రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం నిర్ణయాలు తీసుకోకూడదని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఆర్థిక రంగంలో 1991 ఆర్థిక సంస్కరణలతో పోల్చదగిన స్థాయిలో కేంద్ర–రాష్ట్ర సంబంధాలలో సమతుల్యతను పునః సాధించాలని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక కోరింది. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి మళ్లీ రాష్ట్ర జాబితాలో చేర్చాలని, రాష్ట్రాల అధికార పరిధిలోని ఆరోగ్య భద్రత, వ్యవసాయం తదితర రంగాలలో కేంద్ర ప్రభుత్వ చొరబాటును అడ్డుకోవాలని కూడా జస్టిస్ కురియన్ కమిటీ పేర్కొంది. రాజకీయ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి గవర్నర్లు తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో పక్షపాత వైఖరితో నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని సూచించింది.

రాజకీయ ప్రాతినిధ్యం పునర్వ్యవస్థీకరణపై ప్రతిపాదనలు ‘ఒకే దేశం–ఒకే ఎన్నిక’ భావనను నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఇది పూర్తిగా సబబే. ప్రజనన రేట్లు స్థిరీకృతమయ్యే దాకా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను వాయిదా వేయాలని జస్టిస్ కురియన్ కమిటీ సూచించింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధికార సమతుల్యత ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను శాశ్వతంగా నిలిపివేయాలి. కేంద్రం–రాష్ట్రాల ఆర్థిక సంబంధాలపై విపులంగా సమీక్ష జరిగింది. వస్తు సేవల పన్ను వ్యవస్థ సమాఖ్యవాదాన్ని దెబ్బతీసిందని కురియన్ కమిటీ అభిప్రాయపడింది. ఆ పరోక్ష పన్నుల వ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు ప్రస్తుత పద్ధతులకు పలు ప్రత్యామ్నాయాలను సూచించింది. భాషాపరమైన సమరూపత ఉన్నప్పుడే జాతీయ సమైక్యత సుసాధ్యమవుతుందని భావించడం సమంజసం కాదని జస్టిస్ కురియన్ కమిటీ స్పష్టం చేసింది. అయితే హిందీ ఆధిపత్యాన్ని తిరస్కరించడంలో ఆంగ్ల భాషకు అమిత ప్రాధాన్యమిచ్చారు. అలా కాకుండా దేశీయ భాషలు అన్నిటికీ సమ ప్రాధాన్యమిచ్చి ఉంటే అది ఆ నివేదిక స్ఫూర్తికి అనుగుణంగా ఉండేది.

> **అధికారాల కేంద్రీకరణకు ఆస్కారం లేకుండా మన సమాఖ్య వ్యవస్థను పునర్వ్యవస్థీకరించుకోవల్సిన అవసరమున్నది. హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యతపై నిర్మొహమాటపు చర్చతో కొత్త సమాఖ్య ఒప్పందంపై సంభాషణ ప్రారంభమవ్వాలి. రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక ఆధిపత్యాలకు తావివ్వకుండా సమ్మిళితత్వం వర్ధిల్లడమే శాశ్వత, ధర్మబద్ధమైన గణతంత్ర రాజ్యానికి పునాది.**

ఏమైనా ఒక కొత్త సమాఖ్య ఒప్పందాన్ని (ఫెడరల్ కంపాక్ట్) కుదుర్చుకోవల్సిన అవసరంపై ఒక ప్రతిభావంతమైన సంభాషణను జస్టిస్ కురియన్ కమిటీ ప్రారంభించింది. అటువంటి సంభాషణ రాజ్యాంగ, విధాన ఆచరణాత్మక తర్కాన్ని దాటి నాగరికతా సంబంధ ఆలోచనా రీతులకు వెళ్లాలి. స్థిరమైన, సార్వత్రిక నైతిక ఆవశ్యకతలను అన్వయించడం కంటే సందర్భోచితమైన నైతిక తార్కికతే భారతీయ తాత్విక సంప్రదాయాలను నిర్వచించే ప్రధాన లక్షణంగా భావితమవుతోంది. విస్తృతంగా అంగీకృతమయిన స్థానిక సంప్రదాయాలు, ధర్మాచరణలు, నియమ నిబంధనల ప్రాతిపదికన ఈ సువిశాల దేశ వైవిధ్యాన్ని గుర్తించి, గౌరవించాలి. భారత ఉపఖండాన్ని సమర్థంగా పరిపాలించేందుకు ఆ వైవిధ్యాన్ని గౌరవించడమే సరైన మార్గమని మహాశక్తిమంతమైన మౌర్య, గుప్త సామ్రాజ్యాలతో పాటు మొగల్, బ్రిటిష్ సామ్రాజ్యాలు గుర్తించి అనుసరించాయి. కేంద్రీకృతమైన, ఏకీకృత చైనీస్ రాజ్య వ్యవస్థ మాదిరిగా కాకుండా భారతీయ రాజ్యం సంయోజిత లక్షణం కలిగి ఉన్నది. భారతదేశ ఐక్యత పైనుంచి విధించబడినది కాదు. విభిన్న ప్రాంతీయ రాజ్యాలు, భాషలు, సంస్కృతుల ద్వారా ఏర్పడి నిలకడగా ఉన్నది. భారత్ సమాఖ్య అమెరికా సమాఖ్యకు భిన్నమైనది. సార్వభౌమిక రాష్ట్రాలు స్వచ్ఛందంగా కలిసిరావడంతో అమెరికా సమాఖ్య ఏర్పడింది. అందుకు భిన్నంగా భారత్, రాష్ట్రాలను కలిపి ఉంచే సమాఖ్య వ్యవస్థలోని మన సమాఖ్యలో ప్రతి భాగస్వామ్య రాష్ట్రమూ తన సొంత విలక్షణ గుర్తింపును నిలుపుకుంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా అధికారాల కేంద్రీకరణ అనేది మన నాగరికతా విలువలకు విరుద్ధమైనది.

హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యతపై నిర్మొహమాటపు చర్చతో కొత్త సమాఖ్య ఒప్పందంపై సంభాషణ ప్రారంభమవ్వాలి. హిందీ భాషను రుద్దబోమని హామీ ఇస్తూ చట్టసభలలో తమ రాజకీయ ప్రాతినిధ్యం 1971లో ఉన్న విధంగానే కొనసాగించేందుకు హిందీ రాష్ట్రాలు అంగీకరించాలి. ఉత్తర, తూర్పు భారతదేశంలోని పేద రాష్ట్రాలకు మరింతగా ఆర్థిక వనరులు సమకూరేలా కేంద్ర ప్రభుత్వ ఆదాయ సమాన పంపిణీ కొనసాగేందుకు దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాలు అంగీకరించాలి. ఏకపక్ష రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక ఆధిపత్యాలకు తావులేకుండా సమ్మిళితత్వం వర్ధిల్లడమే శాశ్వత, ధర్మబద్ధమైన గణతంత్ర రాజ్యానికి పునాది.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

ఉచితాలిలాగే సాగితే మనకూ వెనెజువెలా గతే!

దేశంలో సంక్షేమం పేరిట ఉచితాలు అందించే రాష్ట్రాలలో తమిళనాడుదే అగ్రస్థానం. ఆ రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు– డీఎంకే, అన్నాడీఎంకేలు గత రెండు దశాబ్దాలకు పైగా ఎన్నికలలో ప్రజలను బుట్టలో వేసుకోవడానికి పోటాపోటీగా ఉచితాలు ప్రకటిస్తున్నాయి. ఇప్పుడు ఈ సంక్షేమ పథకాలు వెర్రితలలు వేసే స్థాయికి చేరిపోయాయి.

తొలుత మహిళల్ని ఆకట్టుకోవడానికి అన్నాడీఎంకే తమిళనాడులో టేబుల్ ఫ్యాన్లు, మిక్సర్లు, గ్రైండర్లు ఇస్తామంది. పోటీగా డీఎంకే కూడా యువతకు ట్యాబ్‌లు, లాప్‌ట్యాప్‌లు, టీవీలు తదితర ఖరీదైన బహుమతుల ఆశ చూపింది. ప్రస్తుతం తమిళనాడులో అనేక ఉచితాలతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చదువుకునే బాలికలకు నెలకు రూ.1000ల నగదు, రూ.24,000 వార్షిక ఆదాయం కలిగిన పేద కుటుంబాల వధువులకు రూ.50,000 నగదు, ఒక బంగారు నాణెం అందిస్తున్నారు. నిరాశ్రయులైన మహిళలకు, వికలాంగులైన పురుషులకు ఉచిత కుట్టు మిషన్‌లు అందిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లకు నెలకు రూ.1000ల పెన్షన్, యువతకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణం, పేదలకు ఉచితంగా గృహాలు, ఉచిత వైద్యం, 2 కోట్ల వినియోగదారులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

రూ.4 లక్షల 40 వేల కోట్ల వార్షిక బడ్జెట్ కలిగిన తమిళనాడు ప్రభుత్వం ప్రతి ఏటా లక్షల కోట్ల పైచిలుకు అప్పులు చేస్తోంది. రాష్ట్రానికొచ్చే సొంత రాబడి, కేంద్రం అందించే గ్రాంటులు అన్నీ కలిపితే వచ్చే మొత్తం కేవలం రూ.3 లక్షల 30 వేల కోట్లు. రాష్ట్ర వార్షిక ఆర్థికాభివృద్ధి రేటు చూస్తే 7–8 శాతం మించడం లేదు. కానీ, అప్పులు మాత్రం ఏటా 20 నుంచి 25శాతం పెరుగుతున్నాయి. ఇప్పటికే తడిసిమోపెడుగా ఉన్న ఉచితాల చిట్టాకు మరికొన్ని చేరుస్తామని, తమకు అధికారం ఇవ్వాలంటూ ప్రతిపక్షంలో ఉన్న అన్నాడీఎంకే తాజాగా ఓ ప్రకటన చేసింది. అధికారంలో ఉన్న డీఎంకే తామేమీ తక్కువ తినలేదన్నట్లు మరికొన్ని ఉచిత పథకాలకు రూపకల్పన చేస్తోంది. కొన్ని రాజకీయ పార్టీలు బాధ్యతారహితంగా ప్రజలకిస్తున్న ఈ ఉచితాలు ఓ అంటువ్యాధిలా దేశం మొత్తం పాకుతున్నాయి. దక్షిణాదిలో మొదలైన ఈ జాడ్యం క్రమంగా ఉత్తరాది రాష్ట్రాలకూ అంటుకుంది.

> **ఉచితాల సంస్కృతి పెరిగి భారత్ మరో వెనెజువెలా కాకముందే అందరూ కళ్లు తెరవాలి. ఇష్టానుసారంగా హామీలిస్తున్న రాజకీయ పార్టీలకు ముకుతాడు వేయాలి. ఎన్నికల ప్రధాన సంఘం రాజకీయ పార్టీల మేనిఫెస్టోలను నియంత్రించడానికి గల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. సర్వోన్నత న్యాయస్థానం, పార్లమెంట్‌ల జోక్యం కూడా ఇందులో తప్పనిసరి.**



ఒకవైపు సంపన్నులకు ఎన్నో రాయితీలు కల్పిస్తున్న ప్రభుత్వాలు– పేదలకిచ్చే సబ్సిడీలు, ఉచితాలపై ఎందుకు వెనక్కు పోవాలని ప్రశ్నిస్తున్నవారు ఉన్నారు. పేదలకు ఇస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వ్యతిరేకించడం అంటే అది క్యాపిటలిస్ట్ మనస్తత్వం అని దుయ్యబట్టేవారూ ఉన్నారు. విద్య, వైద్యం మినహా మిగతావేవీ ఉచితంగా ఇవ్వరాదని చెబుతున్న వారిని పేదల వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. ప్రజా బాహుళ్యంలో ఉన్న ఈ భిన్నాభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని.. కొందరు సీనియర్ రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత అభిప్రాయమంటూ ఉచితాలను వ్యతిరేకిస్తున్నారు గానీ.. దానిని ఓ విధానపరమైన అంశంగా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలో చర్చకు పెట్టకపోవడం విషాదం. ఈ ఉచితాల వల్ల రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. వడ్డీ చెల్లింపులకే ఏటా 10 నుంచి 15వేల కోట్లు అవుతోంది. ఇది మరింత పెరిగే ప్రమాదం ఉంది.

ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించాలని, ఉదారంగా సబ్సిడీలు ఇచ్చే విధానానికి స్వస్తి పలికి తగిన మోతాదులోనే సబ్సిడీలు ఉండాలని రాష్ట్రాల స్థాయిలో మొట్టమొదట గళం విప్పిన నాయకుడు చంద్రబాబునాయుడు. 1995లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పుడు–నాడు ఆర్థికంగా ఒట్టిపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబునాయుడు కొన్ని కఠోర నిర్ణయాలు తీసుకొన్నారు. సబ్సిడీ బియ్యం ధర పెంపుదల, మద్యపాన నిషేధం ఎత్తివేత తదితర నిర్ణయాలతోపాటు విద్యుత్ రంగంలో పెద్దఎత్తున సంస్కరణలు చేపట్టారు. దాంతో, ప్రతిపక్షాలతోపాటు సొంత పార్టీలో కూడా గగ్గోలు మొదలైంది. ఉచితంగా విద్యుత్ ఇస్తే విద్యుత్ రంగం కుప్పకూలుతుందని చంద్రబాబు గట్టిగా వాదించారు. ఆర్థిక రంగాన్ని చక్కదిద్దాలనుకున్న చంద్రబాబు నాయుడి విధానాలను ప్రజలు అర్థం చేసుకోలేదు. దాంతో ఆయన 2004 ఎన్నికలలో ఓటమి చవి చూశారు. ఒకవేళ, ఆ ఎన్నికలలో చంద్రబాబునాయుడు గెలిచి ఉంటే చరిత్ర మరొకలా ఉండేది. ముఖ్యంగా రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం అయివుండేది. ఆ ఓటమితో ఆయన కూడా ప్రజాకర్షక పథకాల వైపు మొగ్గుచూపక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ప్రజలకు ఉచితాలు ఇవ్వడం కంటే ఎక్కువగా వారిని ఏ పనీ చేయనక్కర్లేనివారిగా ఓ ప్రమాదకరమైన మార్గం వేసింది మాత్రం 2019–24 మధ్య అయిదేళ్ల కాలంలో, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డే. లబ్ధిదారులకు నేరుగా ఖాతాల్లోకి ఎప్పటికప్పుడు డబ్బు జమ చేసే విధానాన్ని ప్రారంభించి, దానిని ఒక ఘనతగా చాటుకున్నారు. ఆయన పాలనలో దాదాపుగా ప్రతి వ్యవస్థ సుషుప్తిలోకి జారిపోయింది. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక రంగం అప్పుల ఊబిలోకి, జడత్వంలోకి జారిపోయింది. దానినుంచి బయటపడడానికి ప్రస్తుతం చంద్రబాబునాయుడు అలవి కాని అవస్థలు పడుతున్నారు.

మితిమీరిన పాప్యులిజం, అవినీతి, ద్రవ్యోల్బణం తదితర కారణాల వల్ల వెనెజువెలా దేశం ఆర్థికంగా కుప్పకూలిన ఉదంతాన్ని ఇపుడు అందరూ ఎత్తి చూపుతున్నారు. భారీ చమురు నిల్వలతో సంపన్న దేశంగా ఉండిన వెనెజువెలా ఎదుర్కొన్న సంక్షోభాన్ని పాలకులు ఓ గుణపాఠంగా తీసుకోవాలి. మన దేశంలో ఓట్ల కోసం అందించే ఉచితాలను కట్టడి చేయాలి. ఇటీవలి కాలంలో ఉచితాలను గట్టిగా వ్యతిరేకిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ అంశంపై జాతీయ స్థాయిలో పెద్దఎత్తున గళం విప్పితే కొంత ఫలితం ఉంటుంది. ఆయనకు జతకలిసేవారు మరికొందరు చేరొచ్చు. ఎన్నికల ప్రధాన సంఘం రాజకీయ పార్టీల మేనిఫెస్టోలను నియంత్రించడానికి గల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. సర్వోన్నత న్యాయస్థానం, పార్లమెంట్‌ల జోక్యం కూడా ఇందులో తప్పనిసరి. ఉచితాల సంస్కృతి పెరిగి భారత్ మరో వెనెజువెలా కాకముందే అందరూ కళ్లు తెరవాలి. ఇష్టానుసారంగా హామీలిస్తున్న రాజకీయ పార్టీలకు ముకుతాడు వేయాలి.

■ సి.రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



ఒక్క క్లిక్‌తో రైల్వే పార్శిల్ సేవలు

- రైల్‌పార్శిల్ యాప్‌ను ప్రారంభించిన రైల్వేశాఖ
- ఇంటి వద్దే వస్తువుల పికప్-డెలివరీ
- త్వరలో బల్క్ షిప్‌మెంట్‌నూ ప్రారంభించనున్నట్లు ప్రకటన

8

ఘనంగా కాటూరి వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుకలు

వైద్యం వృత్తి కాదు.. సేవ



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

- మారుమూల ప్రాంతాల్లోనూ సేవలందించాలి
- వైద్య విద్యార్థులకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ సూచన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్యాన్ని కేవలం వృత్తిగా కాకుండా, సేవ చేసే ఒక పిలుపుగా భావించాలని గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. గుంటూరు సమీపంలోని కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్స్ 22వ గ్రాడ్యుయేషన్ డే బుధవారం ఘనంగా జరిగింది. వేడుకలను ప్రారంభించిన గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశానికి నగరాలే కాదు, గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో కూడా అవసరమనే విషయాన్ని వైద్యులు గుర్తించాలన్నారు. వైద్య, విద్య, ఆరోగ్య సేవల రంగంలో కాటూరి ముఖ్యమైన పాత్ర పోషించడం సంతోషంగా ఉందన్నారు. 2001లో స్థాపించిన సంస్థ, వైద్య విజ్ఞానం, క్లినికల్ నైపుణ్యం, సేవ, ఈ మూడు కలిసే కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇటీవల యూనివర్సిటీ పరీక్షల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ స్థాయిల్లో టాప్ స్థానాలు సాధించిన విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయ మన్నారు. సంకురాత్రి ఫౌండేషన్ డాక్టర్ చంద్రశేఖర్, కాటూరి వైద్యశాల ఛైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ స్వైరరావు మాట్లాడుతూ వైద్యశాలలో ఏర్పాటు చేసిన నూతన క్యాథ్ ల్యాబ్, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్ ద్వారా క్లిష్ట గుండె, అత్యవసర (మిగతా 8వ పేజీలో)



సరిహద్దులు దాటిన ప్రేమ

8

- రేపల్లె అబ్బాయి పోలాండ్ అమ్మాయి వివాహం
- హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి

28న దివ్యాంగుల గ్రీవెన్స్ డే

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో 28న దివ్యాంగుల స్పెషల్ గ్రీవెన్స్ డేను నిర్వ హిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఎన్ వెంకటరవణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జేసీ ఇతర ఉన్నతాధికారులు బాధితుల నుంచి అర్జీలను నేరుగా స్వీకరిస్తారని పేర్కొ న్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభా వంతులు ఈ కార్యక్రమానికి హాజరై వారి సమస్యలపై వినతి పత్రాలు అందజేయాలని ఆయన కోరారు.

- జిల్లాల విభజన తర్వాత వెనుకబడిన వైనం
- 15వ ఎస్ఐపీబీ జాబితాలో చివరి వరుసలో గుంటూరు
- పర్వాలేదనిపించుకున్న పల్నాడు.. అట్టడుగున బాపట్ల జిల్లా
- వైసీపీ హయాంలో, ఇప్పుడూ కుంటుబడిన పరిశ్రమల రంగం



పరిశ్రమలో వెనుకంజ

నూతన పరిశ్రమల రాక ప్రశ్నార్థకం

పెట్టుబడులు.. అంతంతే..

ఎస్ఐపీబీ 15వ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.29,018 కోట్ల పెట్టుబడుల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు రూ.2,384 కోట్లు మాత్రమే దక్కాయి. వీటిలో రూ.2,000 కోట్లు పల్నాడు జిల్లాకు దక్కగా, గుంటూరు జిల్లాకు నామమాత్రంగా రూ.330 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.54.02 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పల్నాడులో క్రోమా ఎటోర్ ఇంటర్నేషనల్ ద్వారా రూ.2000 కోట్ల పెట్టుబడితో 5,000 మందికి ఉపాధి లభించనుండగా, గుంటూరులో అకేసియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ద్వారా 372 మందికి, బాపట్లలో అక్షయ హోటల్స్ ద్వారా 80 మందికి ఉపాధి లభించనున్నది. రిసార్ట్స్ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక రంగానికి అదనంగా వచ్చే ప్రయోజనమైతే శూన్యమనే చెప్పాలి.

గుంటూరు,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధి గత ఐదేళ్ల వైసీపీ హయాంలో, ప్రస్తుత కూటమి నేతృత్వంలో రెండేళ్లుగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. తాజాగా జరిగిన ఒప్పందాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పేర్లు వినిపించనైనా వినిపించడం లేదు. పల్నాడులో పరిస్థితి ఒక రకంగా ఉన్నా (మిగతా 8వ పేజీలో)

ఆరంభానికి ముందే

ముగింపు పలకాలి



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీరు తెన్నులు ఏప్రిల్ 1 నుంచి సంపూర్ణంగా మారబోతున్నాయి. మొత్తం ప్రక్రియను ప్రక్షాళన చేసే విధంగా కేంద్రం అనేక మార్గదర్శకాలు జారీ చేసింది. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్-విబీ జీరామ్‌జీ)గా ఆ పథకం కొనసాగ నుంది. పేరు మార్పుతో పాటు పథకం పాలసీ పరంగా కూడా అనేక మార్పులకు కేంద్రం సంకల్పించింది. ఈ పథకం కింద చేపట్టిన అనేక పనులు అసంపూర్తిగా నిలిచి పోవడం, దశదిశ లేకపోవడం, కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం, పనులు ముగింపు విషయంలో అలసత్వం పై కేంద్రం దృష్టి పెట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ పథకాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న పనుల న్నింటినీ మార్చి 31లోగా ముగించాల్సిందేనని, ఆన్‌లైన్‌లో క్లోజ్‌గానే కనపడాలని ఆదేశాలను కేంద్రం జారీ చేసింది.

- వీబీ జీ రామ్‌జీగా పేరు మార్చిన కేంద్రం
- నూతన మార్గదర్శకాలు విడుదల
- గ్రామ పంచాయతీలో 20 పనులు మాత్రమే
- పెండింగ్ పనులు క్లోజ్ చేస్తేనే కొత్త వాటికి అవకాశం
- పాత పనుల ముగింపునకు సాంకేతిక ఇబ్బందులు

(తెనాలి ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో భాగంగా.. ఏప్రిల్ 1 నుంచి ప్రతి పంచాయతీ పరిధిలో ఇరవై పనులు మాత్రమే ఆన్‌గోయింగ్‌లో ఉండాలని కేంద్రం స్పష్టంగా ఆదేశాలిచ్చింది. పని పూర్తయ్యి.. ఖాళీ ఏర్పడితేనే మరో పనిని పంచాయతీలో చేపట్టాలని పేర్కొంది. దీంతో పెండింగ్ పనులన్నింటిని ముగించడానికి డ్వామా విభాగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనేక చిక్కుముళ్ళతో పాటు సాంకేతిక ఇక్కట్లు ఎదురవుతుండడంతో మొత్తం యంత్రాంగం వాటి మీదే కుస్తీ పడుతోంది. ఇదిలా ఉంటే మెటీరియల్ పనులు ముగించే విషయంలో పంచాయతీరాజ్, డ్వామా విభాగాల మధ్య సమన్వయం కొరవడడంతో ముగింపు మరింత క్లిష్టతరంగా మారుతోంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.18 (గురువారం)
సహరి : ఉదయం 5.09 శుక్రవారం)

ఏళ్ల నాటి నిర్లక్ష్యం

దాదాపు దశాబ్దన్నర కాలం నుంచి ఉపాధి హామీ పనులు అనేక కారణాలతో పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో దర్శనమిస్తున్నాయి. వీటి లో అసలు ప్రారంభించకుండా చూపించినవి కొన్నయితే, మరికొన్ని నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో వదిలేసినవి, బిల్లులు చెల్లించకుండా ఉన్నవి, విత్‌హెల్డ్‌లో ఉన్నవి ఇలా అనేక కార ణాలతో వేల సంఖ్యలో పనులు ఆన్‌గోయింగ్ స్టేటస్‌లోనే దర్శనమిస్తున్నాయి. వీటన్నింటిని క్లోజ్ చేస్తేనే.. పంచాయతీల్లో పనులు (మిగతా 8వ పేజీలో)

కొండలా పెండింగ్..

బాపట్ల జిల్లాలో 45,800 పెండింగ్ పనులు చూపెడుతుంగా, గుంటూరు, పల్నాడు జిల్లాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 1,30,000 వరకు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక గత ప్రభుత్వం ఈ పథకం ఉద్దేశ్యమే నీరుగార్చేలా వ్యవహరించడం, రాజకీయ కారణాలతో గతంలో చేసిన బిల్లులు పెండింగ్‌లో ఉంచడం.. పెండింగ్ దస్త్రాలు కొం డల్ని తలపించేలా పేరుకు పోయాయి. ఒక్కో పంచాయతీ పరిధిలో కనీసం వంద పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వేల సంఖ్యలో పనుల్ని ఒకేసారి క్లోజ్ చేసి రావడం మరింత గందరగోళానికి తావిస్తోంది. పెండింగ్ పనుల్లో 20 శాతం వరకు అసలు ప్రారంభం కానివే ఉండగా, వీటిని క్లోజ్ చేయడంలో పెద్దగా ఇబ్బందులు తలెత్తడం లేదు. కానీ నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వాటితో బిల్లులు పెండింగ్ ఉన్నవాటి విషయంలో మాత్రం అనేక చిక్కులు ఎదురవుతున్నాయి.

స్వచ్ఛతలో ఆదర్శంగా మంగళగిరి

ప్రజలు సహకరించాలని మంత్రి లోకేశ్ పిలుపు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజన్ సాధనలో మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా సహకరించాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ మంగళగిరి 2.0 కార్యక్రమా నికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ స్వచ్ఛ మంగళగిరి తొలిదశ ప్రజల్లో పరిశుభ్రతపై అవగా హన కల్పించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. రెండో దశ మరింత ప్రణాళికాబద్ధంగా, సమర్ధవంతంగా అమలు చేసి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిని పూర్తి పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యమన్నారు. నగరంలో చెత్త సేకరణ, వర్గీకరణ, మురుగు పారుదల వ్యవస్థలను పటిష్ఠం చేయాలని అధికారులకు సూచించారు. వార్డు, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై కఠినంగా వ్యవహరించాలని, విద్యా సంస్థల్లో విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రతమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, సూపరింటెండెంట్ ఇంజనీరు లీలాకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



స్వచ్ఛ మంగళగిరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్

రాజాధిరాజ వాహనంపై దేవదేవుడు



మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి వాసుని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి బుధవారం రాత్రి రాజాధిరాజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాన్ని దర్శించిన వారు సుఖసంతోషాలతో వెలుగొందుతారని ప్రతీతి. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మిద్దె సెంటరు చేరుకుని తిరిగి అదే మార్గం లో ఆలయానికి విచ్చేసింది. ఈ ఉత్సవానికి పెదపాలెంవాస్తవ్యులు పెమ్మసాని శైలేంద్ర కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామిని దర్శించుకుంటూ..

అమరావతి పనుల పరిశీలన

రాజధానిలో పర్యటించిన ఏడీబీ బృందం

తుళ్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ - మనిలా) ఇండియా రెసిడెంట్ మిషన్ నుంచి ఐదుగురు సభ్యుల బృందం బుధవారం రాజధాని అమరావతిలో పర్యటించింది. ఉండవల్లి పంప్‌హౌస్, అమరావతి ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ జోన్లతో పాటు వివిధ సైట్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ బృందం పరిశీలించింది. ప్రణాళికాయుతంగా జరుగుతున్న పనులు, ఆయా ప్రాజెక్టుల పురోగతి గురించి ఏపీసీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు బృందంలోని సభ్యులకు వివరించారు. అనంతరం బ్యాంకు బృందం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ తదితరులతో భేటీఅయ్యింది. అనంతరం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్‌లను కలిసి అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించింది.



అభివృద్ధి పనులను బృందానికి వివరిస్తున్న సీఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ ధనుంజయ



అంతరిక్ష విజ్ఞానానికి ఆహ్వానం

- ఇస్రో సెంటర్లను సందర్శించే అవకాశం
- యువిక.. నమోదు చేసుకోండి ఇలా..

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): అన్ని యాజమాన్య పాఠశాలల 9వ తరగతి విద్యార్థులకు దేశంలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రాలను సందర్శించే అరుదైన అవకాశాన్ని ఇస్రో కల్పిస్తోంది. యువిక - 2026 పేరిట అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది. ఎంపికైన విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక జ్ఞానాన్ని అందించి, స్ఫూర్తి నింపే ఉద్దేశంతో ఇస్రో ఈ యువ విజ్ఞాన కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోంది.

ఎంపికైన విద్యార్థులకు శిక్షణ

ఇస్రో యువిక కార్యక్రమాన్ని దేశంలోని 7 స్పేస్ సెంటర్లలో నిర్వహిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు మేలో రెండు వారాలు శిక్షణనిస్తుంది. దీని ద్వారా అంతరిక్ష పరిశోధనలపై అవగాహన, అంతరిక్ష కేంద్రాలను సందర్శించే అవకాశం కల్పిస్తుంది.

వెయిటేజీ ఇలా

8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం, స్పేస్, సైన్స్ క్లబ్‌లలో నమోదై ఉంటే 5 శాతం, క్రీడలు, అథ్లెటిక్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, గ్రామీణులకు 20 శాతం, ఆన్‌లైన్ క్విజ్ మార్కులకు 10 శాతం, రాష్ట్ర, జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలింపియాడ్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 10 శాతం వెయిటేజి ఉంటుంది.

అంతరిక్షంపై ఆసక్తి పెంచడమే లక్ష్యం



విద్యార్థుల్లో సైన్స్, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే యువిక ప్రధాన ఉద్దేశ్యం. ఇస్రో కల్పిస్తున్న ఈ అరుదైన అవకాశాన్ని విద్యార్థులు అందుకునేలా ఉపాధ్యాయులు, ఎంఈఓలు కృషి చేయాలి. వివరాలకు జిల్లా డీఎస్‌వో ఎస్.రాజశేఖర్‌ను (99590 04434) సంప్రదించవచ్చు.

- పీవీజే రామారావు, డీఈఓ, పల్నాడు

రిజిస్ట్రేషన్ ఇలా..

ముందుగా జిజ్ఞాస (Jigyasa.iirs.gov.in) వెబ్‌సైట్‌లో విద్యార్థి పేరు, ఈ-మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. మెయిల్‌కు వచ్చే లింకుపై క్లిక్ చేసి వెరిఫై చేసుకోవాలి. లాగిన్ అయ్యి.. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. అనంతరం వ్యక్తిగత, విద్యార్హత వివరాలు ఆన్‌లైన్ ఫాంలో నింపాలి. ధ్రువీకరణ పత్రాలను అప్లోడ్ చేయాలి. ఆన్‌లైన్ ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభమై.. మార్చి 31తో ముగుస్తుంది.

పెన్షన్ అదాలత్ రేపు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ చట్టానికి అనుగుణంగా ఉద్యోగులు, యజమానులు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పెన్షన్ అదాలత్(నిధి ఆప్కే నికట్)ను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్. తానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, పీఎఫ్ చందాదారులు, యజమానులు కార్యక్రమం లో పాల్గొనాలని పేర్కొన్నారు. పీఎం వీబీఆర్‌వై, ఈకేసీ, కేవైసీ, మొబైల్ నంబరు సీడింగ్, యూఏఎన్ తదితర అంశాలపై వర్క్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాకు మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ భవనం పక్కన ఎఫ్ ట్రానిక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ యువతకు ఉపాధి శిక్షణ

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఈఈడీఏపీ ఆధ్వర్యంలో బాలాజీ ఏపి ఇన్ఫోటెక్ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కోర్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజర్ తిరుమలశెట్టి విజయసారథి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదించిన కోర్సులు సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ మూడు నెలలు, టాలీ ప్రైమ్ సాఫ్ట్‌వేర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసులో శిక్షణ ఇచ్చి అనంతరం, మల్టీ నేషనల్ కంపెనీల్లో ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుం దన్నారు. పదో తరగతి నుంచి పీజీ విద్యార్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులుగా తెలిపారు. ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, కుల, నివాస ధ్రువీకరణ పత్రం, బయోడేటాతో బ్రాడీపేట 2/17వ లైనులో బీపీహెచ్ మహిళా కళాశాల ఎదుట ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు హాజరు కావాలని పేర్కొన్నారు. గుంటూరు, బాపట్లతో పాటు ప్రకాశం జిల్లాల్లోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వాడరేవు లైట్ హౌస్‌లో సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్స్ - సర్వీసు మెన్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ గుణశీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల వాడరేవు లైట్ హౌస్‌లో 3 పోస్టులు ఉన్నాయని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మాజీ సైనికులు సంబంధిత పత్రాల జిరాక్స్ ప్రతులు రెండు సెట్లతో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ లోగా సంప్రదించాలని కోరారు. వైజాగ్‌లో లైట్ హౌస్, లైట్ షిప్ డైరెక్టరేట్ పోర్టులు, నౌకాశ్రయాలు, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధీనంలో సంస్థ, ఆంధ్ర తీర ప్రాంతంలోని 10 లైట్ హౌస్‌స్టేషన్లలో సెక్యూరిటీ గార్డ్స్‌గా మాజీ సైనికులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించుటకు చర్యలు చేపట్టారని తెలిపారు. మొత్తం 30 మందిని భర్తీ చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని డీఎస్పీ జగదీష్‌కు ఆదేశాలు

గురజాలటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గురజాల డీఎస్పీ జగదీష్‌ను హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం గతంలో డీఎస్పీ జగదీష్‌ను నాన్ - ఫోకల్ పోస్టు చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ క్రమంలో బుధవారం హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

ఆంధ్ర జట్టుకు లక్ష్మీ ప్రశర్మి ఎంపిక



లక్ష్మీ ప్రశర్మి

గుంటూరు క్రీడలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉమెన్ అండర్ -23 వన్డే క్రికెట్ జట్టుకి ఆల్ రౌండర్ సిద్దు లక్ష్మీప్రశర్మి ఎంపికైంది. డెహ్రాడూన్‌లో మార్చి 3 నుంచి 11 వరకు జరుగనున్న క్రికెట్ పోటీలలో పాల్గొననుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎంపికలో ఫాస్ట్ బౌలర్‌గా ఎక్కువగా వికెట్లు తీసి, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ఆల్ రౌండర్ ప్రతిభను కనబరిచింది. స్థానిక పిచ్చుకల గుంట ఏసీఏ క్రికెట్ మైదానంలో శిక్షణ పొందుతూ అండర్-17, 19 విభాగాల్లో నాగపూర్, విజయనగరంలో జరిగిన పోటీల్లో రాణించింది. ఈ సందర్భంగా తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు, శిక్షకులకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపింది.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ అదనపు కార్యదర్శి సుశీల్‌కుమార్



వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథాన్ని పరిశీలిస్తున్న సుశీల్ కుమార్ లోహాని, మైలవరపు కృష్ణతేజ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు, కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోందని.. దీంతో గ్రామాల ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహాని అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ పని తీరును క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా బుధవారం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామ పంచాయతీని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఏర్పాటు చేసిన స్వచ్ఛరథం సేవలను సుశీల్ కుమార్ పరిశీలించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో స్వర్ణ పంచాయతీ ద్వారా ఇంటి, నీటి పన్ను వసూళ్లను పరిశీలించారు. పరిశుభ్రంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డీపీఓ నాగసాయికుమార్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ లలితకుమారి, పంచాయతీ కార్యదర్శి విరివి పాల్గొన్నారు.

కొల్లిపర: సుశీల్‌కుమార్ లోహాని, రాష్ట్ర కమిషనర్ మైలవరపు కృష్ణచైతన్య పంచాయతీ భవన నిర్మాణ పనులు, నాణ్యతను వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యతలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డివిజనల్ పంచాయతీ అధికారి కుసుమశ్రీదేవి, డీఎల్‌పీవో స్వరూపరాణి, ఎంపీడీఓ సాంబిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, దానయ్య పాల్గొన్నారు.

పల్వరైజర్స్ సమస్యలు పరిష్కరించండి

● ఆర్థికశాఖ మంత్రి కేశవ్‌ను కోరిన ఎమ్మెల్యే యరపతినేని, నేతలు



మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని, పిడుగురాళ్ల పల్వరైజర్స్ అసోసియేషన్ నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలోని పల్వరైజర్ అసోసియేషన్ నేతలు బుధవారం సచివాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. పిడుగురాళ్లలోని పలు సున్నం, పల్వరైజర్ మిల్లులకు గత ప్రభుత్వ హయాంలో భారీగా పెనాల్టీలు విధించడం, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు నోటీసులు జారీచేస్తున్న వైనాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ స్పందిస్తూ.. ఈ అంశంపై వెనువెంటనే పరిశీలించి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కూడా కలిసి సున్నం వ్యాపారులు ఎదుర్కొంటున్న నోటీసుల అంశాన్ని పరిష్కరించే విధంగా చూస్తాన్నారు. మంత్రిని కలిసిన వారిలో కొత్త వెంకట సుబ్బారావు, పసుమర్తి సుబ్రహ్మణ్యం, మారం శ్రీనివాసరావు, కాకుమాను గోపి, జుజ్జూరి పుల్లారావు తదితరులున్నారు.

నాణ్యమైన సేవలే.. శ్రేష్ఠ హాస్పిటల్స్ లక్ష్యం

● ఎండీ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున



కేక్ కట్ చేస్తున్న శ్రేష్ఠ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వైద్య సేవలు అందించడమే శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రధాన లక్ష్యమని ఆ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున అన్నారు. శ్రేష్ఠ హాస్పిటల్స్ రెండో వార్షికోత్సవం ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఫస్ట్ ఎయిడెడ్ కిట్లు, ఆరోగ్య అవగాహన పోస్టర్లను పంపిణీ చేశారు. అనంతరం గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ ఆస్పత్రి సేవలను మరింత విస్తృత పరచడంతో పాటు వైద్య సాంకేతికను అప్‌డేట్ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. త్వరలోనే గుండె పరీక్షలకు ఉపయోగపడే 128-స్లైస్ సీటీ స్కానర్, న్యూరో శస్త్ర చికిత్సలకు ఆధునిక మైక్రోస్కోపులు, అత్యవసర సమయంలో వెంటనే సాయం అందేలా ఎమర్జెన్సీ ఎస్‌వోఎస్ సౌకర్యంతో రోగుల కోసం మొబైల్ యాప్‌ను తీసుకురాబోతున్నామని వివరించారు. ఫౌండర్, చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామి మాట్లాడుతూ ఈఎస్‌ఐ, ఆరోగ్య సహాయత, ఆరోగ్య భారత్, బీమా పథకాలు, క్యాష్ సేవల కింద శ్రేష్ఠ హాస్పిటల్స్ చికిత్స అందిస్తుందని చెప్పారు. వైద్యం మరింత మందికి అందుబాటులోకి ఉండేలా సీజీహెచ్‌ఎస్‌తో పాటు కార్పొరేట్, ప్రభుత్వ సంస్థలతో భాగస్వామ్యం పెంచుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

రాజుపాలెం,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): వివాహిత హత్యకు గురైన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేల్పుల ఈశ్వరయ్య మల్లేశ్వరి(45) దంపతులకు బాబు, పాప సంతానం. ఇద్దరికీ వివాహం చేశారు. మల్లేశ్వరి ఈ నెల 24 మధ్యాహ్నం 3 గంటలకు తనకు ఆరోగ్యం బాగోలేదని, హస్పటల్ చూపించకుంటానని వెళ్లింది. ఏమి జరిగిందో ఏమో బుధవారం ఉదయానికి ఉప్పలపాడు గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద ఈశ్వరయ్యకు చెందిన పాత రేకుల షెడ్‌లో శవమై కనిపించింది. మృతురాలి ఎడమ కాలి వేళ్లపై దోకుడు గాయాలు, ఎడమ చెవిపై బలమైన రక్తపు గాయం, కుడి చెయిపై కంది ఉంది. మృతదేహన్ని పరిశీలిస్తే ఎక్కడో చంపి ఇక్కడకు తీసుకువచ్చి పడేసి ఉంటారని భావిస్తున్నారు. స్థానిక ఎస్ఐ మణికృష్ణ మృతదేహన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులను, గ్రామస్థులను విచారించారు. పోలీసు జాగిలం ఈశ్వరయ్య ప్రస్తుతం ఉంటున్న నివాస గృహనికే వెళ్లడం చర్చాంశనీయాంశమైంది. గ్రామ పెద్దలు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పంచాయతీ నిమిత్తం మంగళవారం రాత్రి ఒంటి గంట వరకు మాట్లాడుతూనే ఉన్నట్లు సమాచారం. ఆ తరువాత సుమారు 2 గంటల సమయంలో విద్యుత్ సరఫరా కొన్ని నిమిషాల పాటు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని స్థానికులు అనుమా నిస్తున్నారు. మృతురాలి కుమార్తె శ్రీలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 151, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	72,040	
అమ్మకాలు	75,233	
నిల్వ	23,140	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21000
నెంబరు. 5	13500	21000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	21000
దేవనూరు డీలక్స్	15500	21500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19500
నెంబరు. 5	13000	20000
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17000
బ్యాడిగి 355	14000	20500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000

ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం

● వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్యూ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతంలో యువత పాత్ర కీలకం అని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధర రావు అన్నారు. కేంద్ర యువ జన, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో ఐదు రోజులు గా జరుగుతున్న అంతర్ రాష్ట్రీయ యువజన మార్పిడి సమ్మేళనం బుధవారంతో ముగిసింది. వర్సిటీలో ఎన్ ఎస్ఎస్ భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఒడిశాలోని 5 జిల్లాలు సంబల్పూర్, బార్గర్, కలహంది, బోలాన్గిర్, బాలాసోర్ నుంచి మొత్తం 37 మంది యువతి యువకులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్యా, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి.. దేశంలోని సాంకేతిక, పారిశ్రామిక పురోగతిపై యువతను ప్రోత్సహించడం.. యువ సమ్మేళనాల ద్వారా సాధ్యమవుతుందన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. మై భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి, ఎస్టీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ ఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి పాల్గొన్నారు. హాజరైన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ అందజేశారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూక దాడి

● హాస్పిటల్‌లో పరామర్శించి భరోసానిచ్చిన ఎమ్మెల్యే యరపతినేని



ఏడుకొండలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, నిఖిల్

పిడుగురాళ్ల, ఫిబ్ర వరి 25 (ఆంధ్ర జ్యోతి): గురజాల మం డలం తేలుకుట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బత్తు ల ఏడుకొండ లుపై బుధవారం వైసీపీ శ్రేణులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఏడు కొండలును హాస్పి టల్‌లో గుర జాల ఎమ్మెల్యే యరప తినేని శ్రీనివాసరావు, తనయుడు నిఖిల్ పరామర్శించారు. ఏడుకొండలు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వివరాల్లో వెళితే.. దైద అడ్డ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న ఏడుకొండలుపై వైసీపీ మూక దాడి చేసింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అతను కోలుకునే వరకు వైద్య ఖర్చులు తానే భరిస్తానని ఎమ్మెల్యే యరపతినేని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలామంది టీడీపీ నాయకులు హత్యకు గురయ్యారన్నారు. అధికారం కోల్పోయినా.. తెలుగుదేశం శ్రేణులపై దాడులకు పాల్పడడం.. మంచి పద్ధతి కాదని హితవు పలికారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఎమ్మెల్యే కోరారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ..

పెదకాకాని, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంటిలో దుండగులు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. అంచా రత్నకుమారి అనే మహిళ శివాలయం రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న హైదరాబాదులో తన పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లారు. పెరట్లో మొక్కలకు నీళ్లు పోసేందుకు ఇంటి ఎదురుగా ఉన్న ఓ మహిళకు తాళం ఇచ్చి వెళ్లారు. ఈ మహిళ 23న మొక్కలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉన్న విషయాన్ని గమనించి.. రత్నకుమారి కి సమాచారం అందించారు. ఆమె వచ్చి చూడగా.. బీరువాను పగలగొట్టి బంగారు గొలుసు, నల్లపూసల తాడు, లాకెట్టు, మూడు జతల పోగులు మొత్తం 52 గ్రాములు విలువగల బంగారం, కేజీ వెండి వస్తువులు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణస్వామి పేర్కొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అక్షరాంధ్ర అభ్యర్థుల నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అక్షరాంధ్ర అభ్యర్థుల నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. అక్షరాంధ్ర కార్య క్రమంపై విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 90,426 మంది నమోదయ్యారని, 9,043 మంది వలంటీర్లు బోధిస్తున్నారని వివరించారు. పలు కేంద్రాలను స్వయంగా సందర్శించా మని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలనే ధ్యేయంతో చర్యలు చేపట్టామన్నారు.

విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ ప్రీఫైనల్ పరీక్షలు ఈనెల 28వ తేదీన, ఫైనల్ పరీక్షలు మార్చి 15వ తేదీన జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు తమకు అవకాశం ఉన్న సమయంలో వచ్చి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వయోజన విద్యా డిప్యూటీ డైరెక్టర్ ఆంజనేయులు, డీఈవో షేక్ సలీం బాషా, జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విజన్ యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విజన్ యాక్షన్ ప్లాన్ - 2047 జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ ఆదేశించారు. విజన్ యాక్షన్ ప్లాన్ - 2047, జీరో పావర్టీ- పీ4 కార్యక్రమాల అమలుపై ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలపై ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర మార్గదర్శకాలను పాటించాలన్నారు. కార్యక్రమం అమలుకు అవసరమైన వ్యవస్థలను పటిష్టంగా వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బందికి విధుల గురించి స్పష్టంగా తెలియజేయాలన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో విజన్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించుటకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు జిల్లాస్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్ల సేవలను వినియోగించుకుంటారని చెప్పారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలు అంశాల్లో చేర్పులు, మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల సిబ్బంది పాల్గొన్నారు.

పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

● పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ కేంద్ర అదనపు కార్యదర్శి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధికి కీల కంగా నిలిచే జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర నిర్మాణ పనులను కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్‌కుమార్ లోహని పరిశీలించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఆయన గుంటూరు జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని సందర్శించి, నిర్మాణంలో ఉన్న వనరుల కేంద్ర భవన పనుల పురోగతిపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీలకు సాంకేతిక, పరిపాలనా, శిక్షణ మద్దతు అందించే ఈ కేంద్రం స్థానిక సంస్థల బలోపేతానికి దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అద నపు కార్యదర్శికి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వనరుల కేంద్ర ప్రాంగణంలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు సంకేతం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు క్రిష్ణ తేజ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, పంచాయతీరాజ్ శాఖ ప్రధాన ఇంజనీర్ శ్రీనివాసరావు, డీపీవో నాగ సాయికుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.శంకర్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.


నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్‌కుమార్ లోహాని, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు క్రిష్ణ తేజ తదితరులు

ఇంటర్ పరీక్షలను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

గుంటూరు(విద్య) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. ఎన్‌టీఆర్ స్టేడియం సమీపంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలోను, అయ్యప్ప స్వామి ఆలయం దగ్గరలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును గమనించారు. పరీక్ష కేంద్రాల్లో వస తులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత పాల్గొని వివరాలు తెలిపారు. బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు మొత్తం 31,977 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 30,748 మంది హాజరయ్యారని 449 మంది గైర్హాజ రైనట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జి.సునీత వెల్లడించారు వృత్తి విద్యా కోర్సులకు సంబం ధించి 1990 మంది విద్యార్థులకు గాను 1090 మంది హాజరయ్యారని 61 మంది గైర్హాజరైనట్లు వివరించారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

గుంటూరులో పాల విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణంలో బుధవారం పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు కేవీవీ సత్యనారాయణ పలు పాల విక్రయ కేంద్రా లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పాల విక్రయ దుకాణాలు, చిల్లర కేంద్రాలను పరిశీలిస్తూ నిబంధనల అమలుపై దృష్టి సారిం చారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎవరూ పాల విక్రయాలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పరిశుభ్రత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని విక్రేతలకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గుంటూరులోని పాల విక్రయ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పశు సంవర్థక శాఖ జేడీ సత్యనారాయణ

ఎన్టీఆర్ బస్టాండ్‌లో పారిశుధ్యం అధ్వానం

● కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యాలపై తీరు మారటం లేదు. ఇటీవల కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేసిన తరువాత రెండు రోజులు హడావిడి చేసిన అధికారులు, సిబ్బంది తరువాత షరామామూలుగా వదిలేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించటంలో నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ వారిలో మార్పు కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ ఆవరణలో మరుగదొడ్ల వద్ద అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. అటుగా రాకపోకలు సాగించాలంటేనే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దాంతో ప్రయాణికులు అటు వైపునకు వెళ్లటం మానేసి అనధికార ప్రదేశాల్లో మూత్ర విసర్జనలు చేస్తుండటంతో అధ్వానంగా మారుతోంది. ఇక బ్లీచింగ్ చల్లి వదిలేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల తాగునీటి కుళాయిల వద్ద గ్లాసులు ఏర్పాటు చేసినప్పటికీ కుళాయిలకు లీకులు ఉండ టంతో తాగునీరు వృథాగా పోతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కుర్చీలు లేకపోవటంతో అనేక మంది నిలబడి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. స్త్రీశక్తి పథకంతో మహిళ లు బస్టాండ్‌కు ఇటీవల పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. దీంతో మహిళల రద్దీకి అనుగుణంగా మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.


మరుగుదొడ్ల ఎదుట అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

మరుగుదొడ్ల వద్ద గందరగోళం

ఇటీవల మరుగుదొడ్ల వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మహిళలు వెళ్లే మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు మగవారు వెళ్లటంతో అదే సమయంలో ఒకరిద్దరు మహిళలు చూసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మందలించి వదిలేసినట్లు సమాచారం. పారిశుధ్యంపై కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా బస్టాండ్‌లో మౌలిక వసతులపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్



గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాటూరి మెడికల్ కళా శాలలో బుధవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా విచ్చేసిన గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఘన స్వాగతం పలికారు. వైద్య కళాశాల ప్రాంగణంలో గవర్నర్‌కు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించారు.

డ్రగ్ మాఫియాను అరికట్టాలి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల మాన, ప్రాణాలను బలిచేస్తున్న డ్రగ్ మాఫియాను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో బుధవారం పుప్పాల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా సమితి సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్యవక్తగా హాజరైన ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో సరైన చట్టాలు లేకపోవడంతో డ్రగ్ మాఫియా చెలరేగిపోతుందని అన్నారు. ఈ నేపథ్యంలో బలమైన చట్టాలు, కఠిన శిక్షలు అవసరమన్నారు. మరో వైపు కార్పొరేట్ హాస్పిటల్స్ రోగులను అడ్డగోలుగా దోపిడి చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వాలపై తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మా ట్లాడుతూ మార్చి 1 నుంచి 15 వరకు పార్టీ నిధి సేకరణ నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో బండెల నాసర్‌జీ, అకిటి అరు ణ్‌కుమార్, రావుల అంజిబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట ప్రారంభమైన నిరసన దీక్షలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటీ అమలు, మే నెల సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు జరుగుతాయని, ఆ తరువాత మార్చి 2న చలో విజయవాడ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దీక్షల్లో ధనలక్ష్మి, కె.స్వరూపరాణి, రజిని, శంషాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ శాస్త్రి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్య క్షుడిగా రావూరి లక్ష్మీనారాయణ శాస్త్రి నియమితులయ్యారు. లాలుపురం కార్యాలయంలో బుధవారం ఆయనకు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు నియామకపత్రాన్ని అందజేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నామీ ద నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు అధ్యక్షుడు తిరుపతిరావుకు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.


రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రికి నియామకపత్రాన్ని అందజేస్తున్న సీహెచ్ తిరుపతిరావు

భక్తి శ్రద్ధలతో తులసి పూజలు


గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్‌లోని మారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గోపూజ, బాల పూజ, ఒక లక్ష మోదక హోమం, సాయంత్రం ఈ చండీ హోమాలు జరిగాయి. అనంతరం సామూహిక తులసీ పూజలు, శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఉప్పవరపు వెంకట సింహాచల శాస్త్రిచే జరిగిన హరికథా గానం భక్తులకు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్ని ఆలయ సభ్యులు కొర్రపాటి రామారావు, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

కనులపండువగా శ్రీ ధాన్యలక్ష్మి కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రధానార్చకులు ప్రసాదు నేతృత్వంలో శ్రీధాన్యలక్ష్మి, నారాయణుల కల్యాణం వేద మంత్రాలతో అర్చక బృందం విశేషంగా నిర్వ హించారు. అనంతరం కల్యాణమూర్తులకు పుష్పాభిషేకం కనుల పండువగా జరిగింది.

ప్రాంతీయ గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రాంతీయ గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం రూ.17 వేల విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. విద్య ఫౌండేషన్ తర పున మహిళా, శిశు సంక్షేమ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన వి.బి. ప్రసాద్ లింగం బుధవారం ఈ పుస్తకాలను అందించారు. విశ్రాంత ఏటీవో నాగరాజు, సూపరింటెండెంట్ ఎం.ఎన్.మూర్తి సమక్షంలో ఈ పుస్తకాలను గ్రంథాలయ అధికారులకు అందజేశారు. గ్రంథాలయ అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ప్రాంతీయ గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న ప్రసాద్ లింగం, ఎంఎన్ మూర్తి, నాగరాజు

సహకార సంఘాల బలోపేతంలో ఉద్యోగులదే కీలకపాత్ర

● డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సం ఘాల బలోపేతంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో బుధవారం ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా 2026 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘాలను బలోపేతం చేయటంతో పాటు రైతులకు మెరుగైన సేవలందించటంలో ఉద్యోగులదే కీలకపాత్ర ఉం టుందన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ డీజీఎమ్ ఆర్‌సీఎస్ బాలాజీరావు, బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, బ్యాంకు అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులున్నారు.


నూతన సంవత్సర డైరీలను ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ మక్కెన, ఉద్యోగ సంఘం నాయకులు

మహిళల ఆరోగ్యానికి ప్రకృతి ఆహారం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి ప్రకృతి ఆహారం అనే నినాదంతో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం ఆరంభించను న్నట్లు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి వెల్లడించారు. అందులో భాగంగా బుధవారం గుం టూరు జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం- ఆరోగ్య, పోషణ విభాగం సంయు క్తంగా ఫుడ్ బాస్కెట్ కార్యక్రమానికి సంబంధించిన సమన్వయ సమా వేశం నిర్వహించారు. కార్యక్రమానికి సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ద్వారా ప్రతి గ్రామానికి ఆర్థిక సాయం అందించినట్లు మేనేజర్ రాజకుమారి తెలిపారు. కొల్లిపర, ఫిరంగిపురం, చేబ్రోలు ప్రాంతాల రైతులు ఫుడ్ బాస్కెట్ కోసం అందించగల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, పరి మాణం, ధరల వివరాలను ఆరా తీశారు. గ్రామస్థాయిలో రసాయన రహిత, ఆరోగ్యకర ఆహారం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఆమె తెలి పారు. మార్చి 8న సీఎం చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించను న్నట్లు తెలిపారు. సమావేశంలో ముకేశ్, గౌరీనాయుడు, కేశవ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏఐ శిక్షణ తరగతులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వ ర్యంలో మార్చి 1న ఏఐపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు బుధవారం ప్రకటన తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు జిల్లా లాంలోని చలపతి ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఇంటెలి జెన్స్, వర్చువల్ చాట్ బాట్ తయారీపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించా రు. రిసోర్స్‌పర్సన్‌గా వాల్‌మార్ట్ ఇండియా సైబర్ సెక్యూరిటీ విభాగ అధిపతి దిలీప్ వ్యవ హరిస్తారని వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఏ బ్రాంచ్ అయినా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్ ఇస్తారు. మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. వివరాలకు 9705333305, 7995061289 సంప్రదించాలని సూచించారు సంద ర్భంగా బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు.

ట్రై స్కూటర్స్ పంపిణీ కోసం దివ్యాంగులకు ఇంటర్వ్యూ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శారీరక విభిన్న ప్రతిభావంతు లకు మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ కోసం బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 158 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధ్యక్షతన గుంటూరు పట్టణం బృందావన్ గార్డెన్స్ ఒకటో లైన్‌లో ఉన్న ఎన్‌టీ ఆర్ స్టేడియంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జిల్లా ఎంపిక కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించింది. కమిటీ సభ్యులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 వివాదంలో ఆ ముగ్గురు డీఎస్పీలు వెనక్కి

● డీజీపీ కార్యాలయంలో తక్షణం రిపోర్టు చేయాలని ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : 2018 నోటిఫికేషన్‌కు సంబంధించి గ్రూపు 1 పరీక్ష పత్రాల మూల్యాంకనం, ఫలితాల ప్రకటనలో నెలకొన్న వివాదం నేపథ్యంలో ప్రస్తుతం డీఎస్పీలుగా లా అండ్ ఆర్డర్లో కొనసాగుతున్న వారందరినీ వెనక్కు రావలసిందిగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది డీఎస్పీలను తన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీజీపీ ఆదేశించారు. ఈ జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు డీఎస్పీలు ఉన్నారు. వీరిలో వెస్ట్ డీఎస్పీ కే.అరవింద్, సౌత్ డీఎస్పీ గొండెసి భానోదయ, గురజాల డీఎస్పీ బొడ్డేడ లోవ నాగజగదీష్ ఉన్నారు. తక్షణం ఈ ముగ్గురిని తన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీజీపీ ఆదేశించారు.

2018లో వచ్చిన గ్రూప్ వన్ నోటిఫికేషన్‌కు సంబంధించి ఆయా ప్రశ్న పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టు విచారణలో ఉండగా, కేసు దర్యాప్తు చేస్తున్న వి.శంకరన్‌ను ఈ మొత్తం వ్యవహారంపై విచారించి మార్చి 15లోగా నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం వ్యవహారంపై విచారణ జరుగుతుంది. అయితే వీరంతా డీఎస్పీలుగా లా అండ్ ఆర్డర్ విభాగంలో విధులు నిర్వహిస్తుంటే విచారణపై ప్రభావం ఉంటుందని వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వారందరిని రిపోర్ట్ చేయాలని డీజీపీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గురజాల, గుంటూరు వెస్ట్, గుంటూరు సౌత్ సబ్ డివిజన్లకు త్వరలో కొత్త డీఎస్పీలను నియమించనున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు వర్తింపజేయాలి

● అమరావతి అభివృద్ధికి నూతన దిశ- ప్లానెటోరియం

● అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి


ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యను శాసన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా ఉందని తెలియజేశారు. ఇటీవల నలుగురు పిల్లలతో తనను కలిసిన ఓ మహిళ పరిస్థితిని ఉదాహరణగా ప్రస్తావించారు. ఆ కుటుంబంలో ఒక బాలుడు బ్రెయిన్ సమస్యతో మంచానికి పరిమితమవ్వగా అతడికి పెన్షన్ అందడం లేదని తెలిపారు. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తి పోలీస్ శాఖలో అవుట్ సోర్సింగ్ విభాగంలో స్వీపర్‌గా పనిచేస్తూ నెలకు కేవలం రూ.12వేలు మాత్రమే జీతం పొందుతున్నాడని ఎమ్మెల్యే సభకు వివరించారు. 'సిక్స్ స్టెప్ వెరిఫికేషన్'లో అతడు ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు కావడం వల్ల, వారికి తల్లికి వందనం వంటి సంక్షేమ పథ కాలు అందడం లేదని తెలిపారు. కేటగిరీ-3 వంటి తక్కువ జీతాలు పొందుతున్న ఉద్యోగులకు తల్లికి వందనం, ఇళ్ల పథకాలు (టిడ్కో ఇళ్లు), పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు.

● ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో బుధవారం నిర్వహించిన జీరో అవర్ ఎమ్మెల్యే గళ్లా మాధవి అమరావతి అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణపై కీలక సూచనలు చేశారు. ప్రపంచం గర్వపడే రాజధాని నిర్మాణం జరుగుతున్న ఈ శుభ తరుణంలో పర్యాటక రంగానికి ప్రభుత్వం రూ.439 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో అమరావతి క్యాపిటల్ రీజియన్‌లో ఒక ప్రతిష్టాత్మక నక్షత్ర ప్రదర్శన శాల (ప్లానెటేరియం)తో పాటు జంతు ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

● బడ్జెట్ సమావేశాల్లో దేవదాయ శాఖపై ఎమ్మెల్యే మాధవి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేవాలయాల ప్రక్షాళనకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆలయాల నిర్వహణ కోసం ఈ ఏడాది రూ.249 వేల కోట్లు కేటాయించడం సంతోషకరమని అన్నారు.

ఒక్క ఫోన్‌తో స్పందించిన ఎమ్మెల్యే

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో ఓ నిర్మానుష్య ప్రదేశంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న యువకుల గురించి స్థానిక మహిళలు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యేకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె హుటాహుటిన ద్విచక్ర వాహనంపై అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రాకను గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం స్థానిక ప్రజలు, ఫిర్యాదు చేసిన మహిళతో ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రాం తంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని పోలీసులకు ఎమ్మెల్యే మాధవి ఆదేశాలు జారీ చేశారు.

ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ మోదేపల్లి అనూష

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కిమ్స్ శిఖర హాస్పిటల్, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గ నైజేషన్ సంయుక్త నిర్వహణలో ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. తొలుత సంస్థ వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ మోదేపల్లి అనూష మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులు శ్వాస సామర్థ్యాన్ని తగ్గించి, రోజు వారీ పనులకు ఇబ్బంది కలిగిస్తాయన్నారు. ఆస్తమా, న్యూమోనియా, క్షయ, ఫైబ్రోసిస్ వంటివి ముఖ్యమైనవన్నారు. పొగతాగడం, కాలుష్యం, ఇన్ఫెక్షన్లు దీనికి ప్రధాన కారణాలన్నారు. ధూమపానం మానేయడం, కాలుష్యానికి దూరంగా ఉండటం, ప్రాణాయామం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం సంస్థ వారు డాక్టర్ అనూషను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతలపాటి తిరుపతయ్య, కోగంటి బసవనందికేశ్వరరావు, దశరధి రామ య్య, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్న చేతుల్లో పెద్ద బాధ్యతలు

● జీవన రథాన్ని లాగుతున్న చిన్నారులు



గుంటూరు నగరంలో జీవన పోరాటం నడుమ చిన్నారుల ధైన్యం హృదయాలను కదిలిస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు, ఆటల వయసులోనే బాధ్యతలు మోస్తున్న ఈ చిన్నారి తన సైకిల్ రిక్షాపై సోదరీమణులను కూర్చోబెట్టి జీవన రథాన్ని ముందుకు నడిపిస్తోంది. ఇతర పిల్లలు పాఠశాల బాట పట్టే వేళ, ఈ చిన్నారి మాత్రం కుటుంబానికి తోడుగా నిలుస్తోంది. బాల్యం ఆటలకే పరిమితం కాకుండా జీవన పోరాటంగా మారిన ఈ సంఘటన మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోంది. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)



భగ్గుమంటున్న భానుడు



గుంటూరు జిల్లాలో ఎండలు రోజురోజుకీ తీవ్రంగా పెరుగుతున్నాయి. మధ్యాహ్న వేళ రహదారులపై వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనిమీద బయలుదేరిన మహిళలు తలపై గుడ్డలు కప్పుకుని ఎండను తట్టుకుంటూ సాగుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, ఎక్కువగా నీరు తాగాలని సూచిస్తున్నారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

క్రాపలో ఘనంగా గ్రామోత్సవం

● గ్రామంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ఊరేగింపు



గ్రామోత్సవంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు

కొల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొల్లూరు మండల పరిధిలోని క్రాప గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఘనంగా గ్రామోత్సవం జరిపారు. నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠ కార్యక్రమానికి ముందుగా ఆలయ ప్రాంగణంలో కోగంటి ఈశ్వర్‌చంద్ దంపతులు యజ్ఞాలు, హోమాలను భక్తి ప్రపత్తులతో జరిపారు. 18 అడుగుల ఎత్తులో రూపొందించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కూడా శాస్త్ర ప్రకారం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10.08లకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని రుత్వికులు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించనున్నారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి నూతనంగా నిర్మింపజేసిన ఆలయాల్లో ప్రతిష్ఠించిన స్వామి అమ్మవార్లను దర్శించుకొని తీర్థ, అన్న ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ, కోగంటి వారి కుటుంబసభ్యులు కోరారు.



హోమంలో పాల్గొన్న ఈశ్వర్‌చంద్ దంపతులు

ఆరంభానికి ముందే ముగింపు పలకాలి

(5వ పేజీ తరువాయి)

సజావుగా సాగడానికి వీలుంటుంది.

ముగింపు ఇక్కట్లివే..

నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వాటికి సంబంధించి ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే నిబంధనల ప్రకారం క్లియరెన్స్ వస్తుంది. కానీ, దీనికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఏళ్ల నాటి నుంచి పనులు పెండింగ్‌లో ఉండ డంతో వాటి తాలూకా అగ్రిమెంట్ పత్రాలు, ఎంబుక్ రికార్డులు వెతకడం సవాల్‌గా మారింది. వేతనాల తాలూకా ప్రక్రియ ముగించే విషయంలో పూర్తి బాధ్యత డ్వామా తీసుకుంటుందని, కానీ ఇంజనీరింగ్ పనులకు వచ్చేసరికి పంచాయతీ రాజ్‌శాఖదే కీలక పాత్ర కాగా అటు వైపు నుంచి సహకారం దక్కడం లేదని చెబుతున్నారు. పనులను అప్‌లోడ్ చేసే విషయంలో కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ సమయంలో కూడా తమకు పెండింగ్ బిల్లులు అందకుండా పోయే ప్రమాదముందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఉపాధి హామీలో చేపట్టిన ఐదు పనులకు సంబంధించి ముగింపు ప్రక్రియ శరవేగంగానే జరుగుతోందని, కానీ ఇంజనీరింగ్ పనులే నత్తను తలపిస్తున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

ప్రత్యేక డ్రైవ్ చేపట్టినా..

పెండింగ్ పనులన్నింటినీ ముగించడానికి మండలాల వారీగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి పంచాయతీల్లో పనులు సజావుగా జరగాలంటే మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా మార్చి 31లోగా అన్ని పనులు ఆన్‌లైన్‌లో ముగిసినట్లు కేంద్రానికి నివేదించాల్సిందే. పెండింగ్ బిల్లులు చెల్లించే విషయంలో నిర్దిష్ట మార్గదర్శకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేశాయి. వీటికి అనుగుణంగా ఆయా మొత్తాలకు పరిమితి కూడా విధించారు. కానీ, పెండింగ్ బిల్లుల విషయంలో దాదాపు 5 శాతం పనులు ముగించడం సాధ్య పడదని, అలా అని సదరు మొత్తాలు చెల్లించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చెబుతున్నారు.

వాటా విషయంలో మార్పులు

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు రాష్ట్రం పదిశాతం వాటా భరిస్తుండగా, మిగిలిన వాటా కేంద్రానిదే. కేంద్రం తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రం వాటా 40 శాతానికి పెరగనుంది. శ్రామికులకు చెల్లించే వేతనాల ఆధారంగా ఈ భారం ఉండనుంది. మెటీరియల్ కాంపోనెంట్ నిధులను 60:40 నిష్పత్తిలో కేంద్రం కేటాయించనుంది. మారిన నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లో పథకాన్ని అమలు చేయడంపై ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామని, ఎదురయ్యే సంక్లిష్టతలను కూడా అధిగమిస్తూ మార్గదర్శకాల మేరకు పథకాన్ని అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పరిశ్రమలో వెనుకంజ

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, బాపట్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తాజాగా విడుదలైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్‌ఐపీబీ) 15వ జాబితాలోనూ గుంటూరు, బాపట్ల జిల్లాలు చివరి వరుసలో నిలిచాయి. గడిచిన ఏడేళ్లలో పారిశ్రామిక ప్రగతి మూడు జిల్లాల్లో అంతంతమాత్రంగానే ఉంది. ఆది నుంచి మధ్యాంధ్రపై ప్రభు త్వం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలకు బలం చేకూర్చేలా తాజాగా విడుదలైన ఎస్‌ఐపీబీ ఆమోదించిన పెట్టుబడుల జాబితా ఉంది. ఈ జాబితాలో మూడు జిల్లాల్లో పరిశ్రమల ఏర్పా టు నామమాత్రంగానే ఉంది. కేవలం వ్యవ సాయ రంగంపైనే దృష్టి సారించడం వల్ల పారిశ్రామికంగా ఈ ప్రాంతం ముందుకెళ్లే అవ కాశమే లేకుండా పోయింది. రాష్ట్ర పారిశ్రామి కరంగంలో ఒకప్పుడు అత్యంత కీలకమైన జిల్లా గా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లా ఇప్పుడు రేసులో పూర్తిగా వెనకబడిపోయింది. గడిచిన ప్రభుత్వంలో పరిశ్రమల ప్రస్థావన లేకుండానే ఐదేళ్లు గడిచిపోగా, ఈ ప్రభుత్వంలో తొలి రెండేళ్లు అలానే కొనసాగింది. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఊసే లేదు. రూ.44,600 కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. అవన్నీ రాజధాని అమరావతి పరిధిలోనివే. కూటమి ప్రభుత్వం వచ్చాక 16 నెలల్లో ఎస్‌ఐపీబీ ఆమోదించిన పెట్టుబడులు రూ.11.50 లక్షల కోట్లు. వీటిలో రాయలసీమ జిల్లాలకు 52శాతం పెట్టుబడులు వెళ్లగా, ఉత్తరాంధ్ర జిల్లాలకు 40 శాతం వెళ్లాయి. మిగిలిన 8 శాతం మధ్యాంధ్ర జిల్లాలకు పెట్టుబడులుగా వచ్చాయి. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు వచ్చిన పెట్టుబడులు నా మమాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి.



పరిశ్రమలు ఖాయిలా..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతంలో స్థాపించిన పరిశ్రమలు మినహా ఈ ఏడేళ్లలో కొత్తగా స్థాపించిన పరిశ్రమలు లేవనే చెప్పాలి. ఇక అప్పట్లో ఏర్పాటు చేసిన పరిశ్రమల పని తీరు అంతంత మాత్రంగానే ఉంది. స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు దాదాపు ఖాయిలా అంచుకు చేరుకున్నాయి. దీంతో అవి మూసివేత ప్రమా దంలో ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, వాటి సంఖ్యలో ఇప్పుడేమీ మార్పు రాలేదు. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి పరిశ్రమలు తప్ప ఉమ్మడి జిల్లాలో చెప్పుకోదగిన పరిశ్రమలు ఏమీ లేవు. పొగాకు ఆధారిత పరిశ్రమల పరిస్థితి కూడా ఆ శించినంత స్థాయిలో లేదు. కాగా సున్నపురా యి, నాపరాయి వంటి వనరులు పుష్కలంగా ఉండి, అటవీ సంపదను కలిగి అమితంగా ఉ న్న పల్నాడు జిల్లాలో కూడా కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేకపోవడం విషాదం. సముద్ర తీరం,ఆక్వారంగం విస్తారంగా ఉన్న బాపట్ల జిల్లా పరిస్థితి ఇంచుమించు అలానే ఉంది.

రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకు జిల్లాలో 20 మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తర్వాత ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. 2014- 21 మధ్య గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9 భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా రూ.2,485.47 కోట్ల యెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. కాగా 2021-22, 2022-23, 2023-24, 2024-25 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, ఒక్క రూపాయి పెట్టుబడి గానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని గణాం కాలు చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 94,189 ఎంఎస్ఎంఈలు ఉండగా అందులో సూక్ష్మ పరిశ్రమలే 90,911 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 34,990 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ఉండగా వాటిలో 27,758 సూక్ష్మ, 187 చిన్న, 5 మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27,950 ఎంఎస్ఎంఈలు ఉండగా, వాటిలో 27,758 సూక్ష్మ పరిశ్రమలు, 291 చిన్న, 4 మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. అంటే మొత్తం ఎంఎస్ఎంఈల్లో 95 శాతానికి పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. గణాంకాలను బట్టి చూస్తే ఎంఎస్ఎంఈల సంఖ్య భారీగా కనిపిస్తున్నా వాటిలో ఇళ్ల దగ్గర నడుపుకునే చిల్లరకొట్లు కూడా ఆ జాబితాలో చేర్చారు.

ఒక్క క్లిక్‌తో రైల్వే పార్శిల్ సేవలు

● రైల్‌పార్శిల్ యాప్‌ను ప్రారంభించిన రైల్వేశాఖ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా సేవలను ఇళ్ల వద్దకే రైల్వే శాఖ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఎవరైనా రైళ్ల ద్వారా సరుకు రవాణా చేసుకోవాలంటే సమీపంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ బుకింగ్ చేసుకోవా ల్సిన పరిస్థితి. అలానే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సరుకులను కూడా అక్కడికే వెళ్లి సంబం ధిత పత్రాలు సమర్పించి స్వీకరించాలి. అయితే సరుకు రవాణాలో పోటీ పెరగడంతో రైల్వే శాఖ కూడా పార్శిల్ సేవలను వినియోగదారుల ఇం టి ముంగిటకే తీసుకొచ్చేందుకు కొత్తగా మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఈ యాప్‌ను అం డ్రాయిడ్, ఐవోఎస్ ప్లేస్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పార్శిళ్లను బుకింగ్ చేసుకోవచ్చు.

● వాడకం ఇలా...

రైల్ పార్శిల్ యాప్‌లోకి మొబైల్ నంబరు, పేరు, చిరునామా, ఆధార్‌కార్డు నమోదు చేయడం ద్వారా ప్రొఫైల్ సృష్టించుకొని లాగిన్ కావొచ్చు. అందులో రెండు ఆప్షన్స్ ఉంటాయి. ఒకటి స్టేషన్ నుంచి స్టేషన్‌కు, మరొకటి డోర్ టూ డోర్ ఈ రెండింటిలో ఒకదానిని ఎంపిక చేసుకొని మిగతా వివరాలు నమోదు చేయాలి. రెగ్యులర్ పార్శిల్ కింద వాహనాలు, ట్రాన్స్‌పోర్టు ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, మీడియా, గృహోప కరణాలు, ఫర్నీచర్, డెడాకర్స్, పండ్లు, కూరగాయలు, ఆహారం, మెషీనరీ, టూల్స్, మెటల్, ప్లాస్టిక్, పేపర్ అండ్ స్టేషనరీ, డెయిరీ, ఆయిల్ ఉత్పత్తులు, బేవరేజస్, లిక్విడ్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్, కుక్‌వేర్, వంట పాత్రలు, కంటైనర్లు, బతికున్న జంతువులు, వ్యవసాయ ఉత్పత్తులు, సెక్యూరిటీ ఉత్పత్తులు, ఇండస్ట్రియల్ కెమికల్స్ వంటివి బుకింగ్ చేసుకోవచ్చు.

స్టేషన్ టూ స్టేషన్ అయితే ఎవరైతే సరుకు లను స్వీకరిస్తారో వారి పేరు, మొబైల్ నంబరు, ఈమెయిల్ ఐడీలను నమోదు చేయాల్సి ఉం టుంది. డోర్ టూ డోర్ అయితే చిరునామ, మొబైల్ నంబరు, ఈమెయిల్ ఐడీ బుకింగ్ చేసే వారివి, స్వీకరించే వారివి నమోదు చేయాలి. ఆ తర్వాత ఏ వస్తువులు అయితే పార్శిల్ చేయదలిచారో ఆ కేటిగిరీని ఎంపిక చేసుకొని ఫోటోతో సహా వివరాలు అప్‌లోడ్‌చేయాలి. ఆ తర్వాత డిజిటల్ పేమెంట్ చేయాల్సి ఉంటుంది. నగదు చెల్లింపు పూర్తయ్యాక డోర్‌స్టెప్ పికప్ ప్రారంభమౌతుంది. అనంతరం ట్రాకింగ్ నంబరు వస్తుంది. దాని ఆధారంగా పార్శిల్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు.

● బల్క్‌షిప్‌మెంట్ త్వరలో...

త్వరలో బల్క్‌షిప్‌మెంట్ సేవలను కూడా వినియోగదారులకు రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. నాలుగు టన్నుల వరకు ఎస్‌ఎల్‌ఆర్‌లు, 24 టన్నుల వరకు పార్శిల్ వ్యాన్, కిసాన్ రైల్స్, నాన్ టైంటేబుల్డ్ పార్శిల్ సేవలను కూడా తీసుకురానున్నట్లు రైల్వేశాఖ తెలిపింది.





గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులతో గవర్నర్ అబ్దుల్ నజీర్, పాల్గొన్న కాటూరి వైద్యశాల ఛైర్మన్ కాటూరి సుబ్బారావు, హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ తదితరులు

వైద్యం వృత్తి కాదు.. సేవ

(5వ పేజీ తరువాయి)

చికిత్సలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రోగులకు సమయానికి నాణ్యమైన వైద్యం అందించడం తమ ప్రధాన లక్ష్యమ న్నారు. వైద్య వృత్తిలో సేవాభావం, నైతిక విలు వలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. తొలుత గవర్నర్ పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన గుండె వైద్య క్యాత్ ల్యాబ్, అడ్వాన్స్ గుండె శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ చైతన్య, డీన్ డాక్టర్ చల్లా మోహనరావు, డిప్యూటీ సూపరిం టెండెంట్ డాక్టర్ అజయ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, సీవోవో తుషార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, దండమూడి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడోత్సవాలు 2026 జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం వాలీబాల్, షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

తెనాలి రైల్వే స్టేషన్‌లో...

ఎఫ్‌వోబీకి గడ్డర్ల ఏర్పాటు పూర్తి

● త్వరలో అందుబాటులోకి విశాలమైన కాలినడక వంతెన



తెనాలి రైల్వేస్టేషన్‌లో ఎఫ్‌వోబీ నిర్మాణానికి ఏర్పాటుచేసిన గడ్డర్లు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై - విజయవాడ ప్రధాన రైలుమార్గంలో కీలకమైన తెనాలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఈ రైల్వే జంక్షన్ అభివృద్ధికి రూ. 27.70కోట్లను కేటాయించింది. అందులో భాగంగా నిర్మిస్తున్న 12 మీటర్ల విశాలమైన కాలినడక వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 1వ ప్లాట్‌ఫాం నుంచి 2/3, 4/5 మీదగా సర్క్యులేటింగ్ ఏరియా వరకు ఈ వంతెన నిర్మాణం జరుగుతున్నది. మొత్తం మూడు స్పాన్‌లలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం కీలకమైన 33 గడ్డర్ల ఏర్పాటును రైల్వే కన్‌స్ట్రక్షన్ విభాగం విజయవంతంగా పూర్తిచేసింది. సాధ్యమైనంత త్వరగా ఈ వంతెనను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన పనులు చేపట్టారు. ప్రస్తుతం రోజుకు సగటున 17వేల మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణిస్తున్నారు. భవిష్యత్తులో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ప్రస్తుతం ఉన్న ఫుట్ బ్రిడ్జి ఇబ్బందికరంగా మారడంతో పెద్ద రైల్వేస్టేషన్లలోలా సువిశాలమైన బ్రిడ్జిని రైల్వే శాఖ నిర్మిస్తోంది. దీంతోపాటుగా వెయిటింగ్ హాల్స్ ఆధునికీకరణ, లిఫ్టులు, ఎస్కలేటర్లు, మోడ్రన్ టాయ్‌లెట్లు, లైటింగ్‌ను మెరుగుపరచడం, దివ్యాంగులకు సదుపాయాలు, వన్ స్టేషన్ వన్ ప్రొడక్టు అవుట్‌లెట్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ సమావేశం

● రాజధానిలో మౌలిక అభివృద్ధి పనులపై చర్చ

● రహదారి భద్రతపై ప్రణాళిక రచన

తుళ్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో రహదారి భద్రతా చర్యలు అమలుపై రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కెపాసిటీ బిల్డింగ్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశాన్ని పీజీఎంసీ నుంచి గాజుల అరుణ్ కుమార్, కోట కోమల్ నిర్వహించారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు, రహదారులపై భద్రతా చర్యలు, అమలు విధానాలను మరింత బలోపేతం చేయడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రహదారుల కాంగ్రెస్ మార్గదర్శకాలు, సీఆర్డీఏ ప్రామాణిక కార్యాచరణ విధానాల ప్రకారం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్ల అమలు విధానంపై విస్తృతంగా చర్చ జరిగింది. అమరావతిలో నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సరైన బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలపై నిర్వాహకులు స్పష్టమైన సూచనలు చేశారు. అమరావతి రాజధాని గ్రామాల్లో ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదాలు తీరుపై సమీక్ష నిర్వహించి, ట్రంక్ రోడ్ల ప్రణాళికతో అనుసంధానమైన బైపాస్ రోడ్ల ద్వారా గ్రామాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించి, సురక్షిత ప్రయాణాలు జరిగేందుకు వీలుగా అమలు చేయాల్సిన కార్యాచరణను వివరించారు. దీనివల్ల ట్రాఫిక్ సజావుగా సాగడమే కాకుండా రహదారి భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. నిర్మాణ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సురక్షితంగా సాగేందుకు, కార్మికులు ప్రయాణికుల భద్రతను కాపాడేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ రహదారి భద్రతా విధానాలను పరిచయం చేసి, అమరావతిలో అవి ఎలా అనుసరించవచ్చో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం ఈఎస్ఎమ్ బృందం పోషించే కీలక పాత్రను కూడా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమన్వయంతో వేగవంతంతగా చర్యలు తీసుకోవడం గురించి వివరించారు. సమావేశానికి ఏపీ సీఆర్డీఏ నుంచి అసిస్టెంట్ లేబర్ కమీషనర్ అనితా వాణి, లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, తదితర సిబ్బంది హాజరైయ్యారు. పీజీఎంసీ నుంచి ముఖ్య అధికారులు మనోహర్ రెడ్డి, సూర్యనారాయణ, గంగాధరి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.



రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో రహదారి భద్రత చర్యలు గురించి మాట్లాడుతున్న పీజీఎంసీ అధికారి



హిందూ సంప్రదాయ పద్ధతిలో జగదీష్, లీనా వివాహం

సరిహద్దులు దాటిన ప్రేమ

● రేపల్లె అబ్బాయి పోలాండ్ అమ్మాయి వివాహం

● హిందూ సంప్రదాయ పద్ధతిలో రేపల్లెలో పెళ్లి



జగదీష్, లీనా

రేపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వారిద్దరివీ వేరు వేరు దేశాలు, వేరు వేరు సంస్కృతులు.. కానీ ఒక్కటైన వారి హృదయాలు ప్రేమకు సరిహద్దులు లేవని నిరూపించాయి. బుధవారం బాపట్ల జిల్లా రేపల్లెలో ఇండియా అబ్బాయి, పోలాండ్ అమ్మాయి వివాహంతో ఒక్కటయ్యారు. రేపల్లెకు చెందిన కాట్రగడ్డ జగదీష్ ఉన్నత విద్యకోసం పోలాండ్ వెళ్ళాడు. అక్కడ ఎంబీఏ చదువుతున్న సమయంలో ఆ దేశానికి చెందిన లీనా అనే యువతితో పరిచయమైంది. స్నేహంగా మొదలైన ఆ పరిచయం కాలక్రమేణా ప్రేమగా మారింది. ఇరువురు తమ ప్రేమ విషయాన్ని వారి వారి కుటుంబసభ్యులకు తెలియజేశారు. పెద్దలు వారి వివాహానికి అంగీకరించడంతో రేపల్లె ఉప్పూడి రోడ్డులోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో హిందూ సంప్రదాయ పద్ధతిలో వారి వివాహం వైభవంగా జరిగింది. బంధువులు, స్నేహితులు, ప్రముఖులు హాజరై వారిని ఆశీర్వదించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 26 ఫిబ్రవరి 2026

కౌన్సెలింగ్

గురక తగ్గేదెలా?

డాక్టర్! మా వారికి 50 ఏళ్లు. ఆయన గురకతో కుటుంబమంతా అసౌకర్యానికి గురవుతున్నాం. గురక వల్ల ఆయనకు కూడా తరచూ నిద్ర మెలకువ అయిపోతూ ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ సమస్యకు కారణమేంటి?
- ఓ సోదరి, హైదరాబాద్

స్థూలకాయం, నాలుక పెద్దగా ఉండడం, కొండ నాలుక పెద్దగా ఉండడం, దవడల నిర్మాణంలో తేడాలు ఉన్నవారికి గురక సహజం. ఇవన్నీ శ్వాసనాళానికి అడ్డంకులుగా మారతాయి. అయితే గురకతో నిద్రకు ఆటంకం కలిగే పరిస్థితులు కూడా రెండు రకాలుగా ఉంటాయి. నిద్రలో గురక వల్ల మెలకువ అయిపోవడం, అసలు నిద్రలోకే జారిపోలేకపోవడం. ఈ రెండు



ఇబ్బందులూ స్లీప్ ఆప్నియాను కలిగించేవే! అయితే ఎంత తరచుగా నిద్ర మెలకువ అయిపోతోంది? మెలకువ అయ్యేలోగా ఎంత ఆక్సిజన్ లోపం కలుగుతోంది? ఎంతసేపు ఆక్సిజన్ ప్రసారంలో ఆటంకం కలుగుతోంది? అనే విషయాలను కనిపెట్టే పరీక్షలు ఉన్నాయి. అవేంటంటే....

స్లీప్ స్టడీ:
నిద్రపోయే సమయంలో రాత్రంతా నిద్ర ప్యాటర్న్‌ను పరిశీలించే పరీక్ష ఇది. గురకతో పాటు శ్వాస ఎన్నిసార్లు, ఎంతసేపు ఆగిపోయింది? అలా ఆగడం వల్ల శరీరంలో తగ్గిన ఆక్సిజన్ గురించిన పూర్తి వివరాలు తెలుస్తాయి.

డైనమిక్ ఎమ్మారై:
నిద్రలో ఉన్న సమయంలో శ్వాసకు నాలుక, కొండ నాలుక, శ్వాసనాళం చుట్టూ ఉండే కండరాల వల్ల గురక మొదలవుతుంది. అయితే వీటిలో దేని వల్ల గురక తలెత్తి, నిద్రాభంగం కలుగుతోందో ఈ పరీక్షతో తెలుస్తుంది.

డ్రగ్ ఇండ్యూస్‌డ్ స్లీప్ ఎండోస్కోపీ:
మందులతో నిద్రమత్తులోకి తీసుకువెళ్లి, గొంతులోకి ట్యూబ్‌ను పంపి, గురకకు కారణమయ్యే పరిస్థితిని కనిపెట్టే పరీక్ష ఇది. దీంతో అసలు కారణం కచ్చితంగా తెలుసుకోవచ్చు.

గురకకు చికిత్స!
గురకకు కారణాలు ముక్కు నుంచి గొంతు వరకూ ఉండే మార్గంలో ఎక్కడైనా ఉండవచ్చు. కొందరికి ముక్కు దూలం వంకర ఉండి, ఆ కారణంగా గురక వస్తూ ఉండవచ్చు. ఇంకొందరికి కొండనాలుక లేదా నాలుక పెద్దవిగా ఉండి, అవి గురకకు కారణం కావచ్చు. మరికొందరికి శ్వాసనాళం చుట్టూ ఉండే మెత్తని కణజాలం ప్రకంపనలకు గురై, గురకకు దారితీస్తూ ఉండవచ్చు. దవడల నిర్మాణంలో తేడాల వల్ల కూడా గురక వస్తూ ఉండవచ్చు. ఇలా కారణాన్ని బట్టి చికిత్సలు ఆధారపడి ఉంటాయి. చికిత్సల్లో ప్రధానంగా సాఫ్ట్ టిష్యూ సర్జరీ లేదా స్కెలెటల్ సర్జరీలను ఎంచుకోవచ్చు. సాఫ్ట్ టిష్యూ సర్జరీలో భాగంగా టాన్సిల్స్, అడినాయిడ్, నాలుక, కొండనాలుక, స్వరపేటికలో లోపాలను సరిచేస్తారు. స్కెలెటల్ సర్జరీలో గురకకు ఆస్కారం లేకుండా దవడలను సరిచేస్తారు.

• **డాక్టర్ గౌతమ్ దెందుకూరి,**
కన్సల్టెంట్ డెంటల్ అండ్ మాక్సిలోఫేసియల్ సర్జన్,
హైదరాబాద్.

వీటికి విత్తనాలు లేవు..!

విత్తనాలు లేకుండానే కొన్ని రకాల మొక్కలను పెంచవచ్చు. వాటి వివరాలు...

అల్లం: దీని మీద కూడా రైజోమ్ అనే బుడిపె పెరుగుతుంది. దీన్ని కోసి మట్టిలో నాటితే అల్లం మొక్క పెరుగుతుంది.



ఉల్లిపాయ: ఉల్లి కాడలకు చివరలో బల్బు లాంటి భాగం ఉంటుంది. దీన్ని మట్టిలో నాటితే ఉల్లిపాయ మొక్క పెరుగుతుంది.

ఆలుగడ్డ: చాలా రోజులపాటు ఆలుగడ్డలను నిల్వ ఉంచితే వాటి మీద చిన్న బుడిపెల్లాంటి మొలకలు వస్తాయి. ఈ భాగాన్ని చాకుతో కోసి మట్టిలో నాటితే సులువుగా మొక్కలు పెరుగుతాయి. చల్లని వాతావరణంలో పొడిగా ఉన్న మట్టిలో ఆలుగడ్డ మొక్క ఏపుగా పెరుగుతుంది.



కలబంద: దీని కాండం వద్ద చిన్న చిన్న పిలకలు ఏర్పడుతుంటాయి. వీటిని జాగ్రత్తగా వేరు చేసి కుండీల్లో నాటుకుంటే కలబంద చక్కగా పెరుగుతుంది. ఈ మొక్కకు ఎక్కువగా ఎండ తగులుతూ ఉండాలి. మట్టి ఎప్పుడూ తడిగా ఉండాలి.

వెల్లుల్లి: వెల్లుల్లి రెబ్బను మట్టిలో నాటితే చాలు. మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి.



స్ట్రాబెర్రీ: ఈ పండ్ల మీద చిన్న సైజు రన్నర్లు ఉంటాయి. వీటిని జాగ్రత్తగా సేకరించి మట్టిలో నాటితే స్ట్రాబెర్రీ మొక్క పెరుగుతుంది. రోజంతా సూర్యరశ్మి సోకుతూ ఉంటే మొక్క ఏపుగా పెరుగుతుంది.

పుదీనా: దీని కాడలను మట్టిలో నాటి తరచూ నీళ్లు చిలకరిస్తూ ఉంటే మొక్క గుబురుగా పెరుగుతుంది. దీనికి రోజూ కొద్దిసేపు ఎండ తగిలేలా చూసుకోవాలి.



అరటి: దీని కాండానికి దగ్గరలో చిన్న పిలకల్లాంటి సక్కర్లు ఏర్పడతాయి. వీటిని జాగ్రత్తగా సేకరించి దూర దూరంగా మట్టిలో నాటితే అరటి మొక్కలు పెరుగుతాయి.



సంసార సాగరాన్ని ఈదుతూనే స్విమ్మింగ్‌పూల్‌లో బంగారు పతకాలు కొల్లగొడుతున్నారు 42 ఏళ్ల అనితాకుమారి. విశాఖ మట్టిలో పుట్టి నేపాల్ గడ్డపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఈ 'వండర్ ఉమన్' ప్రయాణం ప్రతి మహిళకు ఒక స్ఫూర్తి పాఠం.

అలలపై గెలుపు సంతకం

వివాహమై, పిల్లలు పుట్టాక ఇక కెరీర్ ముగిసిపోయిందని, వంటగదికే ఇక పరిమితమని చాలామంది మహిళలు భావిస్తుంటారు. కానీ, మనసులో సంకల్పం ఉంటే వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని, ఆశయాలకు ఆకాశమే హద్దు అని నిరూపిస్తున్నారు విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన చింతపల్లి అనితాకుమారి. 42 ఏళ్ల వయసులో ఇద్దరు పిల్లల తల్లిగా గృహిణి బాధ్యతలు నిర్వర్తిస్తూనే, అంతర్జాతీయ ఈత పోటీల్లో పతకాల పంట పండిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు.

నేపాల్‌లో స్వర్ణ గర్జన

ఈ ఏడాది జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు నేపాల్‌లోని పోఖరా నగరంలో 'సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్' (ఎస్‌బీకేఎఫ్) నిర్వహించిన అంతర్జాతీయ ఈత పోటీలు అనిత జీవితంలో ఒక మైలురాయిగా నిలిచాయి. ఈ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె తన అద్భుత ప్రదర్శనతో అందరినీ అబ్బురపరిచారు. భూటాన్, నేపాల్, శ్రీలంక, మలేసియా వంటి దేశాల నుంచి వచ్చిన 11 మంది అగ్రశ్రేణి స్విమ్మర్లతో పోటీపడి 40-45 ఏళ్ల వయసు విభాగంలో ఏకంగా మూడు బంగారు పతకాలను తన ఖాతాలో వేసుకున్నారు. ఆమె విజయానికి ముగ్ధులైన ఎస్‌బీకేఎఫ్ అధ్యక్షుడు పంకజ్ గవాలే, డైరెక్టర్ జనరల్ శివ తివారీ స్వయంగా ఆమెను అభినందించి ప్రత్యేక ప్రశంసా పత్రం అందజేశారు. 50 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 100 మీటర్ల ఫ్రీస్టైల్.. ఇలా మూడు వేర్వేరు విభాగాల్లో ఆమె ప్రదర్శించిన వేగం, నైపుణ్యం అంతర్జాతీయ కోచ్‌లను సైతం ఆశ్చర్యపరిచింది.

గ్రామీణ నేపథ్యం నుంచి అంతర్జాతీయ స్థాయికి అనితకుమారి ప్రయాణం విశాఖ జిల్లాలోని మింది అనే చిన్న గ్రామంలో మొదలైంది. చిన్నతనంలో తన అమ్మమ్మ, తాతయ్య శివరామయ్య వద్ద ఉంటూ ఆరో తరగతి వరకు చదువుకున్నారు. గ్రామీణ వాతావరణంలో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఈత అంటే చాలా సరదా. దీనిని గమనించిన తండ్రి ఆమెను ప్రోత్సహించారు. ఆ తర్వాత తండ్రినే గురువుగా భావించి ఈతలో మెళకువలు నేర్చుకున్నారు.

పెళ్లి తర్వాత కూడా..

ఇంటర్ వరకు చదువుకున్న అనితకు తగరపువలసకు చెందిన ఆర్మీ హవల్దార్ చింతపల్లి అప్పలరాజుతో వివాహమైంది. సాధారణంగా పెళ్లయ్యాక తమ కెరీర్ ముగిసిపోతుందని క్రీడాకారులు అనుకుంటారు. కానీ, అనిత విషయంలో అది రివర్స్ అయింది. భర్త ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేసినా, ఆమె ఆశయాలకు అడ్డు చెప్పలేదు సరికదా ఆమెకు కొండంత అండగా నిలిచారు. ఇద్దరు అబ్బాయిలు పుట్టినా స్విమ్మింగ్ ప్రాక్టీస్‌ను మాత్రం ఆమె వదిలిపెట్టలేదు. కోచ్ శ్రీనివాస్ వద్ద శిక్షణ



పొందుతూ తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకున్నారు.

చిన్నతనం నుంచే పతకాల వేట

అనిత పతకాల ప్రస్థానం నిన్నమొన్నటిది కాదు. 1992లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి గ్రామీణ ఈత పోటీల్లోనే తానేమిటో నిరూపించారు. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 50 మీటర్ల బటర్‌ఫ్లై ఈతలో రజతం, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్యం సాధించి వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అక్కడి నుంచి మొదలైన ఆమె ప్రయాణం అప్రతిహతంగా సాగుతోంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 100 మీటర్ల విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రస్థాయి పోటీల్లో 17 బంగారు పతకాలు, 3 రజతాలు, 3 కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో కేరళ, కర్ణాటక, కోల్‌కతా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో 7 స్వర్ణాలు, ఒక రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు.

శ్రీలంకలో భారత్ పేరు నిలబెట్టాలి

నేపాల్‌లో సాధించిన విజయంతో అనితకుమారి మే 17 నుంచి 22 వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న 'అంతర్జాతీయ స్పోర్ట్స్ గేమ్స్ మీట్'కు ఎంపికయ్యారు. ఈ మెగా ఈవెంట్ కోసం కఠోర సాధన చేస్తున్నారు. కోచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో రోజుకు ఆరు గంటలపాటు ప్రాక్టీస్ చేస్తూ నీటి అలలతో పోటీపడుతున్నారు. శ్రీలంకలో కూడా భారత్ పేరు నిలబెట్టి పతకంతో తిరిగి వస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు.. "చాలామంది అమ్మాయిలు కేవలం ఫిట్‌నెస్ కోసం ఈత నేర్చుకుంటారు. కానీ పోటీతత్వంతో సాధన చేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చు. ఇతర క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యం ఈతకు ఇవ్వడం లేదు. నా తండ్రి కన్న కలలు నేను నిజం చేస్తున్నాను. భర్త, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే ఏ మహిళకైనా విజయం సాధ్యమే" అని అనిత గర్వంగా చెబుతున్నారు.

• **పొత్తూరు రాజేంద్రప్రసాద్‌వర్మ**
భీమునిపట్నం

పిల్లలు పొడవుగా...

పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే వారికి చిన్నప్పటి నుంచీ పోషకాహారం తినిపించాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు పొడవుగా పెరిగేందుకు తోడ్పడే ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం...

పాల ఉత్పత్తులు: పాలు, పెరుగు, చీజ్, జున్ను లాంటి ఆహార పదార్థాల్లో ఎ, బి, డి, ఇ విటమిన్లతోపాటు ప్రొటీన్లు, కాల్షియం లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. వీటిని రోజూ తినిపించడం వల్ల పిల్లలు బలంగా పొడవుగా పెరుగుతారు.

కోడిగుడ్లు: రోజూ గుడ్లు తినిపించడం వల్ల పిల్లలకు అవసరమైన ఎ, బి, డి విటమిన్లు; ప్రొటీన్లు, కోలిన్ లాంటి పోషకాలు లభిస్తాయి. పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు శారీరక పెరుగుదల మెరుగుపడుతుంది.

అరటి పండ్లు: వీటిలో కాల్షియం, మాంగనీస్, పొటాషియం లాంటి మినరల్స్; పీచు పదార్థాలు, పలు విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఉదయాన్నే అల్పాహారంతో పాటు ఒక అరటి పండును తినిపిస్తే జీవక్రియలు సజావుగా జరిగి ఎత్తు పెరుగుతారు.

చేపలు: వీటిలో కాల్షియం, పాస్పరస్, ఐరన్, సిలీనియం, ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల ఎదుగుదలకు తోడ్పడతాయి. కాబట్టి వారానికి ఒకసారైనా చేపలను పిల్లల ఆహారంలో చేర్చాలి.

ఆకు కూరలు: వీటిలో ఎ, సి, కె విటమిన్లు; కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్ లాంటి మినరల్స్; పీచుపదార్థాలు, ఫోలేట్లు లాంటి పోషకాలు అధికంగా ఉంటాయి. రోజూ ఒక ఆకుకూరను ఆహారంలో చేరిస్తే పిల్లలు పొడవుగా పెరుగుతారు.



సంకల్పం

చిన్నప్పుడు టీవీలో చూసిన 'ఉడాన్' సీరియల్... స్ఫూర్తి రగిలించింది. అదే ఒంటి మీద ఖాకీ వేసుకోవాలన్న కలను నిజం చేసింది. ఆర్పీఎఫ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె... అంతటితోనే ఆగిపోలేదు. తప్పిపోయిన, అక్రమ రవాణాకు బలవుతున్న వందలమంది చిన్నారులను రక్షించి... వారిని ఇంటికి చేరుస్తున్న 41 ఏళ్ల రైల్వే పోలీస్ అధికారి చందన సిన్హా కథ ఇది.

"రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో ఉద్యోగం అంటే కొన్ని పరిమితులు ఉంటాయి. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత మాత్రమే ఆర్పీఎఫ్ బాధ్యత. అయితే తప్పిపోయిన చిన్నారుల రక్షణ కోసం, వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చడం కోసం నేను

అమ్మల కన్నీళ్లు తుడుస్తున్నారు



చేస్తున్న కృషిని కూడా నా బాధ్యతగానే భావిస్తున్నాను. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ మా స్వస్థలం. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి. నా చిన్నప్పుడు దూరదర్శన్‌లో 'ఉడాన్' సీరియల్ వచ్చేది. దేశంలో రెండో మహిళా ఐపీఎస్ అధికారి, తొలి మహిళా డీజీపీ కాంచన్ చౌదరి భట్టాచార్య జీవితం నుంచి స్ఫూర్తి పొంది తీసిన సీరియల్ అది. ఆమె సోదరి కవితా చౌదరి ప్రధాన పాత్ర పోషించి, దర్శకత్వం వహించారు. ఆ పాత్ర నన్ను విపరీతంగా ఆకట్టుకుంది. ఎలాగైనా సరే పోలీస్ ఆఫీసర్ కావాలనే ఆకాంక్ష బలంగా నాటుకుపోయింది.

కల నిజమైన రోజు...

డిగ్రీ పూర్తవగానే పోలీసు ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాను. సంబంధిత పోటీ పరీక్షలన్నిటికీ దరఖాస్తు చేసుకొనేదాన్ని. మొదట్లో ఎందులోనూ ఉత్తీర్ణత సాధించలేదు. కానీ నేను పట్టు విడవలేదు. మరో ఉద్యోగానికి వెళ్లాలని అనుకోలేదు. అలా కొన్నేళ్ల ప్రయత్నం తరువాత ఆర్పీఎఫ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాను. 2010లో బాధ్యతలు చేపట్టాను. ఆ క్షణం నా మనసు ఆనందంతో ఉప్పొంగింది. కొంతకాలం రైల్వే బోర్డులో పని. మరికొన్ని రోజులు డెస్క్ వర్క్. నాకు ఏ పని అప్పగించినా అంకితభావంతో చేశాను. అదే నన్ను నేడు ఉన్నతంగా నిలబెట్టిందని భావిస్తున్నాను.

మూడేళ్లలో 1500 మంది...



కొన్నాళ్ల తరువాత నన్ను లఖనవూలోని చార్‌బాగ్ రైల్వే స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడే సేవలు అందిస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని రైల్ నెట్‌వర్క్ పరిధిలో, గడచిన మూడేళ్లలో 1,500కు పైగా బాల బాలికలను రక్షించాను. వీరిలో తప్పిపోయినవారే కాదు, అక్రమ రవాణా ముఠా చేతుల్లో చిక్కుకొని నరకం అనుభవిస్తున్న చిన్నారులు కూడా ఉన్నారు. వాళ్లందరినీ తిరిగి ఇళ్లకు చేర్చినప్పుడు ఆ కుటుంబాలు ఎంతో ఆనందానికి, భావోద్వేగానికి లోనవుతాయి. అది చూసినప్పుడు నాకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంటుంది.

పటిష్ట వ్యవస్థ...

తప్పిపోయిన పిల్లల కోసం నేను ఒక పటిష్టమైన విధానం రూపొందించాను. కొంతమంది అధికారులు, రైల్వే సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ఒక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశాను. వారు ఒంటరిగా, లేదా అనుమానాస్పద వ్యక్తులతో కనిపించిన చిన్నారులను గుర్తించి, సమాచారం చేరవేస్తారు. దాని ఆధారంగా త్వరితగతిన స్పందించి, చర్యలు తీసుకొంటాం. దీనికి సంబంధించి టీమ్ సభ్యులకు శిక్షణ ఇచ్చాం. అలా ఒక్క 2024లోనే 494మంది పిల్లలను రక్షించాం. వారిలో 41 మంది అక్రమంగా తరలిస్తున్న చిన్నారులు ఉన్నారు. ఇలా తరలించిన పిల్లలను బాల కార్మికులుగా మార్చే ముఠా అది. గత ఏడాది వెయ్యి మందిని కాపాడగలిగాను.

ప్రశంసలు... పురస్కారాలు...

నేను చేస్తున్న కృషికి గానూ గత నెలలో 'అతి విశిష్ట్ రైల్ సేవా' పురస్కార్‌ను అందుకున్నాను. రైల్వేలో అత్యున్నత పురస్కారం ఇది. నాకు దక్కిన గౌరవంగా దీన్ని భావిస్తాను. దీంతోపాటు గతంలో కూడా పలు సంస్థలు, ప్రభుత్వాల నుంచి అవార్డులు, సత్కారాలు, ప్రశంసలు అందుకున్నాను. అయితే తప్పిపోయిన లేక పిల్లల అక్రమ రవాణా మాఫియా చేతుల్లో చిక్కుకున్నవారిని రక్షించి, తిరిగి వాళ్ల ఇళ్లకు చేర్చినప్పుడు పొందే అనుభూతి అన్నిటికంటే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది. ఎందుకంటే నేనూ ఒక బిడ్డకు తల్లిని కదా."

చక్కెరతో ఇలా కూడా...

చక్కెరతో రకరకాల తీపిపదార్థాలు తయారుచేయడమే కాదు చిన్న చిట్కాలు పాటించి పలు సమస్యల నుంచి బయటపడవచ్చు.

- మిక్సీ గిన్నెలకు తరచూ ఘాటైన వాసనలు పట్టేస్తూ ఉంటాయి. అలాంటప్పుడు వాటిలో రెండు చెంచాల చక్కెర వేసి ఒక నిమిషం పాటు గ్రైండ్ చేసి ఆపైన కడిగేస్తే సరిపోతుంది.
- ఖాళీ డబ్బాలు, సీసాలు, వాటర్ బాటిళ్లను ఎక్కువ కాలం ఉపయోగించకపోతే వాసన వస్తుంది. వాటిలో చిటికెడు పంచదార వేసి మూతపెడితే చాలు.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల చక్కెర వేసి కలిపిన మిశ్రమాన్ని తుప్పు పట్టిన వస్తువులపై వేసి స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే వెంటనే అవి శుభ్రపడతాయి.
- చేతులకు గ్రీజు, జిడ్డు లాంటివి అంటుకున్నప్పుడు లిక్విడ్ హ్యాండ్‌వాష్‌తో పాటు కొద్దిగా చక్కెరను కూడా తీసుకుని బాగా రుద్ది నీళ్లతో కడిగేసుకుంటే సమస్య తీరుతుంది. అలాగే చేపలు, ఉల్లిపాయలు, ముల్లంగి లాంటి వాటిని తరగడం వల్ల చేతులకు పట్టిన వాసనలను తొలగించడంలో కూడా ఈ చిట్కా ఉపకరిస్తుంది.



- ఒక గిన్నెలో చెంచా చక్కెర, పావు చెంచా బేకింగ్ పౌడర్ వేసి కొన్ని నీళ్ల చుక్కలు చిలకరించి పేస్టులా చేయాలి. దీన్ని స్క్రబ్బర్‌తో అద్ది తోమితే వంటపాత్రలకు పట్టిన జిడ్డు, వాసనలు, మాడు మరకలు తొలగిపోతాయి.
- ఆగకుండా ఎక్కిళ్లు వస్తుంటే నోట్లో కొద్దిగా చక్కెర వేసుకుని నమిలితే వెంటనే అవి ఆగిపోతాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల చక్కెర, చెంచా కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని సహజ బాడీ స్క్రబ్‌లా ఉపయోగించుకోవచ్చు. ఇది చర్మాన్ని మృదువుగా, కాంతివంతంగా మారుస్తుంది.

ఆమెది ఒక సాదాసీదా ప్రయాణం కాదు. అది అడ్డంకులను ఛేదించిన ఒక ధ్రువతార గాథ. 1957లో లఖ్‌నవూ వీధుల్లో నిలబడి ఆకాశంలో వెళ్తున్న 'స్పుత్నిక్' ఉపగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయిన ఆ కళ్లు.. కొన్నేళ్ల తర్వాత అదే అంతరిక్ష రహస్యాలను ప్రపంచానికి విడమర్చి చెబుతాయని ఎవరూ ఊహించి ఉండరు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలో అత్యున్నత స్థాయికి ఎదిగి 'జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్' వంటి ప్రాజెక్టులకు దిశానిర్దేశం చేస్తున్న డాక్టర్ హషీమా హసన్ జీవితం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ ఒక అద్భుత ప్రస్థానం.

లఖ్‌నవూ నుంచి నాసా వరకు

ఉత్తర ప్రదేశ్‌లోని చారిత్రక నగరం లఖ్‌నవూ. గంగా-జమున తెహజీబ్‌కు నిలయమైన ఆ నగరంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు హషీమా హసన్. అప్పట్లో ఆడపిల్లలు చదువుకోవడం, అది కూడా సైన్స్ వంటి క్లిష్టమైన సబ్జెక్టులను ఎంచుకోవడం ఒక సాహసమే. కానీ, హషీమా తాతగారు ఆమెలోని జిజ్ఞాసను గుర్తించారు. ఆకాశంలోని నక్షత్రాలను చూస్తూ ఆమె వేసే ప్రశ్నలకు ఆయన ఓపికగా సమాధానం చెప్పేవారు. 1957లో రష్యా ప్రయోగించిన స్పుత్నిక్ ఉపగ్రహం రాత్రివేళ ఆకాశంలో మెరిసే చుక్కలా కదులుతుంటే తన ఇంటి డాబా పై నుంచి చూసిన హషీమా మనసులో ఒక బలమైన బీజం పడింది. "ఆ మెరిసే చుక్క అక్కడికి ఎలా వెళ్లింది? అక్కడ ఏముంది?" అన్న ప్రశ్నలే ఆమెను నాసా గడప దాకా నడిపించాయి.

ఆక్స్‌ఫర్డ్‌లో పీహెచ్‌డీ

లక్నో విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన హషీమా అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేశారు. అక్కడ ఆమె ప్రతిభకు గోల్డ్ మెడల్ వరించింది. అయితే, ఆమె లక్ష్యం ఇంకా పెద్దది. ఫిజిక్స్‌లో లోతైన పరిశోధనలు చేయాలనే తపనతో ఆమె ప్రతిష్ఠాత్మక 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్'లో చేరారు. ఆ తర్వాత ఆమెకు ఆక్స్‌ఫర్డ్‌లో విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభించింది. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఆమె చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఆ కాలంలో విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయడం ఒక మహిళగా ఆమెకు ఎన్నో సామాజిక సవాళ్లను విసిరింది. కానీ ఆమె లక్ష్యం ముందు అవేవీ నిలవలేదు.

నాసాలో 'మిషన్ క్రిటికల్' బాధ్యతలు

1994లో నాసాలో చేరడం హషీమా జీవితంలో అతి పెద్ద మలుపు. అప్పట్లో నాసా ప్రతిష్ఠాత్మక 'హబుల్ స్పేస్ టెలిస్కోప్' ఒక పెద్ద సమస్యను ఎదుర్కొంటోంది. టెలిస్కోప్ కంటిచూపు సరిగా లేకపోవడంతో అది పంపే చిత్రాలు మసకగా వస్తున్నాయి. ఆ సమయంలో 'ఆప్టికల్ టెలిస్కోప్ అసెంబ్లీ సైంటిస్ట్'గా హషీమా రంగంలోకి దిగారు. టెలిస్కోప్ లోపాలను సరిదిద్దే సాఫ్ట్‌వేర్, లెన్స్ అమరికలో ప్రతిభ చూపడంతో హబుల్ మళ్లీ స్పష్టమైన చిత్రాలను పంపడం మొదలుపెట్టింది.

విశ్వ రహస్యాల వేట

హషీమా ప్రస్తుతం నాసా ప్రధాన కార్యాలయంలో సీనియర్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా మానవ చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన 'జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్' ప్రాజెక్ట్‌లో డిప్యూటీ ప్రోగ్రాం సైంటిస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. బిలియన్ ఏళ్ల క్రితం విశ్వం ఎలా ఉండేదో తెలుసుకునే ఈ మహాయజ్ఞంలో ఆమె పాత్ర ఎంతో కీలకం. అనంతమైన విశ్వంలో నక్షత్రాల పుట్టుకను, గ్రహాల ఆవిర్భావాన్ని అధ్యయనం చేసే ఈ ప్రాజెక్ట్‌లో ఒక భారతీయ మహిళా శాస్త్రవేత్త కీలక నిర్ణయాలు తీసుకోవడ మనందరికీ గర్వకారణం.



సైన్స్‌పై మమకారం

హషీమా కేవలం ప్రయోగశాలకే పరిమితం కాలేదు. నాసాలో ఆమె అనేక విద్యా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. సైన్స్ అంటే భయం పోగొట్టి పిల్లల్లో ముఖ్యంగా అమ్మాయిల్లో పరిశోధనా తృష్ణను పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. "శాస్త్రవేత్త కావడానికి మేధస్సు కంటే ముందు పట్టుదల, ఆసక్తి ముఖ్యం" అని ఆమె ఎప్పుడూ చెబుతుంటారు. మాతృదేశం భారత్ నుంచి అమెరికా వెళ్లి స్థిరపడినా తన మూలాలను ఆమె ఎప్పుడూ గౌరవిస్తారు. భారతీయ శాస్త్రవేత్తలతో, విద్యార్థులతో సంభాషించడానికి ఆమె ఎప్పుడూ ఉత్సాహం చూపుతారు. నాసా నుంచి ఆమె పొందిన అనేక అవార్డులు, రివార్డులు, ఆమె కృషితోపాటు భారతీయ మేధస్సుకు నిదర్శనం.

ఇక విదేశీ షేర్లలో నేరుగా పెట్టుబడులు



- ఎన్ఎస్ఈ ఐఎక్స్ కార్యకలాపాలు షురూ
- ముందుగా అమెరికా షేర్లలో లావాదేవీలకు అనుమతి

న్యూఢిల్లీ: మన దేశం నుంచే అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో మదుపు చేయాలని ఉందా?.అయితే అందుకు సిద్ధం కండి. ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజి (ఎన్ఎస్ఈ ఐఎక్స్) ఇందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం 'గ్లోబల్ యాక్సెస్' పేరుతో ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ, సీఈఓ వీ బాలసుబ్రమణియం చెప్పారు. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా దేశీయ రిటైల్ మదుపరులు నేరుగా అమెరికా స్టాక్ మార్కెట్‌లో షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు చేయవచ్చు. వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో 30కిపైగా దేశాల స్టాక్ మార్కెట్ పెట్టుబడులను భారత రిటైల్ మదుపరులకు అందుబాటులోకి తెస్తామని సుబ్రమణియం తెలిపారు.

నమోదు: ముందుగా వెబ్ లేదా మొబైల్ ఇంటర్‌ఫేస్ ద్వారా ట్రేడింగ్ ఖాతా ఓపెన్ చేసుకోవాలి. ఆధార్, పాన్ కార్డు లేదా ఆయా వ్యక్తుల డిజిలాకర్ ద్వారా ఆన్‌లైన్‌లో డిజిటల్ కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఇందుకు అర నిమిషం నుంచి ముప్పావు నిమిషానికి మించి పట్టదు.

'గ్లోబల్ యాక్సెస్' ప్రత్యేకతలు

- ఒక ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడి పరిమితి 2.5 లక్షల డాలర్లు
- విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన కంపెనీల షేర్లు, ఈటీఎఫ్‌ల్లో మాత్రమే పెట్టుబడికి అవకాశం
- షేర్ల పాక్షిక కొనుగోళ్లకూ అవకాశం.
- డాలర్లలో మాత్రమే పెట్టుబడులకు అనుమతి
- ప్రస్తుతం రిటైల్ మదుపరులకు మాత్రమే అనుమతి
- ముందు ముందు సంస్థాగత మదుపరులకూ విస్తరణ



సదరన్ ట్రావెల్స్‌కు 'వెటా' అవార్డు

హైదరాబాద్: స్థానిక సదరన్ ట్రావెల్స్ ప్రతిష్ఠాత్మకమైన 'వెటా' అవార్డుకు ఎంపికైంది. పర్యాటక రంగంలో కంపెనీ అందిస్తున్న వినూత్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సదరన్ ట్రావెల్స్ వెటా అవార్డుకు ఎంపిక కావడం ఇది నాలుగో సారి. ఢిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో కంపెనీకి ఈ అవార్డు అందజేశారు. ట్రావెల్ రంగంలో తమ నిబద్ధతను ఈ అవార్డు మరింత బలపరుస్తుందని కంపెనీ ఎండీ ఆలపాటి కృష్ణ మోహన్ తెలిపారు. ఉద్యోగులు, ఎల్లపుడూ తమను వెన్నంటి ఉండే వినియోగదారులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు.

కృత్రిమ మేధకు భయపడం..

- పనిలో ఏఐని ఉపయోగించుకోవాలని మా సిబ్బంది అందరికీ సూచించాం..
- టీసీఎస్ సీఈఓ, ఎండీ కే కృతివాసన్



ముంబై: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో మా ఉద్యోగాలు పోతాయని భయపడట్లేదని దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సీఈఓ, ఎండీ కే కృతివాసన్ అన్నారు. కంపెనీ ఆదాయాన్ని తగ్గించే రిస్క్ ఉన్నప్పటికీ.. కస్టమర్లకు వేగంగా, చౌకగా సేవలందించేందుకు ఏఐ సాధనాలను ఉపయోగించుకోవాలని తమ సిబ్బందిని కోరుతున్నట్లు ఆయన చెప్పారు. ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించే విషయంలో సీనియర్ స్థాయి సిబ్బందితో పోలిస్తే యువ సిబ్బంది నైపుణ్యం కనబరుస్తున్నారని అన్నారు. నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరమ్(ఎన్‌టీఎల్ఎఫ్) వార్షిక సదస్సులో బుధవారం కృతివాసన్ మాట్లాడుతూ.. "ఏఐలో నైపుణ్యం కలిగి ఉండాలని మా 6 లక్షలకు పైగా సిబ్బందికి నొక్కి చెబుతున్నాం" అన్నారు. ఏఐ టెక్నాలజీ భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలను పంచనుందని నమ్ముతున్నామని ఆయన పేర్కొన్నారు. మార్పును నిరోధించడానికి బదులు దాని ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఏఐని నాగరిక మార్పుగా అభివర్ణించిన కృతివాసన్.. అది జ్ఞానాన్ని ప్రజాస్వామ్యం చేస్తోందని, 60 ఏళ్లుగా పరిష్కృతం కాని సమస్యలను పరిష్కరిస్తోందని చెప్పారు.

ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తున్నాం: ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి

ఇన్వెస్టర్ల అతిస్పందన కారణంగానే గడిచిన కొన్ని రోజుల్లో ఐటీ రంగ కంపెనీల షేర్ల ధరలు భారీగా క్షీణించాయని ఎఫ్ఎంసీజీ, ఐటీ సహా పలు రంగాల్లో వ్యాపారాలు సాగిస్తున్న ఐటీసీ చైర్మన్, ఎండీ సంజీవ్ పురి అన్నారు. సాంకేతికత ఎల్లప్పుడూ ఉత్తేజితమైన పాత్ర పోషించిందని, తమ వ్యాపారాల్లో ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచడం కోసం ఏఐని విస్తృతంగా వినియోగించుకుంటున్నామని ఆయన తెలిపారు.

సోలార్ షేర్లకు షాక్

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్

ముంబై: బారత సోలార్ కంపెనీల మాడ్యూల్స్, సెల్స్‌పై అమెరికా 126% సుంకాలు విధించడం బుధవారం మార్కెట్‌ను కుంగదీసింది. ఉదయం నుంచి ఉత్సాహంగా ట్రేడవుతున్న మార్కెట్‌పై ఈ వార్త పిడుగుపాటయింది. సెంటిమెంట్ దెబ్బ తిని అమ్మకాలు పోటెత్తడంతో ప్రారంభ లాభాలన్నీ తుడిచిపెట్టుపోయాయి. సెన్సెక్స్ 50.15 పాయింట్ల లాభంతో 82,276.07 వద్ద ముగియగా నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.5 వద్ద ముగిసింది. సెన్సెక్స్ డే హై నుంచి దాదాపు 674 పాయింట్లు నష్టపోయింది. సోలార్ కంపెనీల షేర్లు బుధవారం ఐదు నుంచి 14 శాతం వరకు నష్టపోయాయి.

ఎల్ఐసీ, ఎంఎఫ్‌లకు ఏఐ సెగ: ఏఐ ప్రభావంతో ఐటీ కంపెనీల షేర్లు పతనం కావడం ఎల్ఐసీ, మ్యూచువల్ ఫండ్స్‌ని కూడా భయపెడుతోంది. నిఫ్టీ ఐటీ సూచీ ఈ నెల ఇప్పటి వరకు గత 23 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా 21% నష్టపోయింది. దీంతో ఈ సూచీలోని ఐటీ కంపెనీల షేర్లలో మదుపు చేసిన ఎల్ఐసి రూ.38,000 కోట్లు, ఎంఎఫ్‌లు రూ.63,000 కోట్లు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీలోని 10 ఐటీ కంపెనీల షేర్లు ఈ నెల ఇప్పటి వరకు 17 నుంచి 27 శాతం వరకు నష్టపోయాయి.

ఆంత్రోపిక్ ముందు వెలవెల : తన సరికొత్త ఏఐ టూల్స్‌తో ఐటీ కంపెనీలను భయపెడుతున్న ఆంత్రోపిక్ కంపెనీ షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) ముందు భారత ఐటీ దిగ్గజాలు వెలవెల పోతున్నాయి. ప్రస్తుతం ఆంత్రోపిక్ మార్కెట్ క్యాప్ 38,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.34.39 లక్షల కోట్లు) వరకు ఉంది. గత 15 రోజులుగా జరుగుతున్న కరెక్షన్‌తో భారత ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్ర కంపెనీల షేర్లు 17 నుంచి 27 శాతం వరకు నష్టపోయాయి. ప్రస్తుతం ఈ ఐదు దేశీయ ఐటీ దిగ్గజాల మార్కెట్ క్యాప్ 24,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.21.99 లక్షల కోట్లు) మాత్రమే ఉంది.

ఈవీ రంగంలోకి గత ఐదేళ్లలో రూ.2.23 లక్షల కోట్ల పెట్టుబడులు

ఐఈఈఎఫ్ఏ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: గడిచిన ఐదేళ్లలో (2020-25) దేశీయ విద్యుత్ వాహన రంగంలోకి రూ.2.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి ఉంటాయని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలిసిస్ (ఐఈఈఎఫ్ఏ) తాజా నివేదిక అంచనా వేసింది. కానీ, 2030 లక్ష్యాల సాధనకు అవసరమైన రూ.12.50 లక్షల కోట్ల పెట్టుబడుల్లో ఇది కేవలం 18 శాతమేనని పేర్కొంది. కాబట్టి, ఈ ఐదేళ్లలో ఈవీ రంగంలోకి పెట్టుబడులు భారీగా పుంజుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. 2030 నాటికి మిగతా రూ.10.2 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించేందుకు వ్యవస్థాగత ఫైనాన్సింగ్ సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐఈఈఎఫ్ఏ నివేదిక సహ రచయిత శుభమ్ శ్రీవాస్తవ అన్నారు. 2030 నాటికి ఈవీల వాటా ప్యాసింజర్ కార్ల విక్రయాల్లో 30 శాతానికి, వాణిజ్య వాహన అమ్మకాల్లో 70 శాతానికి, బస్సుల విక్రయాల్లో 40 శాతానికి, ద్వి మరియు త్రిచక్ర వాహన సేల్స్‌లో 80 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




26వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	130
వరంగల్	130	గుంటూరు	132
కరీంనగర్	130	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	121
కర్నూలు	130	నెల్లూరు	126
విశాఖపట్నం	130	అనంతపురం	126
గోదావరి	130		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,890 ▲	1,48,400 ▲	2,95,000 ▲
విజయవాడ	1,64,000 ▲	1,52,000 ▲	2,74,000 ▼
విశాఖపట్నం	1,64,387 ▲	1,49,300 ▲	2,95,000 ▲
రాజమండ్రి	1,61,890 ▲	1,48,400 ▲	2,66,000 ▲
ప్రొద్దుటూరు	1,57,800 ▲	1,45,180 ▲	2,76,200 ▲
ముంబై	1,59,241 ▲	1,45,865 ▲	2,62,912 ▼

స్థలాల లీజులో జీసీసీలే టాప్

- ఐదేళ్లలో 10 కోట్ల చదరపు అడుగులకు ఒప్పందాలు
- కొలియర్స్ ఇండియా వెల్లడి

న్యూఢిల్లీ: విదేశీ సంస్థలు, ప్రధానంగా అమెరికన్ కంపెనీలు భారత్‌లోని 7 ప్రధాన నగరాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు కోసం గత ఐదేళ్లలో 10.1 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకున్నాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా వెల్లడించింది. అందులో 71 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అమెరికన్ కంపెనీలే తీసుకున్నాయి. 2020-2025 మధ్యకాలంలో హైదరాబాద్ సహా ఏడు ప్రధాన నగరాల్లో స్థూలంగా 28.02 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు కుదిరాయని.. అందులో జీసీసీల కోసం విదేశీ కంపెనీలు అద్దెకు తీసుకున్న స్థలం వాటా 36 శాతమని పేర్కొంది. రాబోయే కాలంలో విదేశీ కంపెనీలు భారత్‌లో జీసీసీల ఏర్పాటు కోసం ఏటా 3.5-4.0 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకోవచ్చని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ విభాగం ఎండీ అర్పిత్ మెహ్రోత్రా అంచనా వేశారు. గత ఏడాది దేశంలోని 7 ప్రధాన నగరాల్లో 7.15 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలం లీజుకు తీసుకోగా.. అందులో విదేశీ కంపెనీలు 2.92 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను అద్దెకు తీసుకున్నాయి. మొత్తం లీజులో 41 శాతానికి ఇది సమానం.



రాజమహేంద్రవరంలో వివో బీ 70 సిరీస్ విడుదల

రాజమహేంద్రవరం బి న్యూ మొబైల్ షోరూమ్‌లో సినీనటి శ్రీదేవి (కోర్టు సినిమా నాయిక) వివో బీ 70 సిరీస్ మొబైల్ హ్యాండ్‌సెట్లను బుధవాదం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివో కంపెనీ కేఎంఎం రిజ్వాన్, బిన్యూ మొబైల్స్ అధినేత బాలాజీ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ ఇతరులు పాల్గొన్నారు. ఈ హ్యాండ్‌సెట్ల ప్రారంభ ధర రూ.45,999. ఈ సందర్భంగా బి న్యూ కంపెనీ వివో ఫోన్ కొనే వారికి రూ.15,999 విలువ గల 7 రకాల ఉచిత కానుకలు ప్రకటించింది. కొనుగోలుదార్లకు 10% తక్షణ డిస్కౌంట్ కూడా లభిస్తుంది.



లంకను సాగనంపారు

న్యూజిలాండ్ విజయం

- బాదేసిన శాంట్నర్ ● తిప్పేసిన రచిన్

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక కథ ముగియగా.. న్యూజిలాండ్ సెమీస్‌కు మరింత చేరువైంది. మిచెల్ శాంట్నర్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47, 1/19), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (32, 4/27) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టడంతో.. సూపర్-8లో భాగంగా గ్రూప్-2లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కివీస్ 61 పరుగులతో లంకను చిత్తు చేసింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 168/7 స్కోరు చేసింది. కోల్ మకాన్‌చీ (31 నాటౌట్) విలువైన పరుగులు అందించాడు. తీక్షణ, చమీర చెరో 3 వికెట్లు తీశారు. ఛేదనలో లంక ఓవర్లన్నీ ఆడి 107/8 స్కోరుకే పరిమితమైంది. కమిందు మెండిస్ (31), వెల్లలగే (29) టాప్ స్కోరర్లు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ నిస్సాంక (0)ను గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చిన హెన్రీ (2/3).. వన్‌డౌన్ బ్యాటర్ అసలంక (5)ను కూడా అవుట్ చేసి ఆరంభంలోనే దెబ్బకొట్టాడు. తర్వాత కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకె (10), కెప్టెన్ షనక (3), హేమంత (3)ను రచిన్ వెనక్కి పంపడంతో 59/6తో లంక ఏదశలోనూ కోలుకోలేకపోయింది. సూపర్-8లో వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడడంతో లంక సెమీస్ అవకాశాలు ఆవిరయ్యాయి.



చివర్లో దంచేశారు..: లంక పేస్-స్పిన్ ద్వయం చమీర, తీక్షణ దెబ్బకు 84/6తో కష్టాల్లోపడిన కివీస్.. వంద పరుగులైనా చేస్తుందా? అని అనిపించింది. కానీ, డెత్ ఓవర్లలో కెప్టెన్ శాంట్నర్, మకాన్‌చీ ధనాధన్ ఆటతో.. కివీస్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 84 రన్స్ జోడించడంతో జట్టు స్కోరు 160 మార్క్ దాటింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌కు ఓపెనర్లు టిమ్ సైఫర్ట్ (8), ఫిన్ అలెన్ (23) తొలి వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, అలెన్‌ను తీక్షణ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపగా.. సైఫర్ట్‌ను చమీర అవుట్ చేశాడు. ఆ తర్వాత రచిన్, ఫిలిప్స్ (18) మూడో వికెట్‌కు 41 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఫిలిప్స్‌ను చమీర, రచిన్‌ను తీక్షణ అవుట్ చేయడంతో కివీస్ బ్యాటింగ్ ఒక్కసారిగా కుదుపులకు గురైంది. చాప్‌మన్ (0), మిచెల్ (3) విఫలమయ్యారు. ఈ దశలో కెప్టెన్ శాంట్నర్, మకాన్‌చీ ఎదురుదాడితో లంక బిత్తరపోయింది. ఆఖరి 4 ఓవర్లలోనే 70 పరుగులు సమర్పించుకొంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 168/7 (శాంట్నర్ 47, రచిన్ 32; తీక్షణ 3/30, చమీర 3/38).
శ్రీలంక: 20 ఓవర్లలో 107/8 (కమిందు 31, వెల్లలగే 29; రచిన్ 4/27, హెన్రీ 2/3).

పాక్‌కు ఇక కష్టమే!

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	2	2	0	0	4	1.491
న్యూజిలాండ్	2	1	0	1	3	3.050
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	2	0	2	0	0	-2.800

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

న్యూజిలాండ్ జట్టు శ్రీలంకను చిత్తుగా ఓడించడంతో పాకిస్థాన్ సెమీఫైనల్ చేరే అవకాశాలు మరింత క్లిష్టమయ్యాయి.

పాక్ సెమీస్ చేరాలంటే...

- న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్ చేతిలో ఓడిపోవాలి. ఒకవేళ కివీస్ గెలిస్తే...5 పాయింట్లతో సెమీస్‌కు చేరుతుంది. అప్పుడిక పాక్ చివరి మ్యాచ్‌లో లంకపై విజయం సాధించినా ఉపయోగం ఉండదు.
- న్యూజిలాండ్‌ను ఇంగ్లండ్ ఓడిస్తే ..తమ చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకపై భారీ తేడాతో గెలవాలి. అప్పుడు నెట్‌రన్‌రేట్ ఎక్కువ ఉన్న జట్టు సెమీస్ చేరుతుంది. రన్‌రేట్ విషయంలో కూడా పాక్ చాలా వెనుకంజలో ఉంది.

స్పోర్ట్స్



హిట్టర్లు.. బౌలర్లకు పరీక్ష

వెస్టిండీస్ x దక్షిణాఫ్రికా మ్యాచ్ నేడు

అహ్మదాబాద్: ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా గురువారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో వెస్టిండీస్-దక్షిణాఫ్రికా అమీతుమీ తేల్చుకుంటున్నాయి. భారీ హిట్టర్లతో నిండిన వెస్టిండీస్ బ్యాటింగ్‌కు..పదునైన పేసర్లతో కూడిన సఫారీల బౌలింగ్‌కు ఈ మ్యాచ్ పరీక్షగా నిలవనుంది. సూపర్-8లోని తమ ఆరంభ పోటీల్లో ఈ రెండు జట్లూ విజయాలు సాధించాయి. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్ రంజుగా జరగడం ఖాయం.

ఈ మ్యాచ్‌పై రెండు జట్లకు ఉత్కంఠ

అయితే రాత్రి జరిగే తమ మ్యాచ్‌కు ముందు భారత్-జింబాబ్వే జట్లు మరో పోరుకోసం ఉత్కంఠగా ఎదురు చూడాల్సి వస్తోంది. అదే..దక్షిణాఫ్రికా-వెస్టిండీస్ జట్ల నడుమ జరిగే గ్రూప్-1 పోరు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలవాలని భారత్ బలంగా కోరుకుంటోంది. ఈ మ్యాచ్ ఫలితం టీమిండియా-జింబాబ్వే సెమీఫైనల్ అవకాశాలను ప్రభావితం చేయనుండడమే ఉత్కంఠకు కారణం.

షూటౌట్‌లో భారత్ గెలుపు

హోబర్ట్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో భారత్ ఖాతా తెరిచింది. బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ షూటౌట్‌లో 3-1తో గెలిచింది. ఆసీస్ తరఫున 49వ నిమిషంలో జెరెమి హేవర్డ్, భారత్ నుంచి 51వ నిమిషంలో శిలానంద్ లక్రా గోల్స్ చేశారు. ఆ తర్వాత మరో గోల్ నమోదవలేదు. దీంతో నిర్దిష్ట సమయం ముగిసేసరికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలవడంతో షూటౌట్ అనివార్యమైంది. ఇందులో భారత్ 3 గోల్స్ చేసి నెగ్గింది.

బధిరుల టీ20 ఆసియా కప్ విజేత భారత్

కటక్: ఆరంభ బధిరుల టీ20 ఆసియా కప్‌లో ఆతిథ్య భారత్ విజేతగా నిలిచింది. బుధవారం ఇక్కడ జరిగిన ఫైనల్లో భారత జట్టు 6 వికెట్లతో శ్రీలంకపై గెలిచింది.



గెలుపు ఎలా ఉండాలంటే..

నేడు జింబాబ్వేతో టీమిండియా కీలక పోరు



చెన్నై: ఒక్క ఓటమి..ఒకే ఒక్క ఓటమి.. ఎంత పని చేసింది. సూపర్-8 తొలి పోరులో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం టీ20 వరల్డ్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అవకాశాలపై పెను ప్రభావం చూపింది. సఫారీల చేతిలో 76 పరుగుల ఓటమితో మన రన్‌రేట్ (-3.800) ఘోరంగా పడిపోయింది. దీంతో సూపర్-8లో మిగిలిన రెండో పోటీలు భారత్‌కు చావో..రేవో అయ్యాయి. ఈ నేపథ్యంలో జింబాబ్వేతో గురువారం జరిగే మ్యాచ్‌లో టీమిండియా తీవ్ర ఒత్తిడిలో బరిలో దిగుతోంది. మరోవైపు బలమైన ఆస్ట్రేలియాకు, శ్రీలంకకు షాకిచ్చి సంచలన ప్రదర్శన కనబరుస్తున్న జింబాబ్వే కూడా వెస్టిండీస్ చేతిలో ఓడిపోయింది. దాంతో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి జింబాబ్వేది.

గొప్పగా ఆడాల్సిందే..: భారత్‌కు సంబంధించి ఓపెనింగ్, నెం.3 స్థానం పెద్ద తొలనొప్పిగా మారాయి. హార్డ్ హిట్టర్ అభిషేక్ శర్మ మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడం టీమిండియాపై అలాంటి ఇలాంటి ప్రభావం చూపలేదు. అభిషేక్ వైఫల్యాల ప్రభావం తిలక్ వర్మపై పడుతోంది. సూర్యకుమార్ కూడా అదే పరిస్థితి. కాగా తండ్రిని చూసేందుకు స్వస్థలం వెళ్లిన రింకూ సింగ్ తిరిగి జట్టుతో చేరాడు.

శాంసన్‌కు చోటు..?: కిషన్, అభిషేక్, తిలక్ ముగ్గురూ ఎడమ చేతి వాటం బ్యాటర్లు కావడంతో..పవర్ ప్లేలోపే ఆఫ్ స్పిన్నర్లను దించడం ద్వారా ప్రత్యర్థి జట్లు మనోళ్ల పరుగులు చేయకుండా అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కుడి చేతి బ్యాటర్ సంజూ శాంసన్‌కు చాన్స్ లభించవచ్చు. ఇక భారత బౌలింగ్ విభాగం అదరగొడుతోంది. ఈ విభాగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు సుందర్ స్థానంలో వైస్-కెప్టెన్ అక్షర్ పటేల్‌ను ఆడించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు జింబాబ్వే.. పోరాడితే పోయేదేమీలేదన్న తరహాలో భారత్‌ను ఎదుర్కోవాలని అనుకుంటోంది.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, హార్దిక్, రింకూ సింగ్/తిలక్ వర్మ, అక్షర్, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా

జింబాబ్వే: సికిందర్ రజా(కెప్టెన్), మరుమణి, బెన్నెట్, డియాన్ మైర్స్, ర్యాన్ బర్ల్, మున్యోంగా, ముసికివా, బ్రాడ్ ఇవాన్స్, క్రీమర్, ముజరబానీ, ఎన్ గరావా.

పిచ్/వాతావరణం

ఎంఏ చిదంబరం స్టేడియం పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామం. ఈ వరల్డ్ కప్‌లో స్ట్రయిక్ రేట్, సగటు స్కోర్ల కోణంలో పరిశీలిస్తే ఈ వికెట్‌కన్నా ఉత్తమమైనది మరొకటి లేదు. నల్ల మట్టితో తయారు చేసిన పిచ్‌పై మ్యాచ్ నిర్వహిస్తున్నారు. ఈ వికెట్‌పై అఫ్ఘానిస్థాన్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో ఛేదించింది. వాతావరణం పొడిగా ఉండనుంది.

జమ్మూ 527/6

కర్ణాటకతో రంజీ ఫైనల్



హుబ్బళ్లి (కర్ణాటక): బ్యాటర్లు అదరగొట్టడంతో.. కర్ణాటకతో రంజీ ఫైనల్లో జమ్మూ కశ్మీర్ మెరుగైన స్థితిలో నిలిచింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 284/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన జమ్మూ 6 వికెట్లకు 527 పరుగుల భారీ స్కోరు చేసింది. బుధవారం ఆట చివరికి సాహిల్ లోత్రా (57), ముస్తాక్ (20) క్రీజులో ఉన్నారు. శుభమ్ (121) త్వరగానే పెవిలియన్ చేరినా.. తొలి రోజు రిటైర్డ్ హర్ట్ అయిన కెప్టెన్ పరాస్ డోగ్రా (70), వాద్వాన్ (70), అబ్దుల్ సమద్ (61) అర్ధ శతకాలు చేశారు. ప్రసిద్ధ్ కృష్ణ 3 వికెట్లు పడగొట్టాడు.



గొడవకు దిగిన డోగ్రా..

మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనకు గాను జమ్మూ కెప్టెన్ పరాస్ డోగ్రా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది. అసలేం జరిగిందంటే.. పేసర్ కృష్ణ సంధించిన వరుస షార్ట్ బాల్స్ ఆడే క్రమంలో డోగ్రా ఇబ్బందిపడ్డాడు. ఈ సమయంలో సిల్లీ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కర్ణాటక సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ అనీష్ ఏదో కామెంట్ చేశాడు. దీంతో సహనం కోల్పోయిన డోగ్రా నేరుగా అనీష్ వద్దకు వచ్చి అతడి తలను తన తలతో ఢీ కొట్టాడు. అయితే, ఆ సమయంలో ఇద్దరూ హెల్మెట్లు ధరించి ఉన్నారు. వాగ్వాదం పెరగడంతో ఫీల్డ్ అంపైర్లు కలగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఉద్దేశపూర్వకంగా దాడికి దిగడంతో డోగ్రాపై క్రమశిక్షణ చర్యల కింద మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు.

ఆ డబ్బు వెనక్కివ్వండి



ధవన్ మాజీ భార్యకు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: మాజీ భార్య, ఆయేషా ముఖర్జీతో న్యాయపోరాటంలో టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ నెగ్గాడు. భరణం కింద ఆయేషా తీసుకున్న రూ. 5.72 కోట్లను తిరిగి ధవన్‌కు చెల్లించాలని ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఆస్ట్రేలియా పౌరసత్వం ఉన్న ఆయేషా.. ఆ దేశ నిబంధనల ప్రకారం విడాకుల అనంతరం భార్యాభర్తల మధ్య ఆస్తుల పంపిణీ జరగాలంటూ అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో ఆయేషాకు రూ. 5.72 కోట్లను ధవన్ చెల్లించాడు. అయితే, ఆసీస్ చట్టాలు భారత్‌లో చెల్లవని ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు తాజా తీర్పులో పేర్కొంది. 2012లో భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్న ఆయేషా, ధవన్.. 2024లో విడాకులు తీసుకున్నారు. ధవన్.. ఈనెల 22న తన స్నేహితురాలు సోఫీ షైన్‌ను మనువాడిన సంగతి తెలిసిందే.

ఖనిజ రంగంలో ఏపీకి కొత్త దశ

» టైటానియం, రేర్ ఎర్త్ మినరల్స్‌తో అగ్రగామిగా రాష్ట్రం: కొల్లు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టైటానియం, రేర్ ఎర్త్ ఖనిజ రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలని కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీరంలో అపార బీచ్ శాండ్ ఖనిజాలు ఉన్నాయని, ఈ సహజ వనరులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని భారీ పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుదామని పిలుపునిచ్చారు. బీచ్ శాండ్ మినరల్స్‌పై గనులు, భూగర్భ వనరుల శాఖ విజయవాడలో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "టైటానియం, రేర్ ఎర్త్ మూలకాలు.. రక్షణ, అంతరిక్ష, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలకు అత్యంత కీలకం. భవిష్యత్ సాంకేతిక రంగాలన్నీ ఈ తరహా ఖనిజాలపై ఆధారపడి ఉంటాయి. ఈ ఖనిజ ఆధార పరిశ్రమలను అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. దీనికోసం పెట్టుబడిదారులకు స్పష్టమైన పాలసీ తెచ్చేందుకు సిద్ధంగా ఉంది. రాష్ట్రాన్ని టైటానియం, రేర్ ఎర్త్ పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్ది, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని చెప్పారు. డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టైటానియం, రేర్ ఎర్త్ అయస్కాంతాలకు డిమాండ్ భారీగా పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా లభించే బీచ్ శాండ్ ఖనిజాలకు సాంకేతిక పరిజ్ఞానంతో విలువ పెంచితే అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడే స్థాయికి చేరుకుంటామని తెలిపారు. గనుల ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ కార్యదర్శి యువరాజ్, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మైన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్, పలువురు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.


'సమర శంఖం' కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ఎస్టీయూ నేతలు రఘునాథరెడ్డి, సాయి శ్రీనివాస్, ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు

హామీలు అమలు చేయకుంటే.. 'చలో అసెంబ్లీ'

» ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడాలి: ఎస్టీయూ

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలతోపాటు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి స్పష్టమైన ప్రకటన చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. లేదంటే చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో 'సమర శంఖం' కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమించినప్పుడే ప్రభుత్వాలు స్పందిస్తాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసి 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, పెండింగ్ బకాయిలు, సీపీఎస్ రద్దు, హెల్త్‌కార్డులు తదితర డిమాండ్లను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ నేతలు కత్తి నరసింహారెడ్డి, సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు తదితరులు ప్రసంగించారు. వివిధ సంఘాల నేతలు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చుక్క రక్తం కారకుండా

మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటులో.. తెలంగాణ పోలీసుల అరుదైన వ్యూహం

» గుట్టుగా పావులు కదిపిన నిఘా బృందాలు

» మృదు వైఖరితోనే లక్ష్యాన్ని సాధించిన పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎక్కడో శ్రీకాకుళంలో మొదలైన నక్సల్బరీ పోరాటం అనేక మలుపులు తిరిగి.. నక్సలైట్ల నుంచి మావోయిస్టులుగా మారి.. జనతన సర్కార్ అంటూ సొంత సామ్రాజ్యాన్ని స్థాపించి.. రెడ్ కారిడార్‌తో హడలెత్తించిన మావోయిస్టు ఉద్యమానికి తెలంగాణ పోలీసులు ముగింపు పలికారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుత రథసారథి, కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో పాటు మావోయిస్టు కురువృద్ధుడు రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, ఆంధ్రాకు చెందిన నూనె నర్సింహారెడ్డిలను లొంగుబాటలోకి తీసుకురావడం వెనుక అరుదైన వ్యూహాన్ని అనుసరించారు. ఒకరి లొంగుబాటు సమాచారం మరొకరికి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. గత ఏడాది మే 21న మావోయిస్టు పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన తర్వాత పార్టీ పగ్గాలను అనధికారికంగా దేవ్‌జీ స్వీకరించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పటికే మావోయిస్టుల సురక్షిత లొంగుబాటుకు అవకాశం ఇవ్వాలని ప్రజాసంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెస్తున్న క్రమంలో నంబాల మరణం తర్వాత పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను రాసిన లేఖ సంచలనం సృష్టించింది. అయితే నంబాల మరణం తర్వాత పార్టీ కమ్యూనికేషన్ వ్యవస్థ విచ్ఛిన్నమైందని తెలుస్తోంది.

ఆశన్నను కలిసేందుకు దేవ్‌జీ విఫలయత్నం..

సోను లేఖ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశన్న అలియాస్ రూపేష్‌ను కలవడానికి దేవ్‌జీ ప్రయత్నించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. కర్రెగుట్టల నుంచి సోను ఉన్న ప్రాంతానికి వెళ్లేలోపు మూడుచోట్ల జరిగిన ఎన్‌కౌంటర్ల నుంచి దేవ్‌జీ త్రుటిలో తప్పించుకున్నట్లు ట్రాక్ చేశాయి. దీంతో ఆశన్నను కలవలేక దేవ్‌జీ బృందం అతికష్టంతో కర్రెగుట్టలకు చేరుకున్నట్లు తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే సోను గత ఏడాది అక్టోబరులో 50 మందికి పైగా మావోయిస్టులతో ఆయుధాలతో సహా వెళ్లి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎదుట లొంగిపోయారు. ఇది జరిగిన పది రోజులకే ఆశన్న సైతం 200మందికి పైగా మావోయిస్టులు, 150కి పైగా ఆయుధాలతో ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. మిగిలిన వారిలో కీలకమైన ఆజాద్ తదితరులతో టచ్‌లోకి వెళ్లిన నిఘా బృందాలు.. వారి లొంగుబాటుకు ఆయుధాలతో సహా రప్పించగలిగారు. ఆపరేషన్ కగార్ ముగింపునకు, మావోయిస్టు రహిత దేశం లక్ష్యానికి మార్చి 31 డెడ్‌లైన్‌గా కేంద్రం ప్రకటించి కఠినమైన చర్యలు తీసుకుంటున్న క్రమంలో 'పోరు వద్దు.. ఊరు ముద్దు' అంటూ అడవుల్లో ఉన్న అన్నల కుటుంబ సభ్యుల చేత మాట్లాడించారు. ఈ క్రమంలో తొలుత రాజిరెడ్డితో టచ్‌లోకి వెళ్లిన పోలీసు బృందాలు ఆయనకు విశ్వాసం కల్పించి, తర్వాత దేవ్‌జీని కాంటాక్ట్‌లోకి తీసుకున్నారని సమాచారం. కొద్ది నెలలుగా ఎస్ఐబీ బృందాలు పలు ప్రయత్నాలు చేసి దేవ్‌జీకి తెలంగాణ పోలీసులపై నమ్మకం కలిగేలా చూడగలిగారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఫైర్ బ్రాండ్‌గా ఉన్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ విషయంలోనే పోలీసులు కాస్త ఎక్కువగా కష్టపడినట్లు తెలుస్తోంది. ఆయన నమ్మకాన్ని పొందడంలో సక్సెస్ అయిన తర్వాత దామోదర్‌తో కలిసి తెలంగాణ కమిటీలో పనిచేస్తున్న ఆంధ్రాకు చెందిన నూనె నర్సింహారెడ్డికి నచ్చజెప్పిన తెలంగాణ పోలీసులు ఆయన్ను తమ బాటలోకి తెచ్చుకున్నారని సమాచారం.

బుల్లెట్‌కు బుల్లెట్‌తో కాదని..

'బుల్లెట్‌కు బుల్లెట్‌తో కాదు.. వారికి బతుకు ఇవ్వడానికి ప్రయత్నించండి' అని టీ-సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని సీరియస్‌గా తీసుకుని లొంగిపోయిన మావోయిస్టులకు గౌరవప్రదమైన జీవితాన్ని ఇస్తున్న విషయాన్ని మీడియా ద్వారా గట్టిగా ప్రచారం జరిగేలా పోలీసు ఉన్నతాధికారులు కృషి చేశారు. సుదీర్ఘకాలం ఎస్ఐబీలో పనిచేసిన ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి లొంగుబాట వ్యూహాన్ని రచించగా, ఎస్ఐబీ ఐజీ సుమతి నమ్మకస్తులైన సిబ్బంది ద్వారా పావులు కదిపి కథ తుది అంకానికి చేరేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మావోయిస్టుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం మృదు వైఖరితో ఉందనే విషయంపై కేంద్రంనుంచి ఒత్తిడి వచ్చినా, కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చినా.. తాము అనుసరిస్తున్న వైఖరితోనే ఎండ్‌కార్డ్ సాధ్యమవుతుందన్న విషయాన్ని కేంద్ర హోంశాఖకు అర్థమయ్యేలా చేతల్లో తెలంగాణ పోలీసులు చూపించారు.

మావోయిస్టుల రాజకీయ పార్టీ?

ప్రజాస్వామ్యయుతంగా పోరుకు సిద్ధమవుతున్న మాజీలు!

» రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించిన దేవ్‌జీ

» జగిత్యాల లేదా కోరుట్ల నుంచి ఎన్నికల బరిలో?

» దామోదర్ కూడా అదే బాటలో..?

» రాజకీయ ప్రవేశం.. పార్టీ.. అజెండాలపై చర్చ

వరంగల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జనజీవన స్రవంతిలో కలిసిపోతున్న మావోయిస్టుల తదుపరి కార్యాచరణ ఏంటి? అరణ్యాల నుంచి జనారణ్యంలోకి అడుగుపెట్టిన నక్సల్స్ నేతలు ఏం చేయబోతున్నారు? తుపాకులు, హింసను వీడి.. ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకోనున్నారా? రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ.. తాను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శి హోదాలో లొంగిపోయిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా రాజకీయాల వైపే అడుగులు వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే దామోదర్ సోదరుడి కుమార్తె బడే నాగజ్యోతి క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. దేవ్‌జీ బాటలో నడిచేందుకు పలువురు లొంగిపోయిన మావోయిస్టులు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా కొత్త పార్టీ పెడతారా? లేదా ఏ పార్టీలో చేరతారు? అజెండా ఏమిటి? అనేది ఆసక్తికరంగా మారింది.

మాజీల కొత్త బాట

మావోయిస్టు విముక్త భారత్ పేరుతో కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం, అబూజ్‌మడ్‌లోకి కేంద్ర బలగాలు చొచ్చుకుపోయాయి. అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతుండగా, ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. తెలుగు నేతలే ఇన్నాళ్లూ మావోయిస్టు ఉద్యమానికి నాయకత్వం వహిస్తూవచ్చారు. మావోయిస్టు జాతీయ కార్యదర్శి నంబాల ఎన్‌కౌంటర్‌తో పాటు కేంద్ర కమిటీ సభ్యులు మోడెం బాలకృష్ణ, గాజర్ల గణేశ్, గుమ్మడివెల్లి రేణుక, అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్ తదితర కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో హతమవడం ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ క్రమంలోనే మావోయిస్టులు తమ పంథాను మార్చుకున్నట్లు తెలుస్తోంది. బుల్లెట్ కంటే బ్యాలెట్‌తో సమస్యలపై పోరాడాలన్న ఆలోచనతోనే చాలామంది లొంగిపోయినట్లు సమాచారం. తొలుత మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోను పెద్దఎత్తున సహచర మావోయిస్టులతో కలిసి లొంగిపోయారు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా కీలక నేతలు లొంగిపోయారు. వారిలో చాలామంది ప్రజాజీవితంపై ఆసక్తిగా ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు దేవ్‌జీ, బడే చొక్కారావు, రాజిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు కూడా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. దేవ్‌జీ తన లొంగుబాటుతో పాటు భవిష్యత్తు బాటను ప్రకటించారు. తాను రాజకీయాల్లోకి వస్తానని, చట్టబద్ధంగా పోరాటం చేస్తానని చెప్పారు. దీంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దేవ్‌జీ జనరల్ స్థానాలపై దృష్టి పెట్టి బ్యాలెట్‌తో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటానికి సిద్ధమవుతున్నారనే చర్చ జరుగుతోంది. జగిత్యాల లేదా కోరుట్ల నుంచి ఎన్నికల బరిలో నిలిచే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇక బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలుస్తోంది. దామోదర్ సోదరుడు బడే నాగేశ్వర్‌రావు కుమార్తె నాగజ్యోతి ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ప్రస్తుత మంత్రి సీతక్క చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ క్రమంలో దామోదర్ సైతం రాజకీయాల్లోకి వస్తారనే చర్చ జరుగుతోంది. ఆదివాసీల్లో గట్టి పట్టున్న దామోదర్ రాజకీయ ప్రవేశం ఆసక్తికరంగా మారనుంది. వీరితో పాటు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాజీ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాల్‌రావు తాను రాజకీయాల్లోకి రానని చెప్పలేదని వ్యాఖ్యానించారు. తక్కళ్లపల్లి వాసుదేవరావుతో పాటు మరికొంత మంది మాజీలు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలపై పోరాడాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏ జెండా.. ఏ పార్టీ..?

మాజీ మావోయిస్టు నేతలు దశాబ్దాల తరబడి ఎర్రజెండా నీడన అడవుల్లో పోరాటం చేశారు. లొంగిపోయిన తర్వాత కాలానుగుణంగా కొత్త పార్టీని ఏర్పాటు చేస్తారా? అనే చర్చ జరుగుతోంది. కొత్త పార్టీని ఏర్పాటు చేస్తే దానికి నాయకత్వం వహించేది ఎవరు? నిధులతో పాటు ప్రజల్లోకి వెళ్లేందుకు కావాల్సిన అజెండా ఏంటనే చర్చలు జరుగుతున్నాయి. ఇప్పుడున్న పార్టీలను కాదని ప్రజలు తమని ఆదరించాలంటే ఏం చేయాలనేదానిపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు మాత్రం ఎర్ర జెండా పార్టీలో చేరి, ఎన్నికల్లో పోటీ చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీని నడపడం అంత సులభం కాదని, ప్రస్తుతం ఉన్న పార్టీల్లో ప్రజలకు సేవ చేయగలిగే పార్టీలో చేరడం ఉత్తమం అని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా లొంగిపోయిన వారిలో ఎక్కువ మంది రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనతో ఉన్నారని సమాచారం. కొత్త పార్టీనా..? లేదంటే ఏ పార్టీలో చేరతారనే సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

టాలీవుడ్‌కు మోషన్ క్యాప్చర్



భారతీయ సినిమా పరిశ్రమలో సరికొత్త సాంకేతిక అధ్యాయం మొదలైంది. ఇకపై హై ఎండ్ విజువల్ ఎఫెక్ట్స్, మోషన్ క్యాప్చర్ కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... ఈ అంతర్జాతీయ సదుపాయం హైదరాబాద్‌లోనే అందుబాటులోకి వచ్చింది. అక్కినేని నాగార్జున (అన్నపూర్ణ స్టూడియోస్), నిర్మాత శోభూ యార్లగడ్డ (మిహిరా విజువల్ ల్యాబ్స్), హాలీవుడ్ సంస్థ అనిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా నెలకొల్పిన 'ఏ అండ్ ఎం మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీ'ని దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి బుధవారం ప్రారంభించారు. మహేశ్‌బాబుతో తీస్తున్న 'వారణాసి' చిత్రంలోని కీలక సన్నివేశాలను ఈ టెక్నాలజీతోనే చిత్రీకరించినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సదుపాయం 'బాహుబలి, ఈగ' చిత్రాల సమయంలో మనకు అందుబాటులో ఉండుంటే ఆ చిత్రాలను మరింత అద్భుతంగా తీర్చిదిద్ది ఉండేవాళ్లమని అభిప్రాయపడ్డారు. నాగార్జున మాట్లాడుతూ 'ప్రపంచ స్థాయి కథలను చెప్పాలనే భారతీయ దర్శకుల కలలకు ఈ ల్యాబ్ జీవం పోస్తుంది' అని అన్నారు.

తెలుగింటి ముంగిట కొడవ సింగారం

నేడే విరోష్ వివాహం



టాలీవుడ్ స్టార్స్... అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'విరోష్' (విజయ్-రష్మిక)ల వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మెహందీ, హల్దీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న ఐటీసీ మిమెంటోస్ రిసార్ట్స్‌లో వివాహ క్రతువుకు ఘనంగా ఏర్పాట్లు జరిగాయి.

రెండు సంప్రదాయాల్లో పెళ్లి

నేటి ఉదయం శుభ ముహూర్తంలో విజయ్ కుటుంబ ఆచారాల ప్రకారం తెలుగు సంప్రదాయంలో మొదట వివాహం జరగనుంది. ఆ తర్వాత సాయంత్రం రష్మిక సొంత ప్రాంతమైన కూర్గ్ (కొడవ) ఆచారాలను అనుసరించి మరోసారి ఈ జంట ఒక్కటవనున్నారు. ఈ రెండు వేడుకల కోసం ప్రత్యేకంగా పండితులు ఉదయ్‌పూర్ చేరుకున్నారు.

అత్తగారి కానుక... అరిటాకుల్లో భోజనాలు

సంగీత్ వేడుకల్లో విజయ్ తల్లి మాధవి దేవరకొండ... తమ కుటుంబానికి చెందిన పురాతన, సంప్రదాయ బంగారు గాజులను రష్మికకు బహుమతిగా ఇచ్చి, కోడలిని సాదరంగా ఆహ్వానించారు. పెళ్లి ఉదయ్‌పూర్‌లో జరుగుతున్నప్పటికీ.. దక్షిణాది పద్ధతులను మరువకుండా అతిథులకు అరటి ఆకుల్లో సంప్రదాయ పిండివంటలతో విందు ఇచ్చారు.

విరోష్ క్రికెట్ లీగ్... ఫొటో గ్యాలరీగా సంగీత్

సాధారణ సంగీత్, మెహందీ వేడుకలకు భిన్నంగా విజయ్, రష్మికలు 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో అతిథులు సరదాగా క్రికెట్, వాలీబాల్ మ్యాచ్‌లు ఆడారు. అలాగే సంగీత్ వేడుక జరిగే ప్రాంగణాన్ని తమ ఎనిమిదేళ్ల లవ్ స్టోరీకి (కార్ సెల్ఫీల నుంచి హాలిడే ట్రిప్స్ వరకు) సంబంధించిన ఫొటోలతో ఒక అందమైన గ్యాలరీలా ముస్తాబు చేసి అతిథులను ఆకట్టుకున్నారు. రష్మిక స్నేహితురాళ్లు తమ చేతులపై విరోష్ అనే పేరుతో ప్రత్యేకంగా మెహందీ డిజైన్లు వేయించుకోవడం ఆకర్షణగా నిలిచింది.

నో ఫోన్ పాలసీ

ఈ పెళ్లికి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పెళ్లి ఫొటోలు బయటకు రాకుండా, 'నో-ఫోన్' పాలసీని కచ్చితంగా అమలు చేస్తున్నారు. దర్శకులు సందీప్ రెడ్డి వంగా, తరుణ్ భాస్కర్, నటుడు రాహుల్ రవీంద్రన్, హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్ తదితరులు అక్కడకు చేరుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ముందస్తుగా పంపిన శుభాకాంక్షల లేఖ ఈ వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

మాస్ లుక్‌లో శర్వా



ప్రయోగాత్మక.. కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న శర్వానంద్ పూర్తి స్థాయి మాస్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'భోగి'. బ్లడ్ ఫెస్ట్ అనేది ట్యాగ్‌లైన్. సంపత్ నంది దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో మునుపెన్నడూ చూడనంత మాసీ లుక్‌లో శర్వా కనిపిస్తుండడంతో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. ఆయన ఆయుధం పట్టుకున్న తీరును చూస్తుంటే ఈ చిత్రంలో యాక్షన్ పార్ట్ భారీ స్థాయిలో ఉండబోతోందని తెలుస్తోంది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు.

కొత్తగా...

విష్ణు విన్యాసం అలరిస్తుంది



శ్రీవిష్ణు

"విష్ణు విన్యాసం' చిత్రం అందరికీ నచ్చుతుంది. థియేటర్లకు కుటుంబంతో కలసి రండి, హాయిగా నవ్వుకుంటారు. ప్రేక్షకులకు చాలా కాలం గుర్తుండిపోయే సినిమా ఇది' అని శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు తెరకెక్కించిన చిత్రం 'విష్ణు విన్యాసం'. సుమంత్ జి నాయుడు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో యదునాథ్ మారుతీరావు మాట్లాడుతూ 'విష్ణు అద్భుతమైన నటన ద్వారా ఈ సినిమా చాలా బాగా వచ్చింది' అని చెప్పారు. 'అన్ని వర్గాల ప్రేక్షకులనూ 'విష్ణు విన్యాసం' ఆకట్టుకుంటుంది' అని సుమంత్ జి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత కేకే రాధామోహన్, దర్శకుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.

ధురంధర్ 2 X టాక్సిక్

బాక్సాఫీస్ వార్

పోటీ చిత్రాలను తెలుగు చిత్ర పరిశ్రమ చాలానే చూసింది. ఓ సినిమా విడుదల రోజున దానికి పోటీగా మరో చిత్రాన్ని విడుదల చేయడం, ఆ రెండు చిత్రాలూ కొట్టుకుని చివరకు ఏదో ఒకటి హిట్ అవడం చూస్తున్నదే. ఈ పోటీ ఇద్దరు అగ్రహీరోల మధ్య ఉంటే మరింత రసవత్తరంగా ఉంటుంది. అటువంటి పోటీ మార్చి 19న జరగబోతోంది. మూడు పండగలు ఉగాది, రంజాన్, గుడి పద్వా.. వరుసగా ఉండడంతో మార్చి 19 తేదీకి ఎంతో ప్రాముఖ్యం వచ్చింది. అందుకే రెండు భారీ బడ్జెట్ చిత్రాలు ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర ఢీ అంటే ఢీ అంటూ బరిలోకి దిగుతున్నాయి. ఆ చిత్రాలు 'ధురంధర్ 2', 'టాక్సిక్'. ఒకటి హిందీ, మరొకటి కన్నడం. అయితే రెండూ పాన్ ఇండియా సినిమాలు కావడంతో దేశవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆసక్తికరమైన విషయం



ఏమిటంటే ఈ రెండు చిత్రాల కోసం తెలుగు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా చూస్తుండడం. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై బాక్సాఫీసు దుమ్ము దులిపేసిన 'ధురంధర్' చిత్రానికి సీక్వెల్‌గా 'ధురంధర్ 2' వస్తోంది. ఇక 'కేజీఎఫ్', 'కేజీఎఫ్ 2' చిత్రాల తర్వాత వస్తున్న యష్ చిత్రం 'టాక్సిక్'. కన్నడ, ఆంగ్ల భాషల్లో రూపుదిద్దుకున్న ఈ సినిమా మీద మొదట్లో ఎవరికీ అంచనాలు లేవు. కానీ కారులో శృంగారం గ్లింప్స్ తో ఒక్కసారిగా అందరి దృష్టీ ఈ సినిమా మీద పడింది. ఓ లేడీ డైరెక్టర్ అంత బోల్డ్‌గా సీన్స్ తీయగలదా అనే చర్చ కూడా మొదలైంది. ఇక సినిమా టీజర్‌ను ఇటీవల విడుదల చేసి యష్ పోషిస్తున్న రెండో పాత్రను పరిచయం చేశారు. మోతాదు మించిన స్థాయిలో ఈ టీజర్‌లో హింస, రక్తపాతం కనిపించింది. రూ 120 కోట్లకు 'టాక్సిక్' చిత్రాన్ని దిల్ రాజు కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయడానికి ముందుకు రావడం కూడా చర్చకు దారి తీసింది.



పాన్ ఇండియా స్టార్‌గా యష్ ఎదగడంతో 'టాక్సిక్' చిత్రంతో ఆయన తన సొంత గడ్డ అయిన కన్నడ మార్కెట్ మీద కంటే తెలుగు, తమిళ, హిందీ మార్కెట్ మీద కన్నేశారు. ఎవరూ ఊహించనిరీతిలో ఈ సినిమాను రూ. 120 కోట్లకు దిల్ రాజు కొని రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయడానికి ముందుకు రావడం నిజంగా ఒక విశేషమే. ఒక డబ్బింగ్ చిత్రానికి ఇంత రేటా అని ట్రేడ్ పండితులు సైతం ఆశ్చర్యపోతున్నారు.

ఇక 'ధురంధర్' చిత్రం విషయానికి వస్తే అనూహ్య రీతిలో ఇది విజయం సాధించి హిందీ బెల్ట్ లోనే కాకుండా ఆలిండియా మార్కెట్‌కి కూడా పూనకాలు తెప్పించింది. రణ్‌వీర్ సింగ్ తన నటనా విశ్వరూపం చూపించిన ఈ సినిమా రెండో భాగం 'అంతకుమించి' అనే రీతిలో ఉంటుందని అంటున్నారు. ఈ సారి ఈ చిత్రాన్ని తెలుగులోనూ విడుదల చేయడం ఒక విశేషం.

పుష్ప 2' టార్గెట్

'ధురంధర్ 2' చిత్రానికి ఆదిత్య ధర్ దర్శకుడు. 'టాక్సిక్'కు గీతూ మోహన్‌దాస్ దర్శకురాలు. ఎవరి శక్తులు వారు వడ్డి ఇద్దరూ యుద్ధానికి సిద్ధమవుతున్నారు. నిజం చెప్పాలంటే తన చిత్రానికి ఎవరూ పోటీ రాకూడదనే యష్ చాలా ముందుగానే రిలీజ్ డేట్ ప్రకటించారు. అయితే 'ధురంధర్' సూపర్ సక్సెస్‌తో సీక్వెల్ సిద్ధం చేసి మార్చి 19నే తను రంగంలోకి దిగుతున్నారు రణ్‌వీర్. అటు యష్, ఇటు రణ్‌వీర్ ఎవరి ధీమా వారిది.. విజయం సాధిస్తామనే నమ్మకం ఇద్దరిలో ఉంది. ఇద్దరూ ఓపెనింగ్ కలెక్షన్ల మీద కన్నేశారు. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రం ఓపెనింగ్ డే కలెక్షన్ల పరంగా నెలకొల్పిన రికార్డ్‌ను క్రాస్ చేయాలనే తపన ఇద్దరిదీ. రెండూ భారీ చిత్రాలు. యాక్షన్ ఓరియంటెడ్ ఫిల్మ్స్. మరి ఈ రెండింటిలో ప్రేక్షకుడు ఏ చిత్రాన్ని మొదట చూస్తాడో అన్నది ఆసక్తికరమే.

మంచిని గెలిపించండి!





మార్కాపురం సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న సీఎం

రైతులతో కలసి కెనాల్‌ను పరిశీలించిన సీఎం

ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత సీఎం.. పెద్దబొమ్మాలపురానికి చెందిన సురవరం గండివీరారెడ్డి, అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అనే రైతులతో కలసి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని, కెనాల్ పనులను పరిశీలించారు. ప్రాజెక్టును పూర్తిచేసి ఎర్రగొండపాలెం నియోజకవర్గం మొత్తానికి సాగు, తాగు నీరందిస్తానని హామీ ఇచ్చారు. దీనిపై ఆ ఇద్దరు రైతులూ మీడియాతో తమ ఆనందం పంచుకున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. ఆ తర్వాత ప్రాజెక్టులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. సాయంత్రం కొత్త జిల్లా కేంద్రమైన మార్కాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నాటి సీఎం జగన్ వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాగానే పోలవరంతోపాటు వెలిగొండను ప్రాధాన్య ప్రాజెక్టుగా చేపట్టామని చెప్పారు. 'తీరా ఇక్కడ జరిగిన, జరగాల్సిన పనులను చూస్తే జగన్ దగా బయటపడింది. మొదటి దశ పూర్తిచేయాలంటే కనీసం రూ.2,042 కోట్లు, రెండో దశ పూర్తికి ఇంకో రూ.1,900 కోట్లు కావాలని తేలింది. అవసరమైన కాలువ లైనింగ్ పనులు పూర్తి చేయకుండా, నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. మేం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో రూ.540 కోట్లు వ్యయం చేసి పనులను గాడిలో పెట్టాం. మరో రూ.436 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు ఇప్పుడు శంకుస్థాపన చేశాం. 7,200 మంది నిర్వాసితులకు రూ.930 కోట్లు పరిహారం చెల్లించాలి. తొలి దశ పనులన్నీ పూర్తిచేసి జూలైనాటికి వెనుకబడిన మార్కాపురం ప్రాంతానికి వెలిగొండ జలాలను అందించి మాట నిలబెట్టుకుంటా' అని తెలిపారు. నల్లమల సాగర్, తీగలేరు కాలువ, తూర్పు కెనాల్ పనులకు రూ.2,540 కోట్లు ఖర్చుచేసి జిల్లాలో ఎక్కువ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. మార్కాపురంలో కలెక్టరేట్ భవన నిర్మాణం, ఇతర సౌకర్యాలకు 50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

హెరిటేజ్‌పై అభాండాలు

'కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని రసాయనాలతో తయారు చేసిన చరిత్ర గత పాలకులది' అని సీఎం మండిపడ్డారు. తన కుటుంబ సంస్థ హెరిటేజ్‌పై అభాండాలు వేస్తున్నారని అన్నారు. నాడు సొంత బాబాయిని చంపి అబద్ధాలు ప్రచారం చేసిన వారు ఇప్పుడు హెరిటేజ్‌పై నెపం మోపుతుంటే చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు.

వెయ్యికి కక్కుర్తి పడొద్దు..

కావలసింది కులం, మతం కాదు.. ఎవరు మంచిచేస్తే వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగుపడతాయని చంద్రబాబు చెప్పారు. 'నెలకు రూ.4 వేలు, 6 వేల చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. ఒకటో తేదీ ఆదివారం వస్తే ముందు రోజే ఇస్తున్నాం. ఆ విషయాన్ని మరచి.. ఎన్నికల్లో వెయ్యి రూపాయలకు కక్కుర్తిపడొద్దు. నిజానికి 2019 ఎన్నికల్లో కూడా నన్నే సీఎంను చేసి ఉంటే 2021కే వెలిగొండ జలాలు మీకు అందేవి. ఇప్పటికైనా వైసీపీ దొంగ నాటకాలను అడ్డుకుని.. భవిష్యత్‌లో అన్ని స్థానాల్లో కూటమి పార్టీలను గెలిపించాలి' అని పిలుపిచ్చారు. రాయలసీమ అభివృద్ధి కోసం పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా పండ్లతోటల అభివృద్ధికి పునాదులు వేస్తున్నామని.. మార్కాపురం, ప్రకాశం జిల్లాలూ వెనుకబడిన ప్రాంతాలు కాబట్టి వాటిని ఆ పథకంలో చేర్చామన్నారు.

బీసీలు, దళితులకు సమన్యాయం

బలహీనవర్గాలకు అండగా ఉండడంతోపాటు వర్గీకరణ ద్వారా దళితులందరికీ సమన్యాయం చేశామని సీఎం చెప్పారు. 'అవినీతి, అక్రమాలు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. 15,000 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు.. మరో 6 వేల మందికి పోలీసు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. రానున్న రోజుల్లో సరికొత్త జనాభా పాలసీని తీసుకొచ్చి ప్రతి కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు ఉండేవిధంగా చూస్తాం' అని చెప్పారు.

పోరుమామిళ్ల, రాచర్లకూ నీరు: సీఎం

నల్లమల సాగర్ రిజర్వాయర్‌లో 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు సమీక్ష సందర్భంగా సీఎంకు తెలియజేశారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామన్నారు. 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను మే చివరి నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. వెలిగొండ టన్నెళ్లు పూర్తయ్యాక పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

మా సమస్యలు తెలుసుకున్నారు..

రైతుల కుటుంబాల్లో ఆనందం నింపి, ఆదాయం వచ్చేలా చేయడానికి ప్రాజెక్టును పూర్తిచేస్తానని సీఎం హామీ ఇచ్చారు. గతంలో ఏ సీఎం ఇలా రైతులను కలిసి మాట్లాడలేదు. ఆయన మా సమస్యలను తెలుసుకున్నారు. ఏయే పంటలు సాగు చేస్తున్నారని అడిగారు. ఎన్ని అడుగుల లోతులో బోర్లు వేస్తున్నారో కూడా తెలుసుకున్నారు.

- గండి వీరారెడ్డి

తానే పూర్తిచేస్తానన్నారు..

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే.. దానిని పూర్తి చేసేదీ నేనేనని చంద్రబాబు చెప్పారు. మోసపూరిత మాటలు చెప్పేవారిని నమ్మొద్దని, కష్టపడి పనిచేసేవారిని గెలిపించుకోవాలని కోరారు. వెలిగొండను పూర్తిచేసేందుకు శ్రమిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు.

- అమ్మిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి.



రఘురామరాజును రన్ అవుట్ చేస్తున్న దృశ్యం



ఎలా ఆడదామంటే...!



బ్యాడ్మింటన్ ఆడుతున్న శ్రావణి, గ్రీష్మ

తలపడిన మంత్రులు!

రసవత్తరంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆటల పోటీలు

పురుషుల టీంలో క్రికెట్ ఆడిన గ్రీష్మ, సవిత

నేటితో పోటీల ముగింపు

విజయవాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రతిపక్షంతో అధికారపక్షం తలపడుతుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంత్రులతో మంత్రులు తలపడ్డారు. ఒకరిపై ఒకరు విజయం సాధించడానికి పట్టుదలను ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆటలపోటీలు బుధవారం రసవత్తరంగా సాగాయి. క్రికెట్, టెన్నికాయిట్, త్రోబాల్ పోటీల్లో మంత్రులతో మంత్రులు తలపడ్డారు. మంత్రి సవిత, ఎమ్మెల్సీ గ్రీష్మ పురుషుల క్రికెట్ జట్టులో కాసేపు ఆడి అలరించారు. గురువారం సాయంత్రంతో ఈ ఆటల పోటీలు ముగుస్తాయి.

సత్యకుమార్ బంతి - పల్లా ఫోర్

మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జట్ల మధ్య క్రికెట్ తొలి మ్యాచ్ జరిగింది. సత్యకుమార్ జట్టు బౌలింగ్ చేసింది. మంత్రి వేసిన బాల్‌ను పల్లా ఫోర్ కొట్టడంతో ప్రాంగణంలో కూర్చున్న టీడీపీ ఎమ్మెల్యేలు తమ కెప్టెన్ (టీడీపీ అధ్యక్షుడు) ఫోర్ కొట్టాడంటూ కేరింతలు కొట్టారు. మైక్‌లో పెద్దగా అరుపులు, కేకలు వేశారు. పల్లా జట్టు పది ఓవర్లకు 69 పరుగులు చేసింది. సత్యకుమార్ జట్టు 70 పరుగులు చేసి విజయం సాధించింది.

'కావలి' కేకలు.. నవ్వుల పూలు!

ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ సందడి స్టేడియంలో ఎక్కువగా కనిపించింది. సత్యకుమార్ , పల్లా శ్రీనివాసరావు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తూ వ్యాఖ్యానం చేశారు. మైకులో జై బాలయ్య అంటూ కేకలు వేశారు. పల్లా జట్టులో సభ్యురాలిగా క్రికెట్ ఆడారు. ఉత్తరాంధ్ర యాసలో వ్యాఖ్యానం చేసి స్టేడియంలో నవ్వులు పూయించారు. నువ్వు పాడు గజాలా... రవితేజ చిత్రంలోని డైలాగ్ ఇది. ఇదే డైలాగ్‌తో కావలి గ్రీష్మ నవ్వులు కురిపించారు. క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు తోటి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో గ్రౌండ్‌లో కూర్చున్న ఆమె 'పాటలు పెట్టు గజాలా... ముందు బాలయ్య పాటలు పెట్టు. తర్వాత పవన్ పాటలు పెట్టు' అని సౌండ్ సిస్టం ఆపరేటర్‌ను ఉద్దేశించి అనడంతో నవ్వుల పూలు విరిశాయి.

పోటాపోటీగా వ్యాఖ్యానాలు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వ్యాఖ్యానాలు సరద సరదాగా సాగాయి. మంత్రి కొల్లు రవీంద్ర స్టేడియంలోకి వస్తుండగా ఆయనకు వ్యాఖ్యాతలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు విజయకుమార్, రాధాకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి పోటీపడి వ్యాఖ్యానాలు చేశారు.



విజయసంకేతం చూపిస్తున్న రఘురామ, అనిత, యార్లగడ్డ తదితరులు

కటౌట్ చూసి కొన్ని నమ్మాలి డూడ్!

క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు మ్యాచ్ ఫిక్సింగ్‌లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే విజయకుమార్ వ్యాఖ్యానించారు. దీనికి మంత్రి కొల్లు రవీంద్ర తాను అలా కనపడుతున్నానా అని కౌంటర్ వేశారు. డిప్యూటీ స్పీకర్ ఈ విషయాన్ని తేల్చాలన్నారు. అప్పుడు కటౌట్ చూసి కొన్నికొన్ని నమ్మాలి డూడ్ అనడంతో అంతా ఒక్కసారిగా నవ్వుకున్నారు.

త్రోబాల్‌లో హోం విజయం

త్రోబాల్ పోటీల్లో మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి జట్ల మధ్య ఆట ఉత్కంఠగా సాగింది. చివరికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జట్టుపై హోంమంత్రి అనిత జట్టు ఏడు పాయింట్ల తేడాతో విజయం సాధించింది.



త్రోబాల్ గేమ్‌లో మంత్రులు సవిత, అనిత, ఎమ్మెల్యేలు సునీత, శ్రావణి

రాష్ట్రంలో 3.45 లక్షల మందికి హెచ్‌పీవీ వ్యాక్సిన్

తొలి విడతగా కేంద్రం నుంచి 1.90 లక్షల డోసులు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 14 సంవత్సరాలు నిండిన సుమారు 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ఇవ్వనున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్‌ను నివారించే ఈ వ్యాక్సిన్ పంపిణీ ఏర్పాట్లపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈనెల 28న ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, దీనికి అనుగుణంగా రాష్ట్రంలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ సదుపాయం కలిగిన 1,683 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ పంపిణీకి సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. తొలి విడత కింద ఇప్పటికే కేంద్రం నుంచి 1,90,890 డోసుల వ్యాక్సిన్ రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. "బాలికలకు వ్యాక్సిన్ ఇచ్చే ముందు తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతి తప్పనిసరి. వ్యాక్సిన్ వేశాక సర్టిఫికెట్ ఇస్తారు. సుమారు మూడు నెలల పాటు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుంది. 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు కలిగిన బాలికలు రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 23,957 మంది ఉన్నారు. తక్కువగా పోలవరం జిల్లాలో 2,777 మంది బాలికలు ఉన్నారు.

వ్యాక్సిన్ ఖరీదు రూ. 3,927

హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఖరీదు రూ. 3,927. సింగిల్ డోస్ టీకా కార్యక్రమం 90 దేశాల్లో అమల్లో ఉంది. సర్వైకల్ క్యాన్సర్ 15 నుంచి 44 ఏళ్ల మహిళల్లో అధికంగా కనిపిస్తోంది. ఈ క్యాన్సర్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 6 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఎక్కువగా వెలుగు చూస్తున్న క్యాన్సర్లలో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది" అని మంత్రి వివరించారు.

రైతు బండారు శ్రీనివాసరావుకు ఫెలో ఫార్మర్ అవార్డు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన రైతు బండారు శ్రీనివాసరావు, రైతునేస్తం సంస్థ నిర్వాహకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకు చెందిన రైతు ఎస్.జయపాల్‌రెడ్డి ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఐఏఆర్ఐ) ఏటా అందించే ఫెలో ఫార్మర్ అవార్డు అందుకున్నారు. బుధవారం ఢిల్లీలో ప్రారంభమైన పూసా కృషి విజ్ఞాన మేళా-2026లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వీరికి ఫెలో ఫార్మర్ అవార్డును అందజేసి అభినందించారు. రసాయన రహిత సేద్యం కోసం రైతునేస్తం ఫౌండేషన్ పదేళ్లుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలలో చేసిన కృషికిగాను బండారు శ్రీనివాసరావు, జయపాల్‌రెడ్డి ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

రెవెన్యూలో ఇంటిదొంగ

500 కోట్ల విలువైన భూముల్ని ప్రైవేటుపరం చేసే పన్నాగం

- తిరుపతి శెట్టిపల్లి ఎస్టేట్ భూముల్లోని 40 ఎకరాలపై ప్రైవేటు వ్యక్తుల కన్ను
- పట్టాల ప్రతిపాదనలు తిరస్కరించిన జేసీ
- సెటిల్‌మెంట్ డైరెక్టర్ వద్ద అప్పీలు
- తప్పుదోవ పట్టించేలా ఓ అధికారి ఫైలు
- జేసీ ఉత్తర్వులు తిరస్కరించేలా ప్రతిపాదనలు
- చివరి నిమిషంలో గుర్తించిన ఉన్నతాధికారి
- బాధ్యుడిపై సస్పెన్షన్‌కు చర్యలు
- అడ్డుకునేలా మరో అధికారి బేరసారాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఏడాదిలో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తా.. ప్రజల ఆస్తులు, భూములకు జవాబుదారీగా ఆ శాఖ ఉండేలా చేస్తా' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కొంతకాలంగా చెబుతున్నారు. ఈ దిశగా సంస్కరణలు చేపట్టారు. కానీ అవినీతి, అడ్డగోలు అక్రమాలకు అలవాటు పడిన కొందరు అధికారులు ప్రభుత్వ ప్రయోజనాలను, విలువైన భూములను పణంగా పెడుతూనే ఉన్నారు. తిరుపతి రూరల్ మండలంలో శెట్టిపల్లి గ్రామం ఉంది. ఇది ఒకప్పుడు ఎస్టేట్ విలేజ్. తిరుపతి పట్టణానికి అతి సమీపంలో ఉంది. ఇక్కడ ఎకరా కనీసం రూ.12-15 కోట్లపైమాటే. ఇక్కడ 380 ఎకరాలకు పైగా భూములపై వివాదం ఉంది. 1948లో ఎస్టేట్‌ల రద్దు చట్టం వచ్చింది. దీని ప్రకారం ఈ గ్రామంలో ఎస్టేట్ భూముల్లోని సాగుదారులను గుర్తించి రైత్వారీ పట్టాలు ఇవ్వాలి. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ సెటిల్‌మెంట్ అధికారి. రాష్ట్రస్థాయిలో సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ ఉంటారు. జిల్లా స్థాయిలో సెటిల్‌మెంట్ అధికారి ఇచ్చే ఆదేశాలు రైతులకు నచ్చకపోతే రాష్ట్రస్థాయిలో సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలి. ఇదీ చట్టం చెబుతున్న విధానం. 45 ఏళ్లుగా ఇక్కడి భూములపై వివాదం నడుస్తోంది. ఎస్టేట్ భూముల్లో సాగుచేసుకుంటున్న వారికి రైత్వారీ పట్టాలు ఇవ్వాలని, నివాస స్థలాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇంటిపట్టాలు ఇవ్వాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కొన్ని కేసుల్లో రియల్ ఎస్టేట్ మాఫియా, ప్రైవేటు వ్యక్తులు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి రైత్వారీ పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఇలాంటి కేసులను పక్కనపెట్టి, నిజంగా రైతుల సాగులో ఉన్న భూములను సెటిల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతి కలెక్టర్, ఇతర అధికారుల చొరవతో ఈ ఏడాది జనవరిలో ఓ కొలిక్కి తీసుకొచ్చారు. సంక్రాంతి నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అర్హులైన రైతులకు పట్టాలు, రెండు సెంట్లు చొప్పున నివాస స్థలాల పట్టాలు ఇప్పించారు. ఇందులో 225.42 ఎకరాలు రైతులకు, 90 ఎకరాలు ప్రభుత్వానికి, 65 ఎకరాలు తుడాకు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనేక కేసులను పరిష్కరించారు. సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద మరో 40 ఎకరాలకు సంబంధించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విలువ 500 కోట్లు ఉంటుంది.

40 ఎకరాలు కొట్టేసేందుకు ప్లాన్

పెండింగ్‌లో ఉన్న 40 ఎకరాలకు సంబంధించి పట్టాలు కోరుతూ ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌లను జిల్లా సెటిల్‌మెంట్ అధికారిగా జేసీ గతంలోనే తిరస్కరించారు. జేసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రైవేటు వ్యక్తులు అమరావతిలోని సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద అప్పీల్ చేశారు. అయితే ఓ అధికారి ప్రైవేటు వ్యక్తులతో మిలాఖత్ అయ్యారు. ముందస్తుగా బేరసారాలు చేసుకున్నారు. దీంతో 40 ఎకరాల కేసులో తిరుపతి జేసీ ఉత్తర్వులను 'అడ్మిట్'కు బదులుగా, 'రిజెక్ట్' (తిరస్కరించడం) అని రాసి ఫైలును తయారు చేసి సెటిల్‌మెంట్ కమిషనర్ ఆమోదం కోసం పంపించారు. అప్పటికే కొన్ని కీలక ఫైళ్లపై సెటిల్‌మెంట్ కమిషనర్ కూర్మనాథ్ సంతకాలు చేశారని తెలిసింది. అయితే వాటి మధ్యలో తిరుపతి శెట్టిపల్లి ఎస్టేట్ భూముల ఫైలు ఉండటం, అందులో జేసీ ఉత్తర్వులను రిజెక్ట్ చేయాలనే ప్రతిపాదనలు ఉండటాన్ని పరిశీలించి సంతకాలు ఆపేశారు.

సస్పెన్షన్‌ను అడ్డుకునేందుకు మంత్రాంగం

ఎస్టేట్ భూముల విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఆదేశాలు ఇచ్చేలా ఫైలు ప్రతిపాదనలు పంపించిన అధికారిని సస్పెండ్ చేయడానికి ఫైలు సిద్ధం చేయాలని సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ కూర్మనాథ్ ఆదేశించారని తెలిసింది. అయితే తప్పు చేసిన వ్యక్తిని కాపాడేందుకు మరో కీలక అధికారి మంతనాలు ప్రారంభించారని తెలిసింది. ప్రభుత్వ స్థాయిలో పెద్దలతో మాట్లాడి సస్పెన్షన్‌ను ఆపేస్తామని బేరసారాలకు దిగినట్లు సమాచారం. క్రమశిక్షణా చర్యల ఫైలు సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్‌కు పంపకుండా అడ్డుపుల్ల వేసినట్లు తెలిసింది. ఇటు ప్రభుత్వ, అటు రైతుల ప్రయోజనాలతో ముడిపడిన కేసులో ఓ అధికారి నిర్భీతిగా సెటిల్‌మెంట్ కమిషనర్‌ను తప్పుదోవపట్టించాలనుకోవడం, ప్రైవేటు వ్యక్తులకు మేలు చేయాలనుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ఏఐతో భూగర్భ జలాల అంచనా

- సమర్థ నిర్వహణ, వినియోగానికి దోహదం
- ఏపీలో భూగర్భ జలాల పరిస్థితి భేష్
- సీజీడబ్ల్యూబీ సభ్యుడు వరదరాజ్

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలవనరుల అంచనా, సమర్థ నిర్వహణ, వినియోగానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను విస్తృతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర భూగర్భ జలవనరుల బోర్డు(సీజీడబ్ల్యూబీ) సభ్యుడు ఎన్.వరదరాజ్ అన్నారు. గతంలో భూగర్భ జలాలను పదేళ్లకు ఒకసారి, ఆ తరువాత ఐదేళ్లకు, రెండేళ్లకు ఒకసారి అంచనా వేసేవారని, ఇప్పుడు ఏడాదికి ఒకసారి అంచనా వేస్తున్నారని చెప్పారు. బుధవారం విజయవాడలో భూగర్భ జలాల డేటా, జలధార పొరల మ్యాపింగ్ ఫలితాల ప్రచారం అనే అంశాలపై సీజీడబ్ల్యూబీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించింది. వరదరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2012లో జాతీయ జలధార పొరల మ్యాపింగ్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1.46 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో మ్యాపింగ్ పూర్తయినట్లు వివరించారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 679 అసెస్‌మెంట్ యూనిట్ల(మండలాల)లో 601 యూనిట్లు సురక్షితంగా ఉన్నాయన్నారు. ఏపీలో భూగర్భ జలాల పరిస్థితి సురక్షితంగా ఉందని చెప్పారు. అయితే దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సంరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. సీజీడబ్ల్యూబీ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ కె.ఎన్.జ్యోతికుమార్ ఏపీ గ్రౌండ్ వాటర్ డైరెక్టర్ కె.ఎస్.శాస్త్రి, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర భూగర్భ జల వనరుల బోర్డు సభ్యుడు వరదరాజ్ తదితరులు





కిందపడిన రఘురామకు సపర్యలు, లేచి వెళ్తున్న ఆర్ఆర్ఆర్

'ఆర్ఆర్ఆర్'కు గాయం... విరిగిన మణికట్టు ఎముక

ఆటలో అపశ్రుతి..

క్రికెట్ మ్యాచ్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. క్రికెట్ ఆటలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్రికెట్ ఆటలో అదుపు తప్పి పిచ్‌పై పడిపోవడంతో చేతికి గాయమైంది. తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించగా.. ఎక్స్‌రేలో ఎడమ చేతి మణికట్టు వద్ద ఎముక విరిగినట్టు వైద్యులు గుర్తించి, ఆపరేషన్ చేయాలని సూచించారు. రఘురామ గురువారం హైదరాబాద్ వెళ్లి అక్కడ ఆపరేషన్ చేయించుకుంటారని తెలిసింది.

20 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రం

- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆరోపణ.. ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన
- కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఘటన

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు ప్రశ్నపత్రాన్ని 20 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపించారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీలో ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద ఈ విషయమై బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. పరీక్ష కేంద్రం ఎగ్జామినేషన్ చీఫ్, ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంటల్ అధికారులను, సిబ్బందిని నిలదీశారు. కొద్దిసేపు వాగ్వాదం జరగడంతో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామ్‌నాథ్ అక్కడ చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ విషయంపై ఇంటర్మీడియట్ ఆర్ఐవో లాలప్పను వివరణ కోరగా.. తల్లిదండ్రుల ఫిర్యాదులు అందాయని, సీసీటీవీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కర్నూలు జిల్లా ఆదోని ఎస్‌కేడీ కాలనీలోని పరీక్ష కేంద్రం వద్ద ఇన్విజిలేటర్‌తో వాగ్వాదం

హిందూధర్మ వ్యతిరేకి జగన్!

తిరుమల భక్తులకు క్షమాపణ చెప్పాలి: బుచ్చిరాం ప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ వ్యతిరేకి జగన్ అని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ ఆరోపించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పులివెందులలో మరో మహాపచారానికి పాల్పడ్డారన్నారు. నందిపల్లిలోని నందేశ్వరాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకంలో పాల్గొన్న జగన్ పూజారులు ఇచ్చిన తీర్థాన్ని స్వీకరించకుండా కిందపారబోశారని, అగ్నిగుండంలో వేయటానికి పూజారులు ఇచ్చిన హవిస్సులను తిరిగి వారికే ఇచ్చేసి మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. తిరుమల ప్రసాదాల కుంభకోణాన్ని, పరకామణి చోరులను జగన్ సమర్థించారని ఆయన తక్షణమే భక్తులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




శాసనసభలో పెట్టిన చేనేత విక్రయ కేంద్రంలో చీరలను పరిశీలిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

పేద కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్

- ఒక్కో రోగికి ఏటా రూ.86వేలు ఖర్చు చేస్తున్నాం: వైద్య మంత్రి

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పేద కిడ్నీ రోగులకు ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ చేస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. శాసనమండలిలో టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. 21,504 మంది కిడ్నీ రోగులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారని తెలిపారు. గత 20 నెలల్లో సెకండరీ ఆసుపత్రుల్లో కొత్తగా 14 డయాలసిస్ కేంద్రాలు ప్రారంభించామని, త్వరలో మరో 11 కేంద్రాలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఒక్కో రోగికి ఉచిత డయాలసిస్ సేవలకు ప్రభుత్వం ఏటా రూ.86వేలు ఖర్చు చేస్తోందన్నారు. కిడ్నీ రోగులకు పెన్షన్‌తో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. అతిసార వ్యాధిపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ మంచినీరు కలుషితం కావడం, డయేరియా కేసులు ప్రబలకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ మంచినీటి పథకాల నిర్వహణ లోపాలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరారు. మండలి ఛైర్మన్ మాట్లాడుతూ పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని సూచించారు.

ఉద్దానంలో తాగునీటి పథకం పూర్తి: మనోహర్

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో తాగునీటి పథకం పూర్తయిందని, దీనికి రూ.4,162.95కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి పవన్ కల్యాణ్ తరుపున మనోహర్ సమాధానం చెప్పారు. గ్రంథాలయాల రుసుము వసూళ్లపై టీడీపీ ఎమ్మెల్సీ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఇంటి పన్నుపై ప్రతి రూపాయికి 8పైసలు పంచాయతీలు వసూలు చేస్తుండగా, ఈ నిధుల్ని జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేసి, గ్రంథాలయాల నిర్వహణకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

భోగాపురం విమానాశ్రయ పనులు త్వరలో పూర్తి: జనార్దనరెడ్డి

భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు త్వరలో పూర్తి కానున్నాయని మంత్రి బీసీ జనార్దనరెడ్డి చెప్పారు. వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పోర్టులు, హార్బర్ ప్రైవేటీకరణపై ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని స్పష్టం చేశారు. కోనసీమలో గ్యాస్ లీకేజీల ఘటనలపై జనసేన సభ్యుడు నాగేంద్రబాబు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారని, ఓఎన్జీసీ విచారణ కమిటీ సిఫారసులు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్లను గాలికొదిలేసిన జగన్: బీసీ జనార్దనరెడ్డి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిందని మంత్రి బీసీ జనార్దనరెడ్డి విమర్శించారు. జగన్ పాలనలో రోడ్లపై పడిన పెద్ద పెద్ద గుంతల్లో ప్రజలు వరినాట్లు వేసి నిరసన తెలిపారని గుర్తు చేశారు. అప్పట్లో జగన్ స్నేహితుడైన కేసీఆర్ కూడా ఏపీలో రోడ్ల దుస్థితిని ఉటంకిస్తూ హేళనగా మాట్లాడారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిచ్చి నిధులు విడుదల చేయడంతో ఏడాదిలోనే అన్ని రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశామన్నారు.

పర్యాటక ప్రాజెక్టులతో ఉపాధి కల్పన: దుర్గేష్

రాష్ట్రంలో పర్యాటక రంగం ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ చెప్పారు. బీజేపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. పర్యాటక రంగంలోని వివిధ ప్రాజెక్టుల ద్వారా 39,264 మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.429కోట్ల విలువైన కేంద్ర పర్యాటక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, మరికొన్ని ప్రతిపాదనలు కేంద్రానికి పంపామన్నారు.

ఎంఎస్ఎంఈ యూనిట్ల పాలసీ అమలు: శ్రీనివాస్

రాష్ట్రంలో ఖాయిలా పడిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లను పునరుద్ధరించేందుకు 2026-31 ఎంఎస్ఎంఈ పాలసీని అమలు చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రంలో 3వేల ఎంఎస్ఎంఈ యూనిట్లు నిలిచిపోయిన విషయం వాస్తవం కాదన్నారు.

పోర్టులపై పొంతనలేని సమాధానమా?: తూమాటి

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పోర్టులకు ఎంత ఖర్చు చేశారని అడిగితే సభలో పొంతన లేని సమాధానం చెప్పారని వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు విమర్శించారు. బుధవారం అసెంబ్లీ గేటు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పుడు సమాచారంతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గతప్రభుత్వం చేసిన ఖర్చునే కూటమి ప్రభుత్వం చేసినట్లుగా చెబుతున్నారన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు రేపు సమాధానాలు రాకపోతే ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కల్తీ మాఫియా నడుస్తోందని, ఏ మున్సిపాలిటీలో చూసినా డయేరియా విజృంభిస్తోందని వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ తెలిపారు. సభలో ఎంఎల్‌సీలను సస్పెండ్ చేసేలా ప్రశ్న అడిగితే మంత్రి ప్రతిదానికీ ఏదో సమాధానం చెబుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ విమర్శించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ.. 'వైవీ సుబ్బారెడ్డి భార్య హిందువు కాదా. కూటమి నేతల భార్యలు గానీ, టీటీడీ ఛైర్మన్ భార్యగానీ ఆమెలా తిరుమల కోసం మాట్లాడగలరా' అని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి భార్య పూజలెన్నో చేస్తారని ఎమ్మెల్సీ కల్యాణి అన్నారు. బైబిల్ పట్టుకుంటేనే క్రిస్టియన్ అయిపోయినట్లేనా మీరెవ్వరూ పట్టుకోలేదా అని ప్రశ్నించారు.

'ఆడబిడ్డ నిధి' పథకంపై మండలిలో సంవాదం

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ నిధి పథకంపై శాసనమండలిలో బుధవారం అధికార, విపక్ష సభ్యుల మధ్య సంవాదం జరిగింది. ఈ పథకం కింద 2024-26 మధ్య ప్రభుత్వం చేసిన ఖర్చు ఎంత? అని వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇస్తూ.. ఈ పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. లబ్ధిదారుల సంఖ్య, నిధుల కేటాయింపుపై వైసీపీ సభ్యులు ప్రశ్నించగా, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు. దీంతో.. సూపర్‌సిక్స్ హామీల్లో ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి వాగ్దానం చేసిందని, రెండేళ్లలో రూ.36 వేల ఆడ బిడ్డలకు బాకీ పడిందని, ఆ సొమ్ము ఎప్పుడిస్తారని వైసీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రశ్నించారు. దీంతో వాకౌట్ చేసి వెళ్లిపోతూ టీడీపీ సభ్యులు ఎద్దేవా చేశారు. మంత్రి కొలుసు పార్థసారథి జోక్యం చేసుకుని.. మీ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు ఎంతిచ్చారో చెప్పాలని నిలదీశారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారని ఛైర్మన్ మోషేన్‌రాజు సూచించారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, ఆడబిడ్డ నిధి పథకం పరిశీలనలో ఉందని మంత్రి శ్రీనివాస్ చెప్పారు. దీంతో వైసీపీ, టీడీపీ సభ్యులు పెద్దగా కేకలు వేస్తుండగా.. ప్రతిపక్షానికి, పాలక పక్షానికి తేడా లేకుండా పోతోందని ఛైర్మన్ మందలించారు. వైసీపీ వాళ్లకి సమాధానం వినే ఓపిక లేదని టీడీపీ ఎమ్మెల్సీ గ్రీష్మ అనడంతో 'ఓపిక మీకూ లేదు.. వాళ్లకీ లేదు' అని ఛైర్మన్ అన్నారు. అంతకుముందు భోగాపురం విమానాశ్రయం పనులపై వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి జనార్దన్‌రెడ్డి సమాధానం చెప్తుండగా, భోగాపురం పనులు వైసీపీ హయాంలో జరిగితే కూటమి నేతలు హైజాక్ చేశారని వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించడంతో భోగాపురానికి ఎర్ర బస్సు రాదని జగన్ అన్నారని టీడీపీ సభ్యులు ఎద్దేవా చేశారు.

పలు బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు: ఏపీ అల్లోపతి ప్రైవేట్ వైద్య సంరక్షణ సంస్థల రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్ సవరణ బిల్లును మంత్రి సత్యకుమార్, ఏపీ ధార్మిక, హిందూ మత సంస్థలు, దేవాదాయ సవరణ బిల్లు, శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ సవరణ బిల్లు, ఏపీ రైతుల నీటి పారుదల వ్యవస్థల యాజమాన్య సవరణ బిల్లును మంత్రి పార్థసారథి, ఏపీ జైళ్లు, సంస్కరణ సర్వీసుల బిల్లును మంత్రి అనిత ప్రవేశపెట్టారు. వ్యవసాయ బిల్లుపై చర్చ వాయిదా పడింది.

ఆ గజదొంగ జగనేనా?

గజదొంగను పట్టుకోవాలి

- తిరుమల లడ్డూ విషయంలో గుమస్తాలు, చిరుద్యోగులనే తప్పుబడుతున్నారు
- చంద్రబాబు క్షమాపణలు చెప్పి ఉంటే ఈ అంశానికి ముగింపు వచ్చేది: బొత్స



అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ విషయంలో గుమస్తాలను, చిన్న ఉద్యోగులను తప్పుబడుతన్నారని శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. కిలో రూ.341 రూపాయల నెయ్యిని రూ.658కు అమ్ముతున్న గజదొంగను ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని వ్యాఖ్యానించిన సీఎం చంద్రబాబు క్షమాపణలు చెప్పి ఉంటే, ఈ అంశానికి ముగింపు వచ్చేదన్నారు. తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో తప్పు చేసినట్టుగా తేలినవారిని శిక్షిస్తే తమకు అభ్యంతరం లేదని అన్నారు. బుధవారం శాసనసభా ప్రాంగణంలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వైష్ణవి డెయిరీ ప్రాంగణంలోనికి సంగం డెయిరీ వాహనాలెందుకు వెళుతున్నాయని ప్రశ్నించారు. అదేమీ పార్కింగ్ ప్రాంతం కాదని, వాహనాలు రిపేరు చేసే వర్క్‌షాపు కూడా కాదు కదా అని ప్రశ్నించారు. సంగం డెయిరీ లోగోలతో కూడిన ట్యాంకర్లు వైష్ణవి డెయిరీలోనికి వెళ్లడానికి కారణాలేమిటని అన్నారు.

బొత్స వ్యాఖ్యలకు లోకేశ్ కౌంటర్

- నాడు బాబాయ్‌ను చంపి కత్తి మా చేతిలో పెట్టారు
- ఇప్పుడు వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్‌కు సంబంధం అంటగడుతున్నారు
- జగన్, వైసీపీవన్నీ తప్పుడు ఆరోపణలు
- సర్క్యులేషన్ ఆధారంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రకటనలెందుకు ఇవ్వలేదు?
- మీడియాతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత (2019) సార్వత్రిక ఎన్నికలకు ముందు బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసి కత్తిని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ (టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు) చేతుల్లో పెట్టారని మంత్రి లోకేశ్ అన్నారు. ఇప్పుడు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ వీఎస్ఆర్ ఏవియేషన్స్ విమాన ప్రమాదంలో మరణించిన ఘటనతో హెరిటేజ్‌కు సంబంధం ఉందంటూ వైసీపీ ఆరోపణలు చేయడం కూడా ఇలాంటిదేనన్నారు. వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో లోకేశ్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. హెరిటేజ్ ఫిన్‌లీస్‌ను 1996లో స్థాపించారని తెలిపారు. 2022లో హెరిటేజ్ ఫిన్‌లీస్ నుంచి వేల సంస్థల తరహాలోనే వీఎస్ఆర్ ఏవియేషన్స్ రుణం తీసుకుందని చెప్పారు. ఆ సంస్థ రుణం తీసుకునే నాటికి తాము అధికారంలో లేమన్నారు. 2024లో తమ ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్ర విమానయాన మంత్రి అవుతారని గానీ, 2026లో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ వీఎస్ఆర్ ఏవియేషన్స్ విమానంలో ప్రయాణిస్తారని గానీ, ఆ విమానం ప్రమాదానికి గురవుతుందని గానీ తాము కలలో కూడా అనుకోలేదన్నారు. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో తెలిసేందుకు తాము జోస్యులం కాదన్నారు. వీఎస్ఆర్ ఏవియేషన్స్‌కు రుణం ఇవ్వడం మినహా హెరిటేజ్ ఫిన్‌లీస్‌కు ఎలాంటి సంబంధాలూ లేవన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇదే విధంగా బాబాయ్‌ని గొడ్డలితో నరికి, ఆయుధాన్ని తమ (టీడీపీ) చేతుల్లో పెట్టేశారని.. ఇప్పుడు వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్ ఫిన్‌లీస్‌కు సంబంధం అంటగడుతున్నారని మండిపడ్డారు.


అసెంబ్లీ సమావేశాలు చూసేందుకు వచ్చిన సత్తెనపల్లిలోని సుగాలి జెడ్పీ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా శాఖ మంత్రి లోకేశ్

జగన్‌ను పట్టుకోమని చెబుతున్నారా?

తిరుమల లడ్డూ వ్యవహారంలో చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగను వదిలేస్తున్నారంటూ మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారంటూ ఓ మీడియా ప్రతినిధి చెప్పగా.. అంటే జగన్ గజదొంగ అని బొత్స అంగీకరించారా అని లోకేశ్ ప్రశ్నించారు. ఇప్పుడు జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా అని అడిగారు. గత ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్, అసైన్‌మెంట్ భూములు, ఇన్నర్ రింగ్‌రోడ్, లిక్కర్, ఇసుక అంశాలపై తమపై అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. ఈ కేసుల్లో ఏ ఒక్కదానికీ ఆధారాలు చూపలేదన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు తన కంపెనీలకు మేలు చేసుకున్నారని.. భారతీ సిమెంట్స్‌కు ప్రయోజనం కల్పించారని, జగన్ పత్రికకు కోట్లాది రూపాయలు ప్రకటనలు ఇచ్చారని అన్నారు. సర్క్యులేషన్ ఆధారంగా 'ఆంధ్రజ్యోతి'కి అసలు ప్రకటనలే ఇవ్వలేదని లోకేశ్ అన్నారు.

ఓ కుటుంబంలా ఉన్నాం

టీడీపీ ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా ఒక వర్సిటీ పెట్టామని లోకేశ్ అన్నారు. ఎమ్మెల్యేలకు రెండు రోజుల పాటు రెసిడెన్సియల్ తరహాలో ఓరియంటేషన్ ఇస్తామని వెల్లడించారు. పార్టీ శ్రేణులకు 300 రోజుల పాటు నిరంతరాయం ఓరియంటేషన్ ఉంటుందన్నారు. జిల్లాలవారీగా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా ముచ్చటించుకుంటున్నామని చెప్పారు. రాజకీయాంశాలను ప్రస్తావించడం లేదన్నారు. తెలుగుదేశం కుటుంబంలా ఒకటిగా ఉన్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రజా ప్రతినిధుల్లో 50 శాతం మందివి ప్రేమ వివాహాలేనన్నారు.

అమ్మభాషను మరవొద్దు

- అసెంబ్లీ చూసేందుకు వచ్చిన విద్యార్థులతో లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కెరీర్ కోసం ఇంగ్లిషులో నైపుణ్యం కనబరుస్తూనే మాతృభాష తెలుగును మర్చిపోవద్దని మంత్రి లోకేశ్ విద్యార్థులకు సూచించారు. విదేశాల్లో ఎక్కువ కాలం చదువుకోవడం వల్ల మొదట్లో తెలుగు రాక తాను ఇబ్బంది పడిన విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. అసెంబ్లీ సమావేశాలను చూడటానికి సత్తెనపల్లి నియోజకవర్గం సుగాలి జెడ్పీ హైస్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులతో లోకేశ్ బుధవారం అసెంబ్లీ లాబీలో కాసేపు ముచ్చటించారు. పిల్లలే రాష్ట్ర భవిత అనీ, రాబోయే కాలంలో చరిత్ర సృష్టించేది మీరేనని అన్నారు. ఇంగ్లీషులో చదువుకుంటున్నా.. అమ్మలాంటి తెలుగు భాషను మాత్రం మరువొద్దన్నారు. అసెంబ్లీ చూడటం ఎలా ఉంది? మీరు చూస్తున్నప్పుడు అసెంబ్లీలో ఏ అంశంపై చర్చ జరిగింది? అని ఆరా తీయగా, ప్రత్యక్షంగా చూడటం వల్ల చాలా విషయాలు తెలిశాయని విద్యార్థులు చెప్పారు. ప్రభుత్వ యూనిఫామ్ ఎలా ఉంది? టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు? మధ్యాహ్న భోజనం రుచిగా ఉంటుందా? రాగిజావ అందుతోందా? అని విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- 20నెలల్లో 1.09 లక్షలు కల్పించాం: మంత్రి లోకేశ్
- స్కిల్ సెన్సెస్‌కు ఇబ్బందులు
- ఏఐ ద్వారా స్కిల్ అసెస్మెంట్ చేస్తామన్న మంత్రి

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో ఒప్పందాలు చేసుకున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20నెలల్లో 1.09లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఉద్దేశించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు అందిస్తున్నాయా.? అంటూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు బుధవారం అసెంబ్లీలో మంత్రి సమాధానం ఇచ్చారు. క్లస్టర్ విధానంలో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే 760ప్రాజెక్టులు గుర్తించామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళా నిర్వహించబోతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1,587నిర్వహించామన్నారు. ఇందులో 11,373పరిశ్రమలు పాల్గొని 1.09లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చాయని లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్య పోర్టల్ ప్రారంభిస్తామన్న మంత్రి... స్కిల్ సెన్సెస్ చేద్దామనుకుంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందుకే ఏఐ ద్వారా స్కిల్ అసెస్మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్కర్స్ సహా ఇతరులు ఎవరికివారే యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. వారికి తగిన శిక్షణ ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పిన వైసీపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత మడమ తిప్పిందన్నారు. అప్పటికే ఉన్న స్కిల్ కార్పొరేషన్ ఉద్యోగుల్ని వైసీపీ నేతలు ఇళ్లల్లో పనికి పెట్టుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ ముఖ్యమని భావించిన తాము ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు.

- రాత్రింబవళ్లు అభివృద్ధి పనులు జరుగుతున్న రాజధాని ప్రాంతంలోని అన్ని పోలీసు స్టేషన్లలోనూ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ చెప్పారు. పోలీసు స్టేషన్‌కు ఎవరు.. ఎప్పుడు వెళ్లినా బందోబస్తు డ్యూటీల్లో ఉన్నారని సమాధానం వస్తోందని, ఈ విషయం డీజీపీకి చెప్పినా ఫలితం లేదని ఎమ్మెల్యే పెదవి విరిచారు. ఈ సమస్య అందరి వద్దా ఉంది.. మీరు మాట్లాడతారా.. అంటూ డిప్యూటీ స్పీకర్ హోం మంత్రి అనితను అడగ్గా ఆమె తల అడ్డంగా ఊపారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కొవ్వాడలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితులకు అటు పునరావాస కాలనీ పూర్తిచెయ్యక, ఇటు ఉన్నచోట కనీస సౌకర్యాల్లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని అడిగితే.. ఎలాగూ ఆర్.ఆర్. కాలనీకి మారుతారు కదా.? అనే సమాధానం వస్తోందని, అది పూర్తయ్యేవరకూ ఆ ప్రజలు శిక్ష అనుభవించాల్సిందేనా.? అని ప్రశ్నించారు. ఎచ్చెర్ల ప్రాంతంలోని పారిశ్రామిక వ్యర్థాలతో అక్కడి మత్స్యకారులు మత్స్య సంపద కోల్పోయి ఉపాధికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.
- 'మదనపల్లె ఫైల్స్ తరహాలోనే సర్వేపల్లి ఫైల్స్ ఉన్నాయి.. వందల కోట్ల విలువైన భూముల స్కామ్ వైసీపీ హయాంలో జరిగింది. ప్రభుత్వం ఖరీదైన భూముల్ని కాపాడుకోవాలి. విచారించి చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు.
- పేదలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యంలో 80శాతానికి పైగా దారి మళ్లుతున్నాయని, ప్రభుత్వానికి ఆర్థిక భారమైన ఈ సరఫరాపై సమీక్షించి సముచిత నిర్ణయం తీసుకోవాలని పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కోరారు.

నా రాజీనామా ఆమోదించండి!

- మండలి ఛైర్మన్‌తో జయమంగళం
- జనసేన కండువాతో విచారణకు హాజరు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తాను వైసీపీకి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఏడాది అయిందని, ఇంకా తన రాజీనామా ఎందుకు ఆమోదించడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ జయమంగళం వెంకట రమణ శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజును కోరారు. బుధవారం మండలి ఛైర్మన్ ఎదుట ఆయన విచారణకు హాజరయ్యారు. జనసేన కండువా కప్పుకొని విచారణకు వెంకటరమణ హాజరు కావడం గమనార్హం. విచారణ అనంతరం అసెంబ్లీ లాబీలో వెంకటరమణ విలేకరులతో మాట్లాడారు. తన రాజీనామా ఆమోదించాలని ఇప్పటికే పలుమార్లు కోరినా ఎందుకు ఆమోదించడం లేదని మండలి ఛైర్మన్‌ను అడిగానని, ఇదే అంశంలో హైకోర్టును కూడా ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేశానని వెంకటరమణ తెలిపారు. తాను వైసీపీకి రాజీనామా చేసి, అధికారికంగా జనసేనలో చేరానని, అందుకే జనసేన కండువా కప్పుకొని విచారణకు వెళ్లానని అన్నారు. 'మీ ఎదుట వేరే పార్టీ కండువా కప్పుకొని కనబడితే మీరు సస్పెండ్ చేయవచ్చు. కానీ నా రాజీనామా విషయంలో మీరు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని కూడా ఛైర్మన్‌ను అడిగానని తెలిపారు. ఎవరైనా ప్రలోభ పెట్టారా.. బెదిరించారా.. అని ఛైర్మన్ తనను ప్రశ్నించారని, అలాంటిదేమీ లేదని, స్వచ్ఛందంగానే వైసీపీకి.. ఎమ్మెల్సీకి రాజీనామా చేశానని తెలిపానని వివరించారు. ఎన్నిసార్లు విచారణకు హాజరైనా తన నిర్ణయం ఇదేనని, ఇప్పటికైనా తన రాజీనామా ఆమోదించాలని కోరానని వెంకటరమణ వెల్లడించారు.

ఇందాపూర్‌పై అనవసర రాద్ధాంతం

కల్తీ నెయ్యి ఉదంతాన్ని పక్కదారి పట్టించేందుకే వైసీపీ డ్రామా: పార్థసారథి



అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇందాపూర్ డెయిరీపై వైసీపీది అనవసర రాద్ధాంతమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెరిటేజ్ సంస్థ నాణ్యత విషయంలో ఎంత కఠినంగా ఉంటుందో చెప్పడానికి తానే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. 'గతంలో నేను కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో పాలు ప్యాకింగ్ చేసే 'ఫిలిం' ఫ్యాక్టరీ ఉండేది. అయినా హెరిటేజ్ సంస్థ నాకు ఆర్డర్లు ఇచ్చేది. ఒక రోజు హెరిటేజ్ అధికారి తనిఖీకి వచ్చిన సమయంలో అక్కడ కొన్ని దోమలు, పురుగులు ఉండటం చూసి వెంటనే ఆర్డర్లు రద్దు చేశారు. హెరిటేజ్ సంస్థ నాణ్యతకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ' అని అన్నారు. ఎయిర్‌బస్ సంస్థ అయినా అన్ని విడిభాగాలనూ తమ కంపెనీలోనే తయారు చేయదని, వివిధ కంపెనీల నుంచి కాంపోనెంట్స్ తీసుకుని అసెంబల్ చేస్తాయని వ్యాఖ్యానించారు. అలాగే, హెరిటేజ్ సంస్థ కూడా ఇందాపూర్ నుంచి చీజ్ కొనుగోలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. తిరుమల కల్తీ నెయ్యి ఉదంతాన్ని పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు కొత్త డ్రామాకు తెరదీశారని మండిపడ్డారు. నెయ్యి కల్తీ జరిగిందని సిట్ నిర్ధారించినా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు

వివిధ శాఖల పద్దులకు శాసనసభ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖలకు నిధుల కోసం సంబంధిత మంత్రులు ప్రతిపాదించిన పద్దుల (డిమాండ్లు)పై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. రోడ్లు, భవనాల శాఖకు రూ.9,977.71 కోట్లు, రవాణా శాఖకు 268.54 కోట్లు, దేవదాయ శాఖకు రూ.248.57 కోట్లు, గవర్నర్, మంత్రిమండలికి రూ.37.60 కోట్లు, సాధారణ పరిపాలన, ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.824.50 కోట్లు, ఆర్థిక పరిపాలన, ప్రణాళికలు, సర్వేలు, గణాంకాల శాఖకు రూ.40,953.13 కోట్లు, వాణిజ్య పన్నుల శాఖకు రూ.474.02 కోట్లు, రాష్ట్ర శాసన వ్యవస్థకు సుమారు రూ.162.13 కోట్లకు మించకుండా నిధులు మంజూరు చేయాలని మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్ కోరారు. ప్రతిపాదించిన డిమాండ్లపై ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలపై సంబంధిత మంత్రులు సమాధానాలిచ్చారు. సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు అన్ని డిమాండ్ల ఆమోదానికి ఓటింగ్ నిర్వహించగా.. సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఎలక్ట్రానిక్ డ్రైయర్ల ఏర్పాటుకు చర్యలు: అచ్చెన్న



రాష్ట్రంలో పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోవటానికి ఎలక్ట్రానిక్ డ్రైయర్లు ఏర్పాటు చేసే అంశం పరిశీలనలో ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ధాన్యం కళ్లాల ఏర్పాటుపై టీడీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ 'అకాల వర్షాలకు పంట ఉత్పత్తులు తడవకుండా రైతుసేవా కేంద్రాల ద్వారా టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నాం. ఎలక్ట్రానిక్ డ్రైయర్లు, ఆధునిక యార్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. 572 పీఏసీఎస్‌ల్లో 1,111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశాం' అని చెప్పారు.

ఆర్టీసీకి 750 కొత్త బస్సులు: మంత్రి రాంప్రసాద్



'పీఎం ఈ-బస్ సేవ' ద్వారా రాష్ట్రానికి 750 కొత్త బస్సులు రానున్నాయని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య 65 శాతం పెరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని తెలిపారు. మహిళలతోపాటు దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని తాజాగా రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

గత ప్రభుత్వంలో దేవదాయశాఖ పరిస్థితి దారుణం: ఆనం



గత ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రామతీర్థంలో రాముడి తలను వేరు చేయడం, అంతర్వేదిలో రథాన్ని తగలబెట్టడం, విజయవాడలో కనకదుర్గమ్మ రథంపై వెండి సింహాలను మాయం చేయడం, బిట్రగుంటలో వెంకటేశ్వరస్వామి రథాన్ని తగలబెట్టడం, పిఠాపురంలో దేవతా విగ్రహాల ధ్వంసం.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అనేక హిందూ దేవాలయాలపై దాడులకు తెగబడటాన్ని చూసిన సామాన్య భక్తులు ఆలయాలకు వెళ్లడమే తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు టీటీడీతో సహా దేవదాయశాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. టీటీడీ నుంచి రూ.750 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.

వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం: పయ్యావుల



వైసీపీ విధ్వంస పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జగన్ ప్రభుత్వం రూ.9,74,556 కోట్ల అప్పులు చేయగా.. అందులో ఇప్పటికే రూ.24,811 కోట్లు తీర్చామని చెప్పారు. రూ.37 వేల కోట్ల బిల్లులు చెల్లించామని, పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. రూ.18,700 కోట్ల మేర రాష్ట్ర వాటా నిధులు చెల్లించి వైసీపీ హయాంలో నిలిచిపోయిన 88 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించామన్నారు. వ్యాపారులపై వేధింపులు లేకుండా పన్నులు వసూలు చేస్తున్నామని, దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత ఏపీ రెండో స్థానంలో ఉందని తెలిపారు.

సార్... సోదాలకొస్తున్నాం!



- ఐపీఎస్ సంజయ్‌పై ఏసీబీ 'ప్రేమ'
- తనిఖీల సమాచారం ముందుగానే లీక్
- ఆపై మూడు రోజుల తర్వాత సోదాలు
- ఈలోపే మొత్తం ఫర్నీచర్ తరలింపు
- తనిఖీల్లో ఏమీ దొరకలేదంటూ నివేదిక

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ చిక్కితే ఆయన ఇంట్లో వెంటనే ఏసీబీ సోదాలు చేస్తుంది. ఆదాయానికి మించిన ఆస్తులున్న వారి కేసుల్లో బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ అధికారులు తనిఖీలు చేస్తారు. ఇవన్నీ వెంటవెంటనే జరిగిపోతాయి. కానీ, ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ విషయంలో ఏసీబీ మమకారాన్ని చూపించుకుంది. ఆయన ఇళ్లలో ఉన్న సామగ్రిని మొత్తం మాయం చేసిన తర్వాత, తీరిగ్గా వెళ్లి సోదాలు చేసి... 'అక్కడ ఏమీ లేవు' అని నివేదికలో రాసింది. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అగ్నిమాపక శాఖలో యాప్ రూపకల్పనకు సంబంధించి సుమారు 1.05 కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్ ప్రధాన నిందితుడు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన కోర్టులో లొంగిపోయి, తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. నిజానికి... కేసు నమోదు చేసిన వెంటనే సంజయ్‌కి సంబంధించిన ఇళ్లలో సోదాలు జరపాల్సింది. కానీ... అలా చేయలేదు. ఆయనకు ఎక్కడెక్కడ ఇళ్లున్నాయో ఏసీబీ అధికారులకు స్పష్టంగా తెలుసు. సంజయ్‌కి హైదరాబాద్ బేగంపేటలోని కుందన్‌బాగ్‌లో ఉన్న కంట్రీ క్లబ్ అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్ ఉంది. గుంటూరులోనూ ఒక ఫ్లాట్ ఉంది. ఈ రెండు కాకుండా కుందన్‌బాగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారుల క్వార్టర్స్‌లో ఉంటున్నట్టు సమాచారం. సంజయ్ సీఐడీ చీఫ్‌గా, అగ్నిమాపక శాఖ ఏడీజీగా పనిచేసిన సమయంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి ముడుపులను వస్తురూపంలో తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కంట్రీక్లబ్ అపార్టుమెంట్‌లో ఖరీదైన సామగ్రిని పెట్టించారు.

ముందే ఉప్పందించి...: ఈ నెల 19న సంజయ్ ఇళ్లలో చేసే సోదాలు జరపాలని నిర్ణయించారు. అప్పుడైనా యుద్ధ ప్రాతిపదికన సోదాలు జరిపారా అంటే అదీ లేదు. తీరిగ్గా... ఈనెల 23న ఆ పని చేశారు. కానీ, 20వ తేదీనే 'సోదాల సమాచారం' సంజయ్‌కి చేరింది. దీంతో ఆయన కంట్రీక్లబ్ ఫ్లాట్‌లో ఉన్న సామగ్రిని మరో చోటికి తరలించేశారు. అదే ఫ్లాట్‌లో తాను ఏర్పాటు చేసుకున్న ఖరీదైన స్విచ్ బోర్డులను సైతం మార్చేశారు. కుందన్‌బాగ్‌లో ఉన్న క్వార్టర్స్, గుంటూరులోని అపార్టుమెంట్‌లో ఉన్న సామగ్రిని మొత్తం స్నేహితులు, బంధువుల ఇళ్లకు తరలించేశారు. ఇదంతా పూర్తయిన తర్వాత... ఏసీబీ అధికారులు తీరిగ్గా సోదాలకు బయలుదేరారు. ఈ నెల 23న మూడు ఇళ్లలో సోదాలు చేశారు. అక్కడ రూ.3-4 లక్షల నగదు మినహా ఇతరత్రా ఏమీ లభించలేదని నివేదిక రాసి అధికారులకు సమర్పించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. సోదాలపై లీకులు ఇచ్చేసి... ఆ తర్వాత మూడు రోజులకు వెళితే ఇంకేముంటుంది!

పరిమళించిన మానవత్వం



(మొదటి పేజీ తరువాయి)

ఇంజెక్షన్ వేయిస్తే చిన్నారి కలకాలం క్షేమంగా ఉంటుందని తెలిసి చేయి చేయి కలిపారు. తమకు తోచిన సాయం చేసి రూ.10కోట్ల వరకు ఆ చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. మరోపక్క ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్ (పీఎంఆర్ఎఫ్) నుంచి రూ.50లక్షలు మంజూరయ్యాయి. దీంతో తమ కుమార్తెను బతికించుకుంటామనే ఆశలు ఆ పేద దంపతుల్లో చిగురించాయి. మరో రూ.6కోట్లు అవసరం ఉంటుందని, ప్రభుత్వం సాయం చేయాలని తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. మరో వారం పది రోజుల్లో చికిత్స చేపడతామని వైద్యులు చెప్పినట్లు పునర్వికశ్రీ తండ్రి సురేశ్ బుధవారం ఆంధ్రజ్యోతికి వివరించారు.

అది సాధారణ జబ్బు కాదు..

కర్నూలు జిల్లా వెల్దుర్తి గ్రామానికి చెందిన జంపాల మంగలి సురేశ్ కుమార్, పుష్పావతి దంపతులకు కుమారుడు, కూతురు ఇద్దరు సంతానం. వారిది మేనరిక వివాహం. కుమార్తె పునర్వికశ్రీ 2025 మే 12న జన్మించింది. పుట్టినప్పుడు 3.5 కిలోల బరువు ఉన్న ఆ చిన్నారి నాలుగైదు నెలలు నిండినా శరీరాన్ని కదలించకపోవడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆరు నెలల చిన్నారిని హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆ పాపకు అరుదైన వ్యాధి ఎస్ఎంఏ సోకిందని తెలిపారు. ఈ వ్యాధి వెన్నెముకలోని కణాలను దెబ్బతీసి కండరాల బలహీనత, క్షీణతకు దారితీస్తుందని చెప్పారు. దీనివల్ల నడవడానికి కష్టం అవుతుందని, ఒకేసారి ఇచ్చే జోన్‌మెన్‌స్మా ఇంజెక్షన్‌తో నయం చేయవచ్చని చెప్పారు. ఆ ఇంజక్షన్ ఖరీదు రూ.16 కోట్లు ఉంటుందని వైద్యులు చెప్పడంతో ఆ పేద తల్లిదండ్రులు ఒక్కసారి కుంగిపోయారు. దాతల సాయం కోసం ఎదురు చూశారు. ఆ కన్నవాళ్ల ఆవేదనను గతేడాది డిసెంబరు 10న ఆంధ్రజ్యోతి ప్రధాన పత్రికలో 'పునర్వికకు పునర్జన్మనివ్వరూ..!' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో వారి ఆవేదన వెలుగులోకి వచ్చింది. ఆ కథనంతో రాష్ట్రం నుంచేగాక పొరుగు రాష్ట్రాల్లోని మానవతా మూర్తులు స్పందించారు.

చేయి చేయి కలిపి..

దాతల సాయంతో పాటుగా ఇంజెక్షన్ తయారీ కంపెనీ వారి లక్కీడ్రా ద్వారా, క్రౌడ్ ఫండింగ్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా సాయం పొందవచ్చని తెలుసుకున్న సురేశ్ కుమార్.. ఇంపాక్ట్ గురు క్రౌడ్ ఫండింగ్ సంస్థను ఆశ్రయించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సాయం చేయాలని అభ్యర్థించారు. విశాఖలో జరిగిన భారత్-దక్షిణాఫ్రికా వన్డే క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కూడా తన కూతురి పరిస్థితి వివరిస్తూ సాయం కోరారు. సోషల్ మీడియాలోనూ చాలామంది స్పందించారు. మానవత్వంతో స్పందించి డబ్బులు సేకరించారు. మంత్రి టీజీ భరత్, ఎంపీ బైరెడ్డి శబరి సిఫారసుతో పీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 50 లక్షలు మంజూరయ్యాయి. చిన్నారికి అవసరమైన చికిత్స, ఇంజెక్షన్ కోసం హైదరాబాద్‌లోని రెయిన్‌బో వైద్యులను కలిశానని, దాతల ద్వారా వచ్చిన మొత్తం, పీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన నిధుల గురించి వైద్యులకు వివరించానని చిన్నారి తండ్రి సురేశ్ తెలిపారు. వైద్య బృందంతో చికిత్సకు అవసరమైన ఇంజెక్షన్ తెప్పించడంపై వారం పది రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని వైద్యులు చెప్పారన్నారు.

అండగా ఉంటా: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పునర్వికను ఆదుకునేందుకు మంత్రి లోకేశ్ ముందుకొచ్చారు. ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని రక్షించుకునేందుకు తల్లిదండ్రులు చేసిన విజ్ఞప్తితో దాతలు ఇప్పటికే రూ. 10 కోట్లను సమకూర్చారు. మరో రూ.6 కోట్లు తక్కువ కావడంతో పునర్విక తల్లిదండ్రులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తమ చిన్నారిని ఆదుకోవాలని కోరారు. స్పందించిన లోకేశ్ పునర్వికను ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని, మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నౌకాదళానికి నూతన శక్తి

- మిలాన్-2026 కొత్త స్ఫూర్తిని ఇచ్చింది
- ఈఎన్‌సీ రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద



విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలోకి ప్రతి 50 రోజులకు ఒక నూతన శక్తి వచ్చి చేరుతోందని తూర్పు నౌకాదళానికి చెందిన రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద అన్నారు. మిలాన్-2026 ముగింపు సందర్భంగా బుధవారం ఆయన ఐఎన్ఎస్ విక్రాంత్‌పై విలేకరులతో మాట్లాడారు. దేశీయ పరిజ్ఞానంతోనే అన్ని నౌకలు, బోట్లు, విమానాలు తయారవుతున్నాయని తెలిపారు. చిన్నదో.. పెద్దదో ఏదో ఒకటి ప్రతి 50 రోజులకు ఒకటి నేవీలో చేరుతున్నదని చెప్పారు. మిలాన్‌ను మొదట ప్రారంభించినప్పుడు 5 దేశాలే పాల్గొన్నాయని, ఇప్పుడు ఆ సంఖ్య 75కు పెరిగిందని అన్నారు. ఈసారి నిర్వహించిన మిలాన్‌లో 40 యుద్ధనౌకలు, 29 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని, వాటిలో విదేశీ నౌకలు 18, విమానాలు 5 ఉన్నాయని తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హార్బర్‌లో సమావేశాలు, పరస్పర అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 21 నుంచి 25వ తేదీ వరకు సముద్రంలో పలు విన్యాసాలు చేపట్టామని వెల్లడించారు. యుద్ధ విమానాలు సుమారు 90 గంటలు గగనతలంలో విహారం చేశాయని చెప్పారు. ఈసారి మిలాన్‌లో తొలిసారిగా విమాన వాహక నౌక విక్రాంత్ నుంచి మిగ్-29కె విమానాలు విన్యాసాలు చేశాయన్నారు. ఐఎన్ఎస్ శక్తికి అవసరమైన ఇంధనాన్ని సముద్రంలోనే విదేశీ నౌకలతో అందించడం మరో విశేషమన్నారు. 'సాహసం.. సమన్వయం.. సహకారం' అనే నినాదంతో చేపట్టిన మిలాన్-2026 విజయవంతమైందని, కొత్త స్ఫూర్తిని ఇచ్చిందని పేర్కొన్నారు.

సునీల్ నాయక్‌పై లుకవుట్ నోటీసులు

- విదేశాలకు పారిపోకుండా జారీ
- నాన్‌బెయిలబుల్ వారెంట్ పిటిషన్‌పై కోర్టు తీర్పు నేటికి వాయిదా
- ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు నాయక్
- సెర్చ్ వారెంటు దాఖలుచేసిన పోలీసులు



గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితుడైన ఐపీఎస్ అధికారి ఎం.సునీల్‌కుమార్ నాయక్ విదేశాలకు పారిపోకుండా పోలీసులు లుకవుట్ నోటీసులు జారీ చేశారు. బిహార్ కేడర్‌కు చెందిన ఆయన వైసీపీ ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నాయక్ తన డిప్యుటేషన్‌ను రద్దు చేసుకుని బిహార్ వెళ్లిపోయారు. రఘురామరాజును గుంటూరు సీఐడీ కార్యాలయంలో విచారించిన గదిలో ఆయన కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన్ను విచారించేందుకు పోలీసులు అనేక దఫాలు నోటీసులు ఇచ్చినా ఆయన స్పందించకపోగా.. పట్నా హైకోర్టును ఆశ్రయించారు. ఆ హైకోర్టు నుంచి తీసుకున్న ప్రొటెక్షన్ పిటిషన్‌పై పోలీసులు కౌంటర్ వేయడంతో సునీల్ నాయక్ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుని గుంటూరులోని రెండో అదనపు జూనియర్ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల కోర్టు దానిని కొట్టివేసింది. దీంతో ఆయన్ను అరెస్టు చేయడానికి మూడ్రోజుల కిందట దర్యాప్తు అధికారి అయిన విజయనగరం ఎస్పీ దామోదర్ నేతృత్వంలోని పోలీసు అధికారుల బృందం పట్నాకు వెళ్లింది. అరెస్టు సమయంలో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. ఏపీ పోలీసుల అదుపులో ఉన్న సునీల్ నాయక్‌ను బిహార్ పోలీసులు విడిపించుకుని తీసుకెళ్లారు. ఆ తర్వాత నుంచి ఆయన ఫోన్ స్విచాఫ్ చేసుకుని ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన్ను అరెస్టు చేయడానికి పట్నా వెళ్లిన పోలీసు బృందం అక్కడే మకాం వేసింది. నాయక్‌పై నాన్‌బెయిలబుల్ వారెంటు జారీచేయాలని పోలీసులు మంగళవారం గుంటూరులోని మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం తీర్పు ఇస్తానని ప్రకటించిన న్యాయాధికారి స్రవంతి.. దానిని గురువారానికి వాయిదావేశారు. మరోవైపు.. పోలీసులు బుధవారం కోర్టులో సెర్చ్ వారెంటు దాఖలు చేశారు. దీనిపైనా గురువారం న్యాయస్థానం తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. గడచిన మూడ్రోజులుగా సునీల్ నాయక్ అరెస్టు విషయంలో ఏపీ, బిహార్ రాష్ట్రాల పోలీసుల మధ్య నెలకొన్న పరిస్థితులు వివాదాస్పదంగా మారాయి. అరెస్టు నుంచి మినహాయింపు పొందడానికి నాయక్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. పట్నా హైకోర్టుకు వెళ్లినా ఊరట దక్కలేదు. తాజాగా ఆ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిగి తీర్పు రావడానికి కనీసం వారం పడుతుందని భావిస్తున్నారు. ఈలోగా గుంటూరు కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంటుపై నిర్ణయం ప్రకటిస్తే నాయక్ అరెస్టుకు పోలీసులు వేగంగా కదిలే వీలుంది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనపై లుకవుట్ నోటీసులు జారీ చేశారు.



సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా మంగళవారం రాత్రి మార్కాపురం జిల్లా దోర్నాల వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం ఉదయాన్నే ఇలా వాకింగ్ చేస్తూ కనిపించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో నటరాజ్ కూడలి వరకూ ఒంటరిగా నడుస్తూ ఆయన తన ఉదయపు వ్యాహాళిని పూర్తి చేశారు.

క్రమబద్ధీకరణ దరఖాస్తులు ప్రాసెస్ చేయొద్దు

- పురపాలకశాఖ అధికారులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనధికార, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు పురపాలకశాఖ జారీచేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను తాము తదుపరి ఉత్తర్వులిచ్చేవరకూ ప్రాసెస్ చేయవద్దని అధికారులకు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పురపాలక, పంచాయితీరాజ్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, పురపాలకశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరించేందుకు వీలుగా ప్రభుత్వం పురపాలక చట్టానికి చేసిన సవరణ, తదనంతరం గతేడాది నవంబరు 12న పురపాలకశాఖ జారీచేసిన జీవో 225ను రద్దు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లాకు చెందిన చిన్నబోయిన హరికృష్ణ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ క్రమబద్ధీకరణపై పురపాలకశాఖ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించవద్దని ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు.

'ప్రపంచ యాత్రికుడు' అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

- యూట్యూబ్ చానల్, ఇన్‌స్టా అకౌంట్ మూసివేయాలి
- సంబంధిత సంస్థలకు లేఖ రాయనున్న పంజాగుట్ట పోలీసులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యాత్రికుడిగా పేరు తెచ్చుకున్న యూట్యూబర్ అన్వేష్‌పై బుధవారం లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని సినీనటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి గతేడాది డిసెంబరులో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే పోలీసులు రాసిన లేఖతో అన్వేష్‌కు చెందిన ఒక ఇన్‌స్టాగ్రామ్ ఖతా బ్లాక్ అయింది. విశాఖపట్నానికి చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. ఇప్పుడు ఆయనకున్న ఇతర ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో పాటు యూట్యూబ్ చానల్‌నూ మూసివేయాలని సంబంధిత సంస్థలకు లేఖ రాయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగే గొలుసు దొంగ

- విజయవాడకు చెందిన విద్యుత్ ఉద్యోగి అరెస్టు
- ఇప్పటికే పలు చోరీ కేసులు.. ఆభరణాలు, బైకు స్వాధీనం

తిరువూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓవైపు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ, మరోవైపు దొంగతనాలకు తెగబడుతున్న మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం జి.కొత్తూరు శివారు చిక్కుళ్ళగూడెంలో, ఓ మహిళ మెడలో నానుతాడు తెంపుకొని వెళ్లిన నిందితుడ్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ గిరిబాబు కథనం ప్రకారం.. ఉప్పు అనసూయ అనే మహిళ మెడలో నుంచి సుమారు 40 గ్రాముల బంగారు నానుతాడును గుర్తుతెలియని వ్యక్తి ఈనెల 13వ తేదీన తెంపుకొనిపోయాడు. ఈ నేపథ్యంలో పోలీసులు లక్ష్మీపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని ఎస్ఐ శాతకర్ణి అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. నిందితుడిని విజయవాడ సీతాపురాంపురానికి చెందిన నందం సుభాష్‌బాబుగా గుర్తించారు. అతడి నుంచి సుమారు 33 గ్రాముల బంగారు నానుతాడు, 4 గ్రాముల బంగారు సూత్రాలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నందం సుభాష్‌బాబు విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ లైన్‌మాన్‌గా పనిచేస్తూ, చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నట్టు సీఐ వివరించారు. ఇతడిపై గతంలో పలు కేసులు నమోదయినట్లు తెలిపారు.

అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లకు 6 కమిటీలు

- అభివృద్ధి, ప్రణాళికలు, అమలుకు ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ తరహాలో అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మరో 2 ఎకనమిక్ రీజియన్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రెండు రీజియన్ల అభివృద్ధి, ప్రణాళికలు, అమలు కోసం ప్రభుత్వం 6 కమిటీలు ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రెండు స్టీరింగ్ కమిటీలకు సీఎం, రెండు ఎగ్జిక్యూటివ్ కమిటీలకు సీఎస్, రెండు అమలు కమిటీలకు ఆయా రీజియన్ల సీఈవోలు అధ్యక్షత వహిస్తారు. విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌తో కలిసి ప్రణాళికలు రూపొందించింది. బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించింది. మొత్తం 10 జిల్లాలు ఈ రీజియన్ పరిధిలో ఉన్నాయి. గత ఏడాది నవంబరు 13న సీఎం దీన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా నీతి ఆయోగ్ గుర్తించిన 4 పైలట్ గ్రోత్ హబ్‌ల్లో విశాఖ రీజియన్ కూడా ఉంది. కేంద్రం ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. అభివృద్ధిని రాష్ట్రమంతా విస్తరింపచేయాలనే లక్ష్యంతో అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మరో 2 ఎకనమిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తోంది. విజన్ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలోని 3 ప్రాంతాలను గ్లోబల్ ఎకనమిక్ హబ్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది.

కమిటీల్లో ఎవరెవరంటే...

విశాఖ ఎకనమిక్ రీజియన్ తరహాలోనే అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్ల స్టీరింగ్ కమిటీలకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉంటారు. వ్యవసాయం, రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, విద్యుత్, గృహనిర్మాణం, పర్యాటకం, పురపాలక, పట్టణాభివృద్ధి, అటవీ, ఐటీ శాఖ, పరిశ్రమలు, వాణిజ్యం, వైద్యఆరోగ్య శాఖ, ఆర్థిక, ప్రణాళిక, హోం శాఖ మంత్రులు సభ్యులుగా, ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ఈ రెండు రీజియన్ల ఎగ్జిక్యూటివ్ కమిటీలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు. వ్యవసాయం, రెవెన్యూ, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలికసదుపాయాలు, విద్యుత్, గృహనిర్మాణం, పర్యాటకం, పురపాలక, పట్టణాభివృద్ధి, అటవీ, ఐటీ శాఖ, పరిశ్రమలు, వాణిజ్యం, వైద్యారోగ్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సెక్రటరీలు, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి, రైల్వే శాఖ ప్రతినిధి, పోర్టుల ప్రతినిధి, సెజ్‌ల ప్రతినిధి సభ్యులుగా, రెండు రీజియన్ల సీఈవోలు ఆయా కమిటీలకు మెంబర్ కన్వీనర్లుగా ఉంటారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ అమలు కమిటీకి ఆ రీజియన్ సీఈవో చైర్మన్‌గా, అందులోని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్లతో పాటు ప్రత్యేక ఆహ్వానితులు సభ్యులుగా, సీఆర్‌డీఏ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ అమలు కమిటీకి ఆ రీజియన్ సీఈవో చైర్మన్‌గా ఉంటారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఈ కమిటీలకు నోడల్ ఏజెన్సీగా ఉంటుంది.

అమరావతి ఎకనమిక్ రీజియన్ ఇదీ

అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు ఉన్నాయి. ఈ కారిడార్ విస్తీర్ణం 44,962 చదరపు కిలోమీటర్లు. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఈ జిల్లాల వాటా 35.15 శాతం.

తిరుపతి ఎకనమిక్ రీజియన్ ఇదీ

తిరుపతి ఎకనమిక్ రీజియన్‌లో తిరుపతి, నెల్లూరు, అనంతపురం, కడప, శ్రీసత్యసాయి, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఈ జిల్లాల వాటా 34 శాతం.

పకడ్బందీగా డయేరియా కట్టడి

- ఇప్పటివరకు 102 కేసులు.. ఆస్పత్రుల్లో 85 మందికి చికిత్స

శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ప్రబలిన డయేరియాను అదుపు చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన హుటాహుటిన శ్రీకాకుళం చేరుకుని ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కిమ్స్ తదితర ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించి, అందుతున్న వైద్యసదుపాయాలపై ఆరా తీశారు. శ్రీకాకుళం నగరంలో ఇప్పటి వరకు 102 డయేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. 'ఇప్పటికే 13మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. 85మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉండటంతో డయాలసిస్ అందిస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను విశ్లేషించేందుకు పబ్లిక్ హెల్త్ ఈఎన్సీని రప్పించామని వెల్లడించారు. ప్రాథమిక నీటి పరీక్షల్లో కాలుష్యం అనవాళ్లు ఏమీ బయటపడలేదని తెలిపారు. డయేరియా వల్ల ఒకరు మృతి చెందారంటూ వస్తున్న వార్తలపై నారాయణ స్పష్టత ఇచ్చారు. 'ఒక వ్యక్తి ఇంట్లో మరణించారు. అది డయేరియా వల్లే జరిగిందా అన్నది అనుమానం. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. టిష్యూలను కూడా కల్చర్ టెస్టుకు పంపాం. ఆ రిపోర్టులు వచ్చాకే అధికారికంగా ప్రకటిస్తాం' అని ఆయన తేల్చిచెప్పారు. కాగా, శ్రీకాకుళంలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తాగునీటికి రూ.60 కోట్లు, డ్రైనేజీ కాలువ ఆధునికీకరణకు రూ.35 కోట్లు, మురుగునీటి శుద్ధి కోసం రూ.23 కోట్లు కేటాయించామని నారాయణ తెలిపారు.



చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కమిషనర్ సస్పెన్షన్: శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో డయేరియా (గ్యాస్ట్రో ఎంటరైటిస్) కేసులు ప్రబలడం, ఒకరు ప్రాణాలు కోల్పోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన కార్పొరేషన్ కమిషనర్ హెచ్.కూర్మారావుపై సస్పెన్షన్ వేటు వేసింది.

గొంతు నులిమి.. ఇసుక దిబ్బల్లో పూడ్చి..



- రెండో పెళ్లి చేసుకున్నాక.. కన్నబిడ్డనే కడతేర్చిన తల్లి



ఆశాలత, రెండో భర్త రెడ్డికుమార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రెండో పెళ్లికి అడ్డుగా ఉందని భావించిన ఓ తల్లి తన రెండున్నరేళ్ల కన్న కూతురినే కడతేర్చింది. తిరుపతి ఈస్ట్ పోలీసుల కథనం ప్రకారం... తిరుపతికి చెందిన ఎర్రమల్లి ఆశాలత (19) భర్త రాజేశ్‌తో విభేదాల కారణంగా విడిపోయింది. అప్పటి నుంచి తన రెండున్నరేళ్ల కుమార్తె దుర్గతో కలిసి పోస్టల్ కాలనీలో నివసిస్తోంది. ఏడాది క్రితం ఏర్పేడు మండలం చెన్నంపల్లెకు చెందిన ఇర్లా రెడ్డికుమార్ ఆమెకు ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయమయ్యాడు. వీరిద్దరూ ఏడు నెలలక్రితం పెళ్లి చేసుకున్నారు. ఆశాలతకు ఇదివరకే పెళ్లై కుమార్తె ఉండడంతో రెడ్డికుమార్ తల్లిదండ్రులు అంగీకరించలేదు. దుర్గను అడ్డు తొలగించమని ఆశాలతకు పదేపదే రెడ్డికుమార్ చెప్తుండేవాడు. ఈనేపథ్యంలో ఈనెల 19న పాప తలపై ఆశాలత కర్రతో మోది, గొంతు నులిమి చంపేసింది. ఆశాలత, రెడ్డికుమార్, ఆయన స్నేహితుడు రాము కలిసి ద్విచక్రవాహనంపై చిన్నారి మృతదేహాన్ని తీసుకెళ్లి ఏర్పేడు మండలం పాపానాయుడు పేట వద్ద స్వర్ణముఖి నదీతీరంలో ఇసుకలో పూడ్చిపెట్టి వచ్చారు. ఆశాలత తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆశాలతను, రెడ్డికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యోదంతం వెలుగు చూసింది. ఏర్పేడు తహశీల్దార్ భార్గవి సమక్షంలో ఎస్వీ మెడికల్ కళాశాల వైద్యులు బుధవారం చిన్నారి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం నిందితులు రెడ్డికుమార్, ఆశాలతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రాము కోసం గాలిస్తున్నారు.

టీడీపీ నేతపై వైసీపీ మూకల దాడి

- గురజాల మండలంలో కాపుకాచి.. గొడ్డళ్లు, రాడ్లతో దాడి



రెండు కాళ్లూ విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుకొండలు

గురజాల టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల మండలంలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత బత్తుల ఏడుకొండలుపై వైసీపీ మూకలు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం పులిపాడు - దైద గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఏడుకొండలు బుధవారం గురజాల పట్టణానికి వచ్చి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. వైసీపీ మూకలు ఆయనపై గొడ్డళ్లు, రాడ్లతో దాడి చేశాయి. సమీప పొలాల్లో ఉన్న రైతులు.. అది చూసి.. కేకలు వేస్తూ రావడంతో వైసీపీ మూకలు అక్కడి నుంచి పరారయ్యాయి. ఏడుకొండలు రెండు కాళ్లూ విరిగిపోగా ఎడమ చేయి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన చల్లా చిన్న గురువులు, ప్రేమ్‌కుమార్, బత్తుల శ్రీనివాసరావు, చల్లా ఆంజనేయులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గురజాల పోలీసులు గాలింపు చేపట్టారు. గ్రామంలో ఏడుకొండలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నందున కక్ష పెంచుకున్న వైసీపీ నేతలు దాడికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. వైసీపీ హయాంలో, కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలు దాడులు చేస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు.. వీరిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.